# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి: 9 సంచిక: 12 హైదరాబాద్ 106 డిసెంబర్ 2019 పేజీలు : 52 వెల: 20/-

- అత్యాచారాలకు హత్యలు పరిష్కారం కాదు
- ఇంటలెక్చువల్ అన్‌టచ్‌బులిటి
- 'తెలంగాణోన్ని' కాపాడుకుందాం
- ప్రశ్నించే గొంతులపై అణచివేత
- అగ్గిరాజేసిన మతాధారిత పౌరసత్వ సవరణచట్టం



# ఒక ప్రొఫెసర్ - ఏడు కుట్ర కేసులు

తెలంగాణలో ఏ ప్రజా ఉద్యమ కార్యకర్త మీద కేసు నమోదైనా ఈయన పేరు చేరుస్తారు. విద్యార్థులతోనూ, యువజనులతోనూ, ప్రజాస్వామిక తెలంగాణవాదులతోనూ కలిసి కుట్ర చేస్తున్నాడని నిరంతరం అభియోగం మోపుతారు.

విరసం కార్యవర్గ సభ్యుడిగా మాకాయన కామ్రేడ్ కాశీం. తెలుగు ప్రొఫెసర్‌గా, కవిగా, విమర్శకుడిగా అకడమిక్, సాహిత్య బృందాల్లో చిరపరిచితుడు. నడుస్తున్న తెలంగాణ పత్రిక సంపాదకుడిగా తెలంగాణ పాఠకులకు దగ్గరైన మనిషి. అంతకన్నా కూడా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కె.సి.ఆర్ పుట్టక ముందు నుండి విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, సామాజిక విశ్లేషకుడిగా, వక్తగా తెలంగాణ వ్యాప్తంగానే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రముఖంగా తెలిసిన పేరు.

రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజల పక్షానే మిగిలిన కొద్ది మంది మేధావుల్లో ఒకరు. బహుశా అదే ఆయన నేరం. ప్రజల పక్షం - దళితులు, ఆదివాసులు, కార్మికుల పక్షం నిలిచి ఉండడం కుట్ర. నిజమైన ప్రజాస్వామ్యాన్ని కోరుకోవడం, ప్రజాస్వామిక తెలంగాణను స్వప్నించడం నేరపూరిత సాహసం. తను విశ్వసించే విప్లవ రాజకీయాలు, రచించిన డజను పుస్తకాలు అరడజను ఊపా కేసులను ఆహ్వానించాయి. హైదరాబాదులో ఫాసిస్టు వ్యతిరేక వేదిక బాధ్యులు అనురాధ, రవి లను అరెస్టు చేసినప్పుడు పోలీసు రాసిన ఎఫ్.ఐ.ఆర్.లో మరోసారి కాశీం పేరు చేర్చారు.

హాస్యాస్పదం అనడకం కన్నా అత్యంత వికారమైన సంగతి ఏమిటంటే ప్రతి రోజూ యూనివర్సిటీ క్యాంపస్‌లో, రెండు రాష్ట్రాల్లో అనేక వేదికల మీద కనిపించే కాశీం పోలీసులు దృష్టిలో పరారీలో ఉన్న నిందితుడు. ఈయనే కాదు ఎన్.వేణుగోపాల్, వాళ్ళే అరెస్టు చేసి జైల్లో పెట్టిన నలమాస కృష్ణ ఆచూకీ కూడా తెలీదట. కాశీంపై ప్రభుత్వానికి ఎందుకంత కక్ష? ప్రొఫెసర్‌గా తరగతి గోడలకు పరిమితం కాకుండా విశాల సమాజాన్ని తన మేధో కార్యరంగం చేసుకున్నందుకా? తన జీతమేదో తీసుకొని తన కుటుంబం కోసం, పిల్లల కోసం ఇంత కూడబెట్టి ఇంకా ఉన్నత సోపానాలకు దారులేసుకోకుండా లోకంలో అందరి బాధలూ తనవే అని అందరికోసం మాట్లాడుతున్నందుకా? బాల్యం నుండే తెలంగాణను పలవరించి, ఉద్యమంలో దాడులు, కేసులు ఎదుర్కొని రాష్ట్రం ఏర్పడ్డాక కూడా అధికారానికి రాజీపడకపోవడమా? ఒక్కరి మీద ఇన్ని కుట్రలు రాజ్యం బరితెగింపా, భయమా?

- పి. వరలక్ష్మి

## అక్షరాలను ప్రేమించడం నేరమిక్కడ!

అక్షరాలను ప్రేమించడమే నేరమిక్కడ. కలలుగనడమే ద్రోహమిప్పుడు. నమ్మిన విశ్వాసాల్ని, రాజకీయాల్ని మాట్లాడటం రాజద్రోహమైంది. రాజ్యాన్ని కూల్చే కుట్రయింది. మాటా నిషేధం. పాటా నిషేధం. మా కళ్యాణరావు అన్నట్టు "పుట్టిన కులం నిషిద్ధం. కోరుకున్న పోరాటం నిషిద్ధం. అది నిన్న కావచ్చు. ఈ రోజు కావచ్చు. కాలం ఏదైనా కావచ్చు. ఈ వసంతం అప్పుడూ నిషేధమే. ఇప్పుడూ నిషేధమే."

అతడు నల్లమల అంచున వెల్లువైన పాలికేక. పాలమూరు పసినవ్వుల నెలవంక. ఊరి చివరి గుడిసెలో పూసిన మంకెన పువ్వు. పల్లెటూరి పిల్లగాడు. పసులగాసిన మొనగాడు. రాత్రి బడిలో నేర్చిన అక్షరాలు అతనిలో నిప్పురవ్వల్ని రాజేసినయ్. లందల్ల పొడిసే పొద్దును ఆవాహన చేసుకున్నడు. తెలంగాణ జనసభల్లో నడకలు నేర్చిండు. పాలమూరు వలస బతుకుల గాయాల్ని పాటలల్లిండు. బతుకులు మారే దారిలో నడుస్తున్నడు. రెండు దశాబ్దాలుగా అతని మాట తెలంగాణ. రాత తెలంగాణ. యూనివర్సిటీలో తరగతి గదుల్ని ప్రశ్నించే కెరటాలుగా మారుస్తున్న అలుపెరగని సంద్రమతడు.

అతడు దగాపడ్డ తెలంగాణ బతుకుల్ని మాట్లాడుతున్నడు. గులాబీ పార్టీ పుట్టడం కన్నా పదేళ్ల ముందు నుంచే తెలంగాణను మాట్లాడుతున్నడు. ప్రజాస్వామిక తెలంగాణను పలవరిస్తున్నడు. కలవరిస్తున్నడు. అతడు ప్రొఫెసర్ చింతకింది కాశీం.

రాజ్యం మాటల్లో... అతనిప్పుడో రాజద్రోహి. రాజ్యాన్ని కూల్చే కుట్రదారు. 'ఉపా' కేసుల్తో అతని గొంతును ఆపాలని కుట్ర చేస్తోంది రాజ్యం.

కవులారా, రచయితలారా, బుద్ధిజీవులారా... రండి. ప్రశ్నించే గొంతుల్ని కాపాడుకుందాం. దగాపడ్డ తెలంగాణను బతికించుకుందాం.

- శివరాత్రి సుధాకర్

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

డిసెంబర్ 2019
సంచిక : 12
సంపుటి : 9



*గౌరవ సంపాదకులు*
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

*సలహామండలి*
**అల్లం నారాయణ**
చైర్మన్-ప్రెస్ అకాడమి
**చిక్కుడు ప్రభాకర్**
అడ్వకేట్-న్యాయ సలహాదారు

*ప్రధాన సంపాదకుడు*
**డా॥చింతకింది కాశీం**

**సంపాదకురాలు**
**స్నేహలత ఎం.**

**సంపాదకవర్గం**

**డా॥ఎ.సిల్మానాయక్**, అసోసియేట్ ప్రొఫెసర్
**క్రాంతి**, జర్నలిస్టు
**శివరాత్రి సుధాకర్**, పరిశోధక విద్యార్థి
**ప్రతాప్ గోపగళ్ల**, పరిశోధక విద్యార్థి

*డిటిపి, లే ఔట్* : స్నేహ
*కవర్ డిజైన్* : క్రాంతి



రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
క్వార్టర్ నెం. R-9, O.U క్వార్టర్స్,
ఉస్మానియా యూనివర్శిటి, హైదరాబాద్-500 007.
ఇ.మెయిల్: **nadusthunnatelangana@gmail.com**
**ఫోన్ నెం.: 9290745490**



**నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్: 62254225854**
ఎస్‌బిహెచ్, రాంకోఠి బ్రాంచ్(20350), హైద్రాబాద్.
IFSC: SBIN0020350


## సంపాదకుని ఉత్తరం


ఆకాశం చీకటిలో
అడవి నిద్రించే వేళ
పులినోట చిక్కిన లేడిపిల్లలా
'ఆమె'

తన పాల కోసం విలపిస్తున్న
ఒంటరి బిడ్డ గురించి
ఎంతగా తపించి ఉంటుందో

ఊపిరిబుగ్గ పగిలినంత
సులభంగా
గుండె పగలటం చూసారా?
పౌడర్ డబ్బాలు
పిన్నీసులు
రిబ్బన్లు చెల్లాచెదురై
ఆమె కన్నీటివాగులో
కలిసిపోయాయి

గూటిలో పొదిగిన గువ్వ
గుడ్డు తొలుసుకొని వస్తున్న
ఆడపిట్ట గురించి దిగులుతో ఉంది

మర్యాదస్తులారా
'మానదాహాన్ని' ప్రసవిస్తున్న
వ్యవస్థని ఉరికొయ్యకు వేలాడదియ్యండి



3 జనవరి 2020

*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| అత్యాచారాలకు హత్యలు పరిష్కారం కాదు | | 5 |

**నడుస్తున్న కాలం**

| | | |
|---|---|---|
| ఇంటలెక్చువల్ అన్‌టచ్‌బులిటి | **చింతకింది కాశీం** | 6 |
| ఆమెపై అకృత్యాలు ఆగెదెన్నడు | **స్వాతి ఎస్.** | 9 |
| 'తెలంగాణోన్ని' కాపాడుకుందాం | **చంద్రయ్య ఎస్.** | 12 |
| ప్రశ్నించే గొంతులపై అణచివేత | **శివరాత్రి సుధాకర్** | 15 |
| సంకెళ్ల నుంచి మొలకెత్తిన ధిక్కారం | **అరసవెల్లి కృష్ణ** | 18 |
| హత్యకు మూలాలు ఏమిటి? | **చైతన్య** | 21 |
| ప్రభుత్వం ముందే ప్రకటిస్తే...?! | **కె.సూర్యం** | 24 |

**జాతీయం**

| | | |
|---|---|---|
| అగ్గి రాజేసిన మతాధారిత పౌరసత్వ సవరణ చట్టం | **సంతోష్** | 27 |
| రైతాంగానికి హానిచేసే నూతన విత్తనబిల్లు | **ఎ.నర్సింహ్మారెడ్డి** | 33 |

**పరిశోధన**

| | | |
|---|---|---|
| తెలంగాణ పోరాట కవిత్వం | **దుండె రాజేశ్వరి** | 38 |

**సాహిత్యం**

| | | |
|---|---|---|
| ఉద్యోగాలు లేనిచోటు కథ | **సమీర** | 41 |


**నగరాల్లో అత్యధికంగా**
**అత్యద్భుతంగా అస్థిపంజరాల్ని**
**చెక్కే ఉలి ఆకలి...**

**బస్, రైల్వే ఛార్జీలే కాదు**
**ఇక్కడ లాఠీఛార్జీలూ**
**ఎక్కువే**

**- అలిశెట్టి ప్రభాకర్**

# అత్యాచారాలకు 'హత్యలు' పరిష్కారం కాదు

నవంబర్ 27న హైదరాబాద్‌లో జరిగిన వెటర్నరీ డాక్టర్ దిశ అత్యాచారం, హత్య ఘటన దేశాన్ని కుదిపేసింది. 2012 నిర్భయ ఘటన తర్వాత మరోసారి దేశవ్యాప్తంగా మహిళల రక్షణ కోసం వేలాది మంది రోడ్ల మీదికొచ్చి నిరసనలు తెలియజేశారు. రాష్ట్ర రాజధాని నగరంలో జాతీయ రహదారి పక్కనే ఓ యువతిపై నలుగురు యువకులు అత్యాచారానికి పాల్పడి, హత్య చేయడం దేశంలో మహిళల దుస్థితికి నిదర్శనం. మహిళల భద్రత పట్ల పాలకులకు, పోలీసు యంత్రాంగానికి ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనం.

దిశ అత్యాచారానికి గురైన రోజు రాత్రి, తమ కూతురు ప్రమాదంలో ఉందంటూ ఫిర్యాదు చేయడానికి వెళ్లిన దిశ తల్లిదండ్రులతో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత అమానుషమైనది. ఫిర్యాదును తీసుకోకుండా, ఇది తమ పరిధిలోని వ్యవహారం కాదంటూ మూడు పోలీసుస్టేషన్లు తిప్పడంతో పాటు, మీ కూతురు ఎవరితోనైనా లేచిపోయిందా? అంటూ అవమానకరంగా మాట్లాడారు. పోలీసుల నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది.

దిశ ఘటనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజల నుంచి నిరసన వ్యక్తంకావడంతో వెంటనే నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు... తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు కస్టడీలో ఉన్న వారిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్యచేశారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ పేరుతో అర్ధరాత్రి నగర శివారుకు తీసుకెళ్లి కాల్చిచంపిన పోలీసులు తప్పించుకునేందుకు యత్నించారంటూ కట్టుకథను వినిపించారు. ఉరిశిక్షలు, బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలతో అత్యాచారాలు ఆగుతాయనుకునే ప్రజల భావోద్వేగాలను అనుకూలంగా మార్చుకొని చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారు పోలీసులు. రేపొద్దున నేరం చేయని ఎవరినైనా చంపేందుకు పోలీసులు వెనకాడరని ఎన్‌కౌంటర్‌ని సమర్థించే జనాలకు తెలియకపోవచ్చు. కానీ ప్రభుత్వాలు కూడా పోలీసుల చర్యను సమర్థించడం అత్యంత విషాదం.

నిర్భయ గ్యాంగ్ రేప్ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ఆందోళనలతో 2013లో కేంద్ర ప్రభుత్వం అత్యాచార నిరోధక చట్టాన్ని (నిర్భయ చట్టం) తీసుకొచ్చింది. యాసిడ్ దాడులు, లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడటం లాంటి నేరాల్లో కఠినమైన శిక్షలు అమలు చేసేందుకు ఈ చట్టాన్ని తీసుకువచ్చినా మహిళలపై దాడులు, అత్యాచారాలు మాత్రం తగ్గలేదు. జాతీయ నేర గణాంకాల బ్యూరో నివేదికల ప్రకారం, 2008లో 21,467 నేరాలు నమోదు కాగా, 2016 నాటికి ఆ సంఖ్య 38,000కి పెరిగింది. 2017లో దేశవ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో 33,658 అత్యాచార కేసులు నమోదయ్యాయి. అంటే కనీసం ప్రతి ఇరవై నిమిషాలకు ఓ అత్యాచారం జరుగుతోంది.

దిశ ఘటన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'దిశ' బిల్లును తీసుకువచ్చింది. ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ లా చట్టం-2019, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ కోర్ట్ ఫర్ స్పెసిఫైడ్ అఫెన్సెస్ అగైనెస్ట్ విమెన్ అండ్ చిల్డ్రన్ యాక్ట్ 2019కు ఏపీ అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. ఈ చట్టం ప్రకారం మహిళలపై అత్యాచారానికి పాల్పడినట్లు నేరం రుజువైతే దోషికి మరణశిక్ష విధించవచ్చు. కానీ 'దిశ' బిల్లు ఆమోదం పొంది కొన్ని గంటలు కూడా గడవక ముందే గుంటూరులో ఐదేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. గతంలో వరంగల్‌లో స్వప్నిక, ప్రణీతలపై యాసిడ్ దాడి చేసిన వారిని పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చిచంపారు. అయినా... అత్యాచారాలు, మహిళలపై దాడులు ఆగిపోలేదు. సమస్య మూలాల్లోకి వెళ్లకుండా శిక్షల్లో పరిష్కారాలు వెతకడం అవివేకం. నిజానికి ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా, వాటిని ప్రయోగించేది అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన వారిపైనే తప్ప, బడా బాబులపైన, నేతలపై కాదు. అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న బాబాలు, రాజకీయ నేతలెందరో సమాజంలో దర్జాగా తిరుగుతున్నారు. కానీ, సామాజికంగా అణగారిన కులాలు, వర్గాల నుంచి వచ్చిన వారి నేర నిరూపణ కాకుండా నిందితులుగా తేల్చేస్తారు. పోలీసులే తీర్పరులై శిక్షలు అమలు చేస్తారు.

మహిళల పట్ల వేల ఏళ్లుగా కొనసాగుతున్న వివక్ష, అందుకు మూలమైన పితృస్వామ్య భావజాలం, స్త్రీ శరీరాన్ని లైంగిక వాంఛ తీర్చే సరుకుగా చూపే మార్కెట్ మాయాజాలం, ఏరులై పారుతున్న మద్యం మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు కారణం. ఈ మూలాల్లోకి వెళ్లకుండా, సాంస్కృతికంగా సమాజంలో మార్పుకోసం ప్రయత్నించకుండా అత్యాచారాలను అంతమొందించడం అసాధ్యం.

**డిసెంబర్ 2019**

# ఇంటలెక్చువల్ అన్‌టచ్‌బులిటి

చింతకింది కాశీం

"ఆయన ఎస్సీ అని మీకు తెలుసుకదా!? టీచర్స్ అసోసియేషన్‌లో జనరల్ సెక్రెటరి పోస్ట్ చాలా ముఖ్యమయినది, మీకేమైన అవసరం వస్తే ఆయన దగ్గరకు వెళ్లవల్సి వస్తది." 2019లో జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(ఔటా) ఎన్నికల సందర్భంగా మాజీ ఔటా అధ్యక్షుడు(సీనియర్ ప్రొఫెసర్) మరో జూనియర్ టీచర్‌తో ఫోన్‌లో జరిపిన సంభాషణ ఇది.

ఓయూ వందేళ్లు పూర్తి చేసుకున్నది. విలువయిన అకడమిక్ ప్రమాణాలను నెలకొల్పింది. గణనీయమైన వ్యక్తులను రూపొందించింది. రాజకీయార్థిక వ్యక్తీకరణలతో పాటు శాస్త్రీయ పరిశోధనలను ప్రపంచానికి చాటింది. అనేక సామాజిక చలనాలకు ఆయువు పట్టుగా ఉంది. భిన్నమైన భావజాలాల మధ్య వైరుధ్య పూరితమైన చర్చను నడిపింది. ఇట్లాంటి ఉజ్వలమైన చరిత్ర కల్గిన యూనివర్సిటీలో అనేక వృత్తి సంఘాలలో టీచర్స్ అసోసియేషన్ కూడా ఒకటి. అయితే ఇక్కడ పనిచేస్తున్న ఔటా గత ఇరవై సంవత్సరాలుగా సంఘ పరివార్ భావజాలం ఉన్న నాయకత్వం చేతిలో ఉంది. ప్రతి ఎన్నికల లోనూ కొన్నిసార్లు యునానిమస్‌గా, కొన్నిసార్లు బలహీనమైన వైరిపక్షం మీద గెలుస్తూ వస్తున్నది. ఒకరకంగా అధ్యయనం, అధ్యాపనం, పరిశోధనా రంగంలో సీరియస్‌గా ఉండేవాళ్లు ఈ సంస్థ కార్యకలాపాల వైపు రావటం లేదు. ఫలితంగా ఔటా అనేది కొందరి ప్రయోజనాలు నెరవేర్చే సంస్థగా మారి బహుళ ప్రయోజనాలను విస్మరించింది. విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచటానికి కృషి చేయవల్సింది పోయి, రోజురోజుకు పతనం వైపు ప్రయాణించటంలో ఔటా మౌనపాత్రను నిర్వహించింది.


తొంభయో దశకం తర్వాత పాలకవర్గాలు ఉన్నత విద్యను సంక్షోభంలోకి ఉద్దేశ్యపూర్వకంగా నెట్టారు. ప్రపంచ బ్యాంకు ప్రాయోజిక అభివృద్ధి నమూనాలో విధ్వంసమైన ముఖ్య రంగం విద్యనే. ఇవ్వాల్టి ప్రైవేట్, విదేశీ విశ్వవిద్యాలయాలకు కావల్సిన ప్రాతిపదిక ఆనాడే పడింది. నిధుల కొరత, అధ్యాపకుల నియామకంలో నిర్లక్ష్యం, మౌలిక వసతుల కల్పనలో అశ్రద్ధ, క్లాస్‌రూం వాతావరణంను దెబ్బతీయటం, అప్రమాణికమైన పరిశోధనలు, విద్యార్థులలో విలువల రాహిత్యం, అధ్యాపకులలో బోధన, పరిశోధన పట్ల పట్టింపులేని తనం మొదలైన సందర్భాలలో ఔటా నాయకత్వం తిరోగమన పాత్రను నిర్వహిస్తున్నది. పాలకవర్గాలు తలచింది, ఔటా అనుకున్నది ఒకటిగానే ఉండింది. అధికార వర్గాలు యూనివర్సిటీలో ప్రవేశపెట్టిన విద్యార్థి, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఔటా నాయకత్వం నిలువరించ లేకపోయింది, పైగా మౌనంగా అంగీకరించింది. స్పష్టమైన విజన్‌తో విశ్వవిద్యాలయాన్ని నడిపించవల్సింది పోయి ముందు చూపు లేని నాయకత్వం మేధావి వర్గాన్ని నడిపించటం చరిత్రలో అతిపెద్ద విషాదం. ఈ విషాద చరిత్రనే ఇంకా కొనసాగు తుండటం పెను విషాదం.

తమకు నచ్చిన, చెప్పుచేతల్లో ఉండే వారికి, అప్రమాణ అధ్యాపకులకు యూనివర్సిటీలో పరిపాలనా పదవులు ఇప్పించటం, అర్హతలు లేనివారికి సీఏఎస్‌లో ప్రమోషన్లు కల్పించటం, తప్పుడు సర్వీస్ సర్టిఫికెట్స్ సృష్టించి సీనియారిటీని ఇవ్వటం, యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతీ ఆరునెలలకు సీఏఎస్‌ను నిర్వహించకుండా అడ్డుకొని తమ అనుయాయులకు అర్హతలు వచ్చినప్పుడే సీఏఎస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం, సీఏఎస్ నోటిఫికేషన్‌ను తరుచుగా పొడిగింప చేస్తూ పోవటం, విశ్వవిద్యాలయంలో జరిగే అభివృద్ధి పనులలో వాటాలు పొందటం, వసతులు లేని కళాశాలలకు దొడ్డిదారిన గుర్తింపు ఇప్పించటం, వీసీ, రిజిస్ట్రార్‌లను బెదిరించి వైయుక్తిక ప్రయోజనాలు నెరవేర్చుకోవటం, కళాశాలలకు సక్రమంగా హాజరు కాని, తరగతిగది బోధన చేయని అధ్యాపకులను వెనకేసుకరావటం ఈ రెండు దశాబ్దాలలో ఔటా నాయకత్వం చేసిన ఘనమైన కార్యాలు. విశ్వవిద్యాలయం స్వయం ప్రతిపత్తిని కోల్పోతూ మెల్లిగా ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లటానికి కావల్సిన ప్రాతిపదికను ఔటా నాయకత్వం అధికారులతో సమానమైన పాత్రను పోషించింది. యూనివర్సిటీ టీచర్లకు ప్రభుత్వానికి వారధిగా పనిచేసి విశ్వవిద్యాలయంలో అకడమిక్ ప్రమాణాలను నెలకొల్పవలసిన ఔటా నాయకత్వం ప్రత్యేకమైన భావజాలంతో పనిచేయటం మూలంగా తెలంగాణ ప్రభుత్వం దగ్గరకు వెళ్లలేని, విశ్వవిద్యాలయ ప్రయోజనాలను చర్చించలేని పరిమితిని

ఎదుర్కొంటున్నది. మూడు వందల మందికి పైగా టీచర్లకు రావల్సిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను గత పదిహేనేళ్లగా ఔటా నాయకత్వం అమలు చేయించలేకపోయింది. అయినా మొత్తం విశ్వవిద్యాలయంపై ఏక చత్రాధిపత్యాన్ని నెరపుతూ ఇన్నేళ్లలో ఎన్నికలలో వారి మీద పోటీ చేసే పరిస్థితిని లేకుండా చేసుకోగలిగింది.

ఇట్లాంటి విషాదకర సందర్భంలో మౌనంగా ఉండటం మేధోవర్గానికి సరైనది కాదని భావించి ప్రజాస్వామిక భావాలు కలిగిన కొందరం కలిసి 2019 సెప్టెంబర్‌లో జరిగిన ఔటా ఎన్నికలలో పోటీ ప్యానెల్‌ను నిలబెట్టాం. కేవలం 15 రోజులలో పది మంది టీం కూర్చోని చర్చించి ప్యానెల్‌ను రూపొందించు కున్నాము. అధ్యయనం, బోధన, పరిశోధనలలో ప్రతిభను కనబర్చుతున్న వారిని మాత్రమే ఈ టీంలో ఉండేటట్లు ప్లాన్ చేసాము. పోటీయే లేదనుకున్నచోట, గెలుపు ఏకపక్షం అని భావించిన సందర్భంలో బలమైన పోటీని రంగస్థలం మీద ఉంచాము. ఎవరైనా పోటీ చేయవచ్చుననే నమ్మకాన్ని కల్పించటవే లక్ష్యంగా ముందుకువెళ్లాము. నామినేషన్ వేసి పార్టీలు చేసుకుంటూ సులభంగా గెలుస్తాములే అనుకున్నచోట ఓడిపోతామనే టన్నులకొద్ది భయాన్ని కల్పించటంలో పోటీ ప్యానెల్ విజయం సాధించింది. ప్రచారవే చేయకుండా విజయం సాధిస్తామనుకున్న వాళ్లు చెమటలు కక్కుతూ కాలేజీలు తిరగవల్సిన అనివార్యతను సృష్టించాము. సంతోషంగా పదవీ విరమణ పొందవల్సిన మాజీ నాయకుని ముఖంలో విషాద ఛాయలను కల్పించగల్గినాము. రెండు దశాబ్దాల తర్వాత ఓయూలో ఎన్నికల సందడి మొదలైందని అధికారుల నుంచి మొదలు ఉద్యోగులు, విద్యార్థులు మాట్లాడుకోవడం ఒక చారిత్రక సందర్భం. కనీసం మా ప్యానెల్ నుంచి మూడు పోస్టులను గెలుస్తామని, జనరల్ సెక్రెటరీ పోస్టు తప్పక గెలుస్తామనే చర్చ స్వపక్షంలో, విపక్షంలో, యూనివర్సిటీలో మొదలైంది.

అసలు కథ ఇక్కడే మొదలయింది. మా ప్యానెల్‌లో ఎవరు గెలిచిన పర్వాలేదు, కానీ జనరల్ సెక్రెటరీగా పోటీచేసిన నేను మాత్రం గెలవకూడదనే పథక రచన చేసారు. వాళ్ల సర్వశక్తులను నామీదే కేంద్రీకరించారు. నేరుగా టీచర్లను కలిసిన సందర్భంలోను, ఫోన్ సంభాషణలలో ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదట నా రాజకీయ విశ్వాసాలను ప్రచారంలో పెట్టారు. ప్రజా అనుకూల నా ఆచరణ వలన ప్రభుత్వం నా మీద మోపిన అక్రమ రాజద్రోహం కేసులను ప్రచారం చేసారు. ఈ రెండు విషయాలు నాకు ప్రతికూలంగా మారటానికి బదులు



అనుకూలించి నా గెలుపునకు అవకాశాలను పెంచాయి. ఇక రెండో ప్రచారం నేను 2013లో యూనివర్సిటీ ఉద్యోగంలోకి వచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్స్ ఇప్పించానని, గత సర్వీస్‌ను కలిపించానని కనుక నేను గెలిస్తే 2007లో ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు న్యాయం జరగదని. నిజమే, 2013లో ఎంపికైన టీచర్లలో చాలామంది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, నేషనల్ రీసెర్చ్ సెంటర్స్‌లో పనిచేసివచ్చారు. న్యాయంగా వారు పొందవల్సిన సర్వీస్‌బెనిఫిట్‌ను, పేప్రొటక్షన్‌ను కొందరు అడ్డుకోవడానికి ప్రయత్నం చేస్తే అధికారులతో మాట్లాడి ఇప్పించడం జరిగింది. ఒకరికి న్యాయం జరిగేలా పని చేయడమంటే మరొకరికి అన్యాయం చేయడం కాదు.

ఇక ప్రధాన ప్రచారం నేను ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవాడినని. నిజమే. ఇందులో దాచిపెట్టుకోవడానికేమీ లేదు. ఈ దేశంలో కులం పుట్టుకతో వస్తుంది. నాకు అలాగే వచ్చింది. ఇప్పటి వరకు(నలభై ఏళ్లుగా) ఔటా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవాళ్లు ఒక్కరంటే ఒక్కరు లేరు. అయితే అగ్రకులాలు లేదంటే బీసీ కులాల నుంచే ఈ రెండు పదవులలో ఉన్నారు. ఓయూలో ఎస్సీ టీచర్లు కనీసం వంద మంది ఉంటారు. వారికి ఔటాకు నాయకత్వం వహించే శక్తి లేదా? వారిని కేవలం ఉపాధ్యక్ష, జెయింట్ సెక్రటరీ పదవులకు మాత్రమే పరిమితం చేసారు. మొదటి జనరల్ సెక్రెటరీ పదవిలో గెలిచే అవకాశమున్న నన్ను కేవలం కులం కారణంగా గెలవకుండా చేసారు. ఎస్సీ జనరల్ సెక్రెటరీ అయితే ఓసీ, బీసీ కులాల టీచర్లు తమ సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం నా చుట్టూ తిరగటం నామోషీగా భావించే విధంగా కొందరు పనిగట్టుకొని భావజాల ప్రచారం చేసారు. 'అతను ఎస్సీ మీకు తెలుసు కదా!' అనే మాటను ముప్పై ఏళ్లకు

పైగా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన వ్యక్తి, టీచర్స్ అసోసియేషన్‌కు నాయకత్వం వహించినవాడు మాట్లాడిన విధానాన్ని సెల్‌ఫోన్ రికార్డులో విన్న తర్వాత నేను ఆశ్చర్యానికి గురయ్యాను.

ఇన్నిరకాల వ్యతిరేక ప్రచారాలు, బెదిరింపులు, అడ్డంకుల మధ్యనే పదిరోజుల ప్రచారం జరిగింది. ఈ ప్రచార సందర్భంలో టీచర్లు కులాలుగా ఏ విధంగా ఘనీభవించి ఉన్నారో అర్థం చేసుకునే అవకాశం దొరికింది. మనుషులను కులాలుగా గుర్తించడం మేధో రంగంలో ఎలా ఉందో తెలిసివచ్చింది. ఓట్ల లెక్కింపు రోజు తార్కికంగా అంచనాకు రావటానికి ఫలితాలు ప్రాతిపదికగా పనిచేసాయి. నన్ను లక్ష్యంగా ఎంచుకున్న ప్రత్యర్థివర్గం ఓట్లను చీల్చడానికి కేవలం జనరల్ సెక్రటరీ స్థానానికి మూడో అభ్యర్థిని పోటీలో నిలబెట్టారు. అతడు బలమైన సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తి. ఆయన కులం ఓట్లు కనీసం 35 వరకు ఉంటాయి. మా ప్యానెల్‌లో అధ్యక్ష స్థానానికి పోటీలో ఉన్న వ్యక్తి పద్మశాలి. ఉపాధ్యక్ష స్థానానికి పోటీ చేస్తున్న వ్యక్తి బంజారా తెగకు చెందినవాడు. సహజంగా మా ప్యానెల్‌లో అధ్యక్షుడికి వచ్చిన ఓట్లు జనరల్ సెక్రెటరీగా నాకు రావాలి. కానీ క్రాస్ ఓటు జరిగింది. అంటే పద్మశాలి టీచర్లు మా ప్యానెల్‌లో తమ కులస్తిడికి మాత్రమే ఓటు వేసి మిగతా ఓట్లను రెండో ప్యానెల్‌కు వేసారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడికి(బంజారా) పడిన ప్రతీ ఓటు మా ప్యానెల్‌లో ఇతరులకు పడకుండా రెండో ప్యానెల్ వైపు వెళ్లాయి. దీనిని జాగ్రత్తగా గమనిస్తే కులపరంగా ఓట్లు చీలాయి. అయితే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాకు ఓటు వేయకుండా ఉండటంలో అందరికీ ఏకాభిప్రాయం కుదిరింది. ఇలా అనటం కంటే టీచర్లలో ఒక అభిప్రాయాన్ని కల్గించడంలో కొందరు సఫలమయ్యారని తెలుస్తుంది. బీసీ టీచర్లు కూడా అగ్రకులాల నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధపడుతారు. కానీ దళితులు నాయకత్వం వహిస్తే సహించే చైతన్యం ఇంకా వాళ్లలో రాలేదనిపిస్తుంది. ఉన్నత చదువులు చదివి, జ్ఞానాన్ని ఆర్జించి, సమాజంలో మేధావులుగా ఉన్నవాళ్లు కూడా కులాన్ని బట్టి ఓట్లు వేసే స్థితి ఉన్నప్పుడు దీనిని ఇంటలెక్చువల్ అన్‌టచ్‌బులిటి అనటంలో అనౌచిత్యమేముంటుంది.

గ్రామాలలో కులం పచ్చిగా కనిపిస్తుంది, బయటికి వ్యక్తమవుతుంది, పాటించబడుతుంది. పట్టణాలలో కులం అమూర్తంగా వ్యక్తమవుతుంది. శారీరక శ్రమచేసే ఉత్పత్తి వర్గాలలో కులం బహిరంగంగానే తెలుస్తుంది. కానీ



మేధోరంగంలో ముసుగు కప్పుకొని ఆచరించబడుతుంది. పార్లమెంటరీ ఎన్నికలలో కుల ప్రభావమే అధికం. వ్యక్తుల గత వర్తమానాలు, క్యారెక్టర్, విలువలు, ప్రజల కోసం పనిచేసే నిజాయితీ మొదలైన వాటికంటే కులాధారితనే ముఖ్యం. విషాదమేమిటంటే ఉన్నత విద్యను అందిస్తున్న చోట అధ్యాపకులు కుల ప్రాతిపదికన ఓటు వేయటమే. కులం లేదని, అది స్వీయాత్మకతని, అది ఉపరితలంలో మాత్రమే ఉంటుందని మాట్లాడే, రాసే బుద్ధిజీవులు ఈ సందర్భాన్ని ఎలా వ్యాఖ్యానించ గలరో? బోధనా రంగంలో ఉండే వారి ఆలోచనలలో విస్తృతి ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. భిన్నమైన సామాజిక సమూహాలతో నిరంతర సంభాషణలో ఉండటం వలన ప్రజాస్వామిక దృక్పథం పరిణతి చెందుతుందని భావిస్తూ ఉంటాం. నిరంతర అధ్యయనం, అధ్యాపనం, పరిశోధన వలన సామాజిక సంస్కారం కూడా అలవడుతుంది. అట్లాంటి చోటే ఎన్నికలు అప్రజాస్వామికంగా ప్రలోభాలతో ఓటింగ్ జరిగితే మన మేధోతనం ప్రశ్నార్థకమవుతుంది కదా? కనీసం ఇంటలెక్చువల్ అన్‌టచ్‌బులిటీని కూడా మనం రూపుమాప లేకపోతే ఈ దేశంలో కుల నిర్మూలన అనే భావనకు చోటుంటుందా? దళితుల నాయకత్వాన్ని ఆర్థిక, రాజకీయ నిర్మాణాలలో సమాజం అంగీకరించనట్లే విశ్వవిద్యాలయాల్లో కూడా మేధోవర్గం అంగీకరించలేని పరిమితి ఏర్పడితే ఇది సమాజ పతనానికి దారితీస్తుంది కదా!

**డిసెంబర్ 2019**

# ఆమెపై అకృత్యాలు ఆగేదెన్నడు

స్వాతి ఎన్

మహిళలపైన రోజురోజుకూ లైంగిక దాడులు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా హైదరాబాద్ శివారు ప్రాంతంలో పశువైద్యురాలు దిశపై అమానుషంగా నలుగురు యువకులు లైంగిక దాడి చేసి చంపేశారు. గంటల వ్యవధిలోనే వరంగల్‌లో మరో యువతి మానస అత్యాచారానికి, హత్యకు గురైంది. ఆమె పుట్టిన రోజునే మృత్యు ఒడికి చేరింది. ఆ మర్నాడే ఆదిలాబాద్ జిల్లాలో పొట్టకూటి కోసం వెళ్లిన టేకు లక్ష్మి అనే మహిళ అత్యాచారానికి గురై హత్య చేయబడింది. ఇలాంటి ఘటనలు దేశంలో ఏదో మూలన నిత్యం ప్రతీ నిముషం జరుగుతూనే ఉన్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం దేశంలో ఒక్క 2016లోనే 1,46,201 లైంగిక దాడుల కేసులు నమోదయ్యాయి. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 2017లో 17,521 కేసులు నమోదయినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.


ఏడాదికేడాది నేరాల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. 2012లో దేశ రాజధాని నడిబొడ్డున నిర్భయ అనే యువతిపై అతికిరాతకంగా లైంగికదాడి జరిగినప్పుడు దేశం నలుమూలల నుంచి ప్రభుత్వానికి ప్రజావ్యతిరేకత ఎదురయింది. ప్రజలు కోపోద్రేకులయ్యారు. న్యాయం కోసం నినదించారు. ప్రజల ఆవేశాన్ని తగ్గించేందుకు కఠినమైన చట్టాలు లేకపోవడం వల్లనే మహిళలపై అమానుష ఘటనలు జరుగుతున్నాయని, వాటిని అదుపు చేసేందుకు కొత్త చట్టాన్ని తీసుకువస్తామన్నారు నాటి పాలకులు. అదే ఏడాది నిర్భయ చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టం రూపుదాల్చినా ఎక్కడా మహిళలపై అత్యాచారాలు, హత్యలు మాత్రం లేదు. ఆ తర్వాత కూడా దేశంలో నిత్యం అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. 2014లో ముంబాయిలో అభయ అనే యువతిని క్యాబ్‌లో గ్యాంగ్‌రేప్ చేసి చంపారు. ఇలా మహిళలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయి. పేరు మారుతుంది ఊరు మారుతుంది. ఘటన తీరులో హింస మరింత పెరుగుతున్నది.

ఏడేండ్ల కింద నిర్భయ ఘటన సందర్భంగా ప్రజల నుంచి ఎలాంటి స్పందన వచ్చిందో, నిన్నటి దిశ ఘటన సందర్భంగా కూడా అదే తరహా స్పందన వచ్చింది. ప్రభుత్వాల తీరును ప్రశ్నిస్తున్నారు. కొందరు నిందితులను ఉరితీయాలని, మరికొందరు నిందితులను తమకు అప్పగించండి మేం చూసుకుంటాం అంటున్నారు. బాధితుల పక్షాన నిలబడిన వారు లైంగిక దాడులకు పరిష్కారాన్ని కోరుతున్నారు.

వరంగల్‌లో స్వప్నిక, ప్రణీతలపై యాసిడ్ దాడి జరిపిన నిందితులను ఎన్‌కౌంటర్ చేశారు. అంతటితో నేరాలు ఆగాయా? విజయవాడలో మనోహర్‌కు ఉరిశిక్ష విధిస్తు కోర్టు తీర్పు నిచ్చింది. పైకోర్టు దాన్ని యావజ్జీవ శిక్షగా మార్చింది. ఉరిశిక్షలతో, ఎన్‌కౌంటర్‌లతో నేరాలు ఆగవనేది స్పష్టం.

మహిళలపై అత్యాచారాలు జరిగిన ప్రతిసారి దాని తీవ్రతను బట్టి పాలకులు తమ వైఖరిని వ్యక్తపరుస్తున్నారు. దిశ ఘటనపై హోంమంత్రి స్పందిస్తూ 100కు డయల్ చేయాల్సింది అన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఇంటికొక పోలీసును పెట్టలేం కదా అన్నారు. దిశ బైక్ పంక్చర్ అయిందని, లారీ డ్రైవర్లు తననే చూస్తున్నారని తన చెల్లికి ఫోన్ చేసింది. తర్వాత అరగంటకు ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఇదే విషయంపై దిశ తండ్రి షాద్‌నగర్ పీఏస్‌లో కంప్లయింట్ ఇవ్వడానికి వెళితే మీ అమ్మాయి ఎవరితోనే లేచిపోయి ఉంటుందంటూ పోలీసులు అవమానిస్తూ మాట్లాడారు. కేసు నమోదు చేసుకోవడానికి బదులు ఆ ఏరియా తమ పరిధిలోకి రాదంటూ, మరో పోలీస్ స్టేషన్‌కి వెళ్లాలంటూ మూడు పోలీస్ స్టేషన్‌లు తిప్పించారు. నేరుగా ఫిర్యాదు చేస్తేనే స్పందించని పోలీసులు 100కి ఫోన్ చేస్తే స్పందిస్తారనడం హాస్యాస్పదం.

రెండు రోజుల క్రితం నల్లగొండలో గుండ్లపాడు వద్ద ఇందిరానగర్ క్రాస్‌రోడ్‌లో విజయలక్ష్మీ అనే అమ్మాయి, తనపై కొంత మంది దాడికి దిగుతున్నారని 100కు డయల్ చేసి చెప్పింది. వెంటనే వాళ్లు ఒక మెసేజ్ పంపించి, అందులోని నెంబర్‌కి ఫోన్ చేస్తే పోలీస్ స్టేషన్ వాళ్లు మీ కంప్లయింట్‌ను తీసుకుంటారని సమాధానం చెప్పారు. వాళ్లు ఇచ్చిన నెంబర్‌కు ఫోన్ చేస్తే 'మేం లంచ్ చేస్తున్నాం. అయినా మాకు తీరికలేదు'



అని ఫోన్ కట్‌చేశారు. ఈ సంభాషణంతా జరగడానికి దాదాపు 20 నిమిషాల సమయం పడుతుంది. ప్రమాద పరిస్థితుల్లో ఎవరైన ఇంత తీరిక్గా ఫోన్ మాట్లాడి, నెంబర్ నోట్ చేసుకుని, తిరిగి పోలీస్ స్టేషన్‌ని సంప్రదించగలరని హోం మంత్రి ఎలా అనుకోగలిగాడో మరి. పోలీసుల తీరు, మంత్రుల వైఖరి చూసి ప్రజలకు ప్రభుత్వాల పైన, పోలీస్ వ్యవస్థపైన నమ్మకం పోతున్నది. ఆ విషయం పోలీసులకు కూడా అర్థమైనట్టుంది. అందుకే దాడులు జరిగిన ప్రతిసారి విద్యార్థుల వద్దకు షీటీమ్స్, పోలీస్ కళాజాత, నా పోలీస్ నా భద్రత వంటి రకరకాల పేర్లతో విద్యార్థుల్లో నమ్మకాన్ని ప్రోదిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

అసలు ఇంతగా అత్యాచారాలు, వేధింపులు, హత్యలు జరగడానికి కారణం ఎవ్వరు? నేరస్తులు ఎక్కడి నుంచి పుట్టుకొస్తున్నారు. వారిని పెంచి పోషిస్తున్నది ఎవ్వరు? మహిళలపై దాడులు జరిగిన ప్రతిసారి నేరస్తులు విచారణలో చెప్పిన మాటలు 'మేం మద్యం మత్తులో ఉన్నాం. ఏం చేస్తున్నామో తెలియలేదు' అనే కదా. అంటే ఇలాంటి నేరాలకు ఒకానొక ప్రధాన కారణం మద్యం అని ఈ పాలకులకు ఎందుకు అర్థం కావడం లేదు. తెలంగాణలో మద్యం ఏరులై పారుతున్నది. విచ్చలవిడిగా బెల్టుషాపులు తెరిచి నేరాలను ప్రభుత్వమే ప్రోత్సాహిస్తున్నది. ఒకవైపు మద్య పాన నిషేధం చేయాలని మహిళలు పోరాడుతున్నారు. రిజర్వేషన్ పేరిట చివరికి మహిళలను కూడా బెల్ట్ షాపుల టెండర్ల కోసం క్యూలో నిల్చునేలా చేసింది.

దిశ సంఘటన జరిగినప్పుడు కేసీఆర్ మాట్లాడుతూ 'మృగాలు మనమధ్యనే తిరుగుతున్నాయి. జాగ్రత్తగా ఉండాలి. అందుకే మహిళా కండక్టర్‌లకు 8 గంటలకే డ్యూటీ ముగించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని తెలిపారు. అసలు నేరస్తులను తయారు చేస్తున్నదే ప్రభుత్వ విధానాలు అయినప్పుడు ఈ కంటి తుడుపు చర్యల వల్ల ఎవరికి ప్రయోజనం చేకూరుతుంది? మద్యపానాన్ని నిషేధించాలని నినదిస్తున్న వారిని కేసుల్లోకి నెట్టివేస్తున్న ఈ పాలకులు మహిళలకు భద్రత కల్పిస్తారంటే నమ్మేదెలా?

నేరాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా 18 ఏండ్లకు లోబడిన వారేనని, అందులోనూ పేద వర్గానికి చెందిన వారు అధికంగా ఉన్నారని వివిధ సందర్భాల్లో నివేదికలు చెబుతూనే ఉన్నాయి. నిర్భయ ఘటనలో ఓ మైనర్ బాలుడు నిందితుడిగా ఉండడమే అందుకు నిదర్శనం.

అసలు చిన్న వయసులోనే నేరాలు చేయాలని, లైంగిక దాడి చేయాలని ఆలోచన కల్పిస్తున్నది ఎవరు? మహిళను సరుకుగా, సెక్స్ సింబల్‌గా చూపిస్తున్న సినీ కల్చర్, పోర్న్ వీడియోలను అడ్డుకోలేని పాలకులే ఇందుకు బాధ్యులు కాదా? 18 ఏండ్లు నిండని వారికి మద్యం అమ్మకూడదనే నిబంధనలు

అమలు చేయాల్సింది ప్రభుత్వాలే కదా. మరి ఎందుకు ఆ నిబంధనలు అమలు చేయట్లేదు?

బాలకార్మికులను బడిలో చేర్పించాలని 1986లోనే చట్టం తీసుకవచ్చారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ 2005 నివేదిక ప్రకారం భారతదేశంలో 62.8 శాతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 70నుంచి 80 శాతం బాలకార్మికులు ఉన్నారు. ప్రపంచ దేశాలతో పోల్చితే 3.8 శాతం బాల కార్మికులతో భారతదేశం అగ్రస్థానంలో ఉన్నది. వీరిని బడిలో చేర్పించి స్కిల్స్ డెవలప్ చేయించాల్సిన ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కేవలం చట్టం ఏర్పడిన రోజున మాత్రం ర్యాలీలు, ప్రచారాలతో చేతులు దులుపుకుంటున్నారు.

ఎన్ని ప్రభుత్వాలు మారినా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో మాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించ లేక పోతున్నాయి. ఫలితంగా చదువుకు దూరంగా కోట్లాది మంది పిల్లలు రోజు కూలీలుగా పనిచేస్తున్నారు. లారీ డ్రైవర్లుగా, క్లీనర్‌లుగా ఉంటూ మద్యానికి, గుట్కాలకు, మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారు. పోర్న్ వీడియోల ప్రభావంతో మహిళలపైన అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

నిజానికి దేశంలో గంటకో అత్యాచారం జరుగుతున్నా వెలుగులోకి వచ్చేవి కొన్ని మాత్రమే. వాటిల్లోనూ పట్టణాల్లో జరిగే ఘటనలకు మీడియాలో లభించే ప్రాధాన్యత వల్ల ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతుంది. మహిళలకు రక్షణ కల్పించలేని పోలీసు వ్యవస్థ, ప్రభుత్వాల పట్ల ఆగ్రహం ఎవరికి వారిని న్యాయనిర్ణేతలుగా మార్చుతుంది. ఫలితంగా నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని, బహిరంగంగా ఉరితీయాలనే వాదనలు ముందుకు వస్తాయి. వాస్తవానికి నిందితులను చంపినంత మాత్రాన నేరాలు ఆగిపోతాయనుకోవడం భ్రమే. ఎందుకంటే.. ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా, ఎందరిని చంపినా అలాంటి వార్తలను, సమాచారాన్ని తెలుసుకోలేని యువత కోట్ల సంఖ్యలో ఉంటుంది. చదువుకు దూరంగా తమదైన ప్రపంచంలో బతికే వారికి ఈ చట్టాల గురించి అవగాహన కూడా ఉండదు. అలాంటి వాళ్లు రేపొద్దున ఈ శిక్షలకు బయపడి నేరాలు చేయకుంటా ఉంటారని అనుకోవడం అర్థరహితం.

శిక్షలతో మార్పు ఎప్పుడూ తీసుకురాలేము. మార్పు రావల్సింది సమాజంలో. సమాజం పెంచి పోషిస్తున్న సంస్కృతిలో. స్త్రీని భోగ వస్తువుగా చూసే సంస్కృతి, మతం మన మెదళ్లలోకి ఎక్కించాక, ఇంట్లో తల్లిని, చెల్లిని బానిసగా చూడడమే అలవాటయ్యాక, సినిమాల్లో స్త్రీని ఒక అంగడి సరుకుగా చూశాక మనుషులు ఎలా తయారవుతారు? సెక్స్ అంటే బూతు అని, అలాంటి విషయాల గురించి మాట్లాడ కూడదని కుటుంబాల్లో విధించే ఆంక్షలు, బడిలో కళాశాలలో సెక్స్ ఎడ్యుకేషన్‌కి సంబంధించిన అవగాహన కల్పించపోవడం లాంటి ఎన్నో అంశాలు యువత ఆలోచనలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ వాస్తవాలను గుర్తించకుండా, ఒక కల్చర్‌గా పరిణామం చెందిన అత్యాచారాలను అరికట్టడం అసాధ్యం.

మానవీయ విలువలు నేర్పించాల్సిన విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించి, విద్యార్థులను ర్యాంకుల రేసులో పరుగు పెట్టించే పాలకులు, తల్లిదండ్రులు, ధనార్జన కోసం మద్యాన్ని ఏరులుగా పారిస్తున్న, నీలి చిత్రాలను సమాజం ముందు కుమ్మరిస్తున్న పెట్టుబడిదారులంతా ఈ నేరాలకు కారకులే. మనుషులతో గడపాల్సిన సమయాన్ని యంత్రాలతో గడుపుతున్న కాలంలో మానవీయ విలువల గురించి మాట్లాడుకోవడం అత్యాశే అవుతుంది కాబోలు. అయినా... మార్పు పునాది నుంచి జరగాలి. ఇంట్లోంచి మొదలవ్వాలి. రాత్రిపూట అమ్మాయిని బయటకు వెళ్లొదని చెప్పే బదులు, ఆడవాళ్లను గౌరవించాలని అబ్బాయిలకు చెప్పడం మొదలయినప్పుడు ఎంతో కొంత మార్పు జరుగుతుందని ఆశించవచ్చు.

*రచయిత: జర్నలిస్టు*


## 'నడుస్తున్న తెలంగాణ'లో మీ ప్రకటనలకై సంప్రదించండి


| | | |
|---|---|---|
| చివరి కవర్(కలర్‌లో పూర్తి పేజీ) | : | రూ.40,000 |
| రెండవ కవర్(కలర్‌లో పూర్తి పేజీ) | : | రూ.35,000 |
| మూడవ కవర్(కలర్‌లో పూర్తి పేజీ) | : | రూ.30,000 |
| పూర్తి పేజీ(బ్లాక్ అండ్ వైట్) | : | రూ.25,000 |

# 'తెలంగాణోన్ని' కాపాడుకుందాం!
# ఆలోచనలను బతికించుకుందాం!!

ఎస్.చంద్రయ్య

మనిషి సమకాలీన ప్రపంచంతో తృప్తిపడక కొత్త ప్రపంచాన్ని కలగంటుంటాడు. సామయిక ప్రపంచంలోని ఖాళీలను ఏవో కొత్త సంగతులతో, పరికరాలతో పూరించాలని తహతహలాడుతుంటాడు. ఆలోచనలకు ప్రేరణైన సమాజాన్ని ఉన్నదున్నట్టుగా అర్థం చేసుకుంటే అది అర్థంకాక ఒక సంక్లిష్ట పదార్థంగానూ, జడపదార్థంగానూ తోస్తుందని భావిస్తాడు. దాన్ని మరింత ఆనందమయం, సుఖవంతం, సుందరమయం చేయాలనే కుతూహలం 'ఆలోచనలు' కలిగిన ప్రతి మనిషిలోనూ ఉంటాయి. చిత్రకారుడు రంగులకు మరిన్ని కొత్త రంగులను కలిపి ఉన్న వాస్తవానికి మరింత సౌందర్యాన్ని అద్దుతాడు. ఇక సాహితీ వేత్త సరే సరి. వీటిన్నింటికంటే భిన్నమైనది, సంక్లిష్టమైనది సామాజిక, రాజకీయ రంగం. సమాజాన్ని మరింత ఆనందమయం చేయటానికి, మనుషుల మధ్య అసమానతలను రూపుమాపాలని బృహత్తర ఆశయంతో బయలుదేరినవారు మేధావులు, ఆలోచనాపరులు. నిజానికి వీరంతా పిడికెడు మందే కావచ్చు. కానీ, సామాజిక, రాజకీయ నిర్మాణంపై, అందులోని లొసగులను చర్చకుపెట్టే వీరి ప్రభావం అపారమైంది. వీరంతా యథాతథవాదులకు వ్యతిరేకులు. బద్ధ శత్రువులు. యథాతథవాదులే పాలకులు ఐతే వీరికోసం జైళ్లు నోళ్ళు తెరుచుకొని కాచుక్కుంటాయి. ఈ పద్ధతి కుదరకపోతే ప్రలోభాలకు లోనుచేయడం, కక్షసాధింపు చర్యలకు పాల్పడడం అదీ సాధ్యంకాకపోతే వారిని హత్యచేయడం కూడా మన కళ్ళముందున్న చరిత్రే. దేశవ్యాప్తంగా ఈనాడు ఈ విపత్కర పరిస్థితులు చుట్టుముట్టాయి. వైవిధ్యాన్ని సహించని స్థితి దేశంలోనూ, రాష్ట్రంలోనూ రోజురోజుకూ పెచ్చుమీరుతున్నది.

దేశంలో సంస్కరణవాదులు మొదలుకొని సమూల మార్పును కోరుకునే వారిమీద ఏదో రూపంలో దాడులు జరుగుతూనే ఉన్నాయి. సాధారణ ప్రజల నిత్య కార్య కలాపాల్లోనూ పాలకుల పర్యవేక్షణ, శిక్షలు పెరిగిపోతున్నాయి. ఏమాత్రం వ్యతిరేక స్వరాలు వినిపించినా సహించనితనం దేశ ప్రగతికి ప్రమాదకరంగా మారింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈరోజు భావోద్వేగాలు రాజ్యమేలుతున్నాయి. సామాజిక, ఆర్థిక



ప్రగతుల స్థానే ఉద్వేగాలను రెచ్చగొట్టి, సంతృప్తిపడే భయంకర వాతావరణాన్ని పాలకులు కల్పించారు. ప్రజలు ఎంతసేపూ సున్నితమైన అంశాల చుట్టూ తిరగాలి కానీ, పాలకుల విధానాలను, వాటిపై విమర్శను చేయకూడదనే ఎజెండా ప్రజల మెడమీద కత్తిలా వేలాడుతోంది. పాలకులు ప్రజలకు సంవత్సరం పొడువునా సరిపోయే సాంస్కృతిక కార్యక్రమాలను (ఎజెండా) ఇచ్చేసారు. ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకొని ఈ కార్యకలాపాలన్నీ రూపొందించ బడ్డాయి (డిజైన్). యువత చేయాల్సిందల్లా ఆ డిజైన్‌లో ప్రజలను ఎంగేజ్ చేయడమే. ఈనాడు గ్రామాల్లో ఈ సాంవత్సరిక సాంస్కృతిక కాలెండర్ విజయవంతంగా అమలవుతోంది. దేశాన్ని కుదిపేసే సున్నితమైన చర్యలకు వ్యతిరేకంగానో, అనుకూలంగానో మాట్లాడనివ్వని సాంకేతిక గూఢచారిత్వం మనందరి మీదా ప్రయోగించబడుతున్నది. పాలకులు నిర్దేశించిన చట్టవ్యతిరేక కార్యకలాపాలకు నేనేమి పాల్పడడంలేదు కదా అని గదుల్లో కూర్చొన్న వారిని సైతం వారి పూర్వ చరిత్రను బూచిగా చూపి హింసిస్తున్న పాశవిక స్థితిని కూడా చూస్తున్నాం. ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం రేకేత్తించిన 45 మంది ఆలోచనాపరులపై దేశద్రోహం కేసు విషయం తెలిసిందే. ఈ నేపథ్యాన్నంతా చూసినపుడు మొత్తంగా భిన్నమైన ఆలోచనలు ఎవరు కలిగి ఉన్నా వారికి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఒక 'టాగ్' తగిలిస్తే చాలు ప్రజామోదాన్ని పొందవచ్చన పాలకులు ఆలోచిస్తున్నారు. అమలుచేస్తున్నారు. విజయవంతమవుతున్నారు. దేశ ప్రగతిని కోరి ఆలోచనలను కలబోసుకున్న రచయితలను, మేధావులను జైళ్ళలో పెట్టి హింసిస్తున్నారు. తరగతి గదిలో ఉండాల్సిన అధ్యాపకులను, విద్యార్థులను, ఆచార్యులను జైలుగదిలో బంధించేస్తున్నారు. ఈ స్థితి రోజు రోజుకూ విస్తరిస్తోంది. తెలంగాణలో రచయితలను, మేధావులను నిర్మూలించాలనే ఎజెండాతో నేడు ఆచార్య సి. కాశీం దగ్గరకు వచ్చి చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(UAPA) పేరుతో నిలబడ్డది. కాశీం వంటి అనేకమంది మేధావుల పరిస్థితి ఇదే.

దేశంలో ముఖ్యంగా చైతన్యానికి ప్రతీకైన తెలంగాణలో పైన పేర్కొన్న విపత్కర పరిస్థితి మరింత ఎక్కువైంది. కాకతీయుల కాలంనుంచి కొనసాగుతున్న ధిక్కార స్వరాలను భుజాలపై మోస్తున్న తరానికి ప్రతినిధి ఆచార్య సి. కాశీం. ప్రముఖ కవి ఖాదర్ 'నేను పుట్టకముందే నా పేరు ఈ దేశద్రోహుల జాబితాలో చేరిపోయింది' అన్నారు. కాశీం అని పేరు పెట్టుకోవడం కూడా నేరమైన, దేశద్రోహమైన ఈ దేశంలో, అంటరాని కులంగా ముద్రవేసిన కులంలో పుట్టిన ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా ఎదిగాడు. ఆర్ట్స్ కళాశాల మెట్లను తొక్కుకుంటూ ఎదగక, ఆ మెట్లను నిర్మించిన మట్టి పాదాలను ముద్దాడాడు. వారి రక్తతర్పణాన్ని, త్యాగనిరతిని ఎత్తిపట్టాడు. ఆర్ట్స్ కళాశాల భుజాలపై నిలబడి 'నేను తెలంగాణోన్ని మాట్లాడుతున్నా...' అంటూ ధిక్కార స్వరాన్ని వినిపించాడు.

ఆచార్య కాశీం విద్యార్థి నాయకుడిగా, అధ్యాపకుడిగా, మేధావిగా, సాహిత్య విమర్శకుడిగా దాదాపు రెండున్నర దశాబ్దాలుగా తన ఆలోచనలను, అంటరానివాడిగా వెలివేతకు గురైన దుఃఖపూరిత అనుభవాలను సమాజంతో బహిరంగంగా కలబోసుకుంటూనే ఉన్నాడు. ఆయన ఏనాడు రహస్య జీవితాన్ని గడపలేదు. నేటి పాలకులు చెబుతున్నట్టుగా ఎప్పుడూ తప్పించుకొని తిరగలేదు. ఇందుకు సాక్షం కళాశాలలోని హాజరు పుస్తకంలో ఆయన చేసిన సంతకాలు. ఆ సంతకాలను ఎవరు కాదనగలరు. ఎవరు మార్చివేయగలరు మాయం చేస్తే తప్ప. సర్వసాధారణ విషయాలను కూడా పాలకులు నిజాలుగా ప్రచారంచేస్తూ, ప్రజలను నమ్మించటానికి ఎలా ప్రయత్నం చేస్తారో చరిత్రలో నిరూపితమైంది. ఇప్పుడు ఆచార్య కాశీం విషయంలోనూ నిరూపించబడుతూనే ఉన్నది.

అతిశయోక్తి కాదని నమ్ముతూ ఈ వాక్యాన్ని రాస్తున్నాను. తెలంగాణ నినాదాన్ని తెలంగాణ ప్రతి గుండెపై ముద్రించిన విద్యార్థి నాయకుడు కాశీం. ఇప్పుడు పాలకులుగానూ, ప్రతిపక్ష నాయకులుగానూ ఉన్న అనేకమంది కాశీం ఉపన్యాసాలతో, ఆయన నిర్మించిన ప్రాంతీయ సైద్ధాంతికతతో ప్రేరేపితులైనవారే. ఇది చరిత్ర. దీన్ని ఎవరూ కాదనలేరు. ఉస్మానియా విశ్వవిద్యాలయమంతా వర్గ సిద్ధాంత వెలుగులో ఉద్యమాలు నడుస్తున్న కాలంలో కాశీం తెలంగాణ వంటి ప్రాంతీయ సిద్ధాంత భూమికతో తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్‌ను (TSF) మరికొంతమందితో కలిసి ప్రారంభించారు. అది మొదలు విద్యార్థి నాయకుడిగా తెలంగాణలో కాశీం తొక్కని నేలలేదు. ఆయన కలవని సమూహం లేదు. తెలంగాణ సాధనలో ఆయన ఇచ్చిన వేలాది ఉపన్యాసాలకు ప్రేరేపితులైనవారు తెలంగాణ ఉద్యమంలో ముందు భాగాన నిలబడ్డారు. ఆయన ఉపన్యాసాలకోసం జనం అర్ధరాత్రి వరకు

వేచి ఉండేవారు. ఇతర ఉపన్యాకులను తక్కువ చేయడం అనుకోకపోతే ఈ సందతరేలో ఒక మాట చెప్పుకోవచ్చు. నిర్వహకులు కాశీం ఉపన్యాసం మొదట ఉంటే, విని ప్రజలందరూ వెళ్ళిపోతారనే ఉద్దేశంతో ఆయన ఉపన్యాసాన్ని చిట్టచివరకు మార్చిన సందరాలే కోకొల్లలు. తెలంగాణతో మమేకమైన ప్రతి ఒక్కరికి ఇది అనుభవమే. అంతటి ప్రభావశీలి ఆచార్య కాశీం. తెలంగాణ రాష్ట్ర సాధన మొదటి లక్ష్యం, ఎంతముఖ్యమైన పనైనా నాకు తరువాతనే (Secondary) అని నిర్మొహమాటంగా, ఘంటాపథంగా చాటిన నిబద్ధ ఉద్యమకారుడు కాశీం. ఆ మాటకు కట్టుబడి పనిచేసాడు.

ఉద్యమంలో తన శారీరక, మేధో శ్రమను ఖర్చు చేసినవాడు కాశీం. తెలంగాణకు సంబంధించిన ఆయన కృషి కేవలం భావవ్యాప్తితోనే ఆగిపోలేదు. ముందు చెప్పుకున్నట్టు ఆయన ఉద్యమ నిర్మాత. తన జ్ఞానాన్ని, వ్యూహ చతురతను ఉద్యమ నిర్మాణానికి సంపూర?ంగా వాడినవాడు. తెలంగాణ ఉద్యమ నిర్మాణం చేస్తూనే, ప్రజలను చైతన్యం చేసే భావవ్యాప్తిని విస్త ృతంగా చేయాలనే విషయాన్ని ఆచరణ ద్వారా తెలుసుకున్నాడు. తెలంగాణ సమస్యను అర్థంచేసుకోవడానికి అప్పటికి ఉన్న పుస్తకాల కొరతను తీర్చేక్రమంలో 'నేను తెలంగాణోన్ని మాట్లాడుతున్న...' అనే చిన్న బులిటెన్‌ను ముద్రించాడు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ఉన్న ప్రతి కార్యకర్త చేతిలో ఈ పుస్తకం ఉండేదంటే దాని అవసరం, అది నిర్వహించిన పాత్ర ఎటువంటిదో అర్థంచేసుకోవచ్చు. ఉపన్యాసకుడిగా, ఉద్యమ నిర్మాతగా తన ఆలోచనలనన్నంటిని ప్రసంగాల రూపంలోనే ఖర్చు చేయడంవల్ల ఆయన విస్తృతంగా రాయలేకపోయారు. రాయలేదు అనేకంటే ఉద్యమావసరాలు ఆయనకు రాసే సమయాన్ని ఇవ్వలేదనడం సముచితం. అయినా, తెలంగాణకోసం ఆయన ఇప్పటికే తన వయసుకు మించిన పని చేసారు. ఇటువంటి కాశీం, తెలంగాణను నిండైన హ ృదయంతో కలగన్న కాశీం ఈనాడు ఈ దేశానికి, తెలంగాణకు దేశద్రోహిగానూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేసే నిందితుడిగా కనిపిస్తున్నాడు. పాలకుల మాటల్లో చెప్పాలంటే 'అర్బన్ నక్సలైట్'గా మారిపోయాడు. తప్పించుకొని తిరుగుతున్నాడన అసత్య ప్రచారాలు చేస్తున్నారు. సమాజంపై కనీస తెలివి ఉన్నవారెవరికైనా ఇవన్నీ పచ్చి అబద్ధాలని తెలుసు.

ఆచార్య కాశీం తెలంగాణకు అధికార బదలాయింపును మాత్రమే కోరలేదు. ప్రజల తెలంగాణను కాక్షించాడు. ఇపుడు ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్న ప్రజాస్వామిక తెలంగాణ గురించి ఆనాడే నొక్కిచెప్పాడు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కూడా అదే వైఖరితో నిలబడ్డాడు. తన ప్రసంగాల పరంపరను ఏనాడు ఆపలేదు. అది సాహిత్య సభలైనా, విద్యాసంబంధమైనా, విద్యార్థి సభలైనా, దళిత మహాసభలైనా. ఆ సభలు హైదరాబాదులోనైనా, జిల్లాల్లో అయినా కాలుకు బలపం కట్టుకొని తిరుగుతున్నాడు. అలసిపోతున్నాడు. జబ్బుపడుతున్నాడు. సమయానికి తినక కొత్త కొత్త జబ్బులతో ఒక రకంగా యుద్ధం చేస్తున్నాడు. వీటికి తోడు పాలకుల వేధింపులు ఉండనే ఉన్నాయి. తన రచనా వ్యాసంగానికీ ఎప్పుడూ విరామానివ్వలేదు. సమాజ మార్పును కాంక్షిస్తూ, ఇప్పటికే దజనుకు పైగా పుస్తకాలను ముద్రించారు. అరడజనుకు పైగా 'UAPA' (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) కేసులను మోస్తున్నాడు. ఈ కేసులన్నీ సమాజంపై ఆయనకు గల ప్రేమను, నిబద్ధతను తెలియజేస్తున్నాయి. ఆయన త్యాగ నిరతికి తార్కాణంగా ఉన్నాయి. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి, మనసు చంపుకొని తమ రచనలను వెనక్కు తీసుకుంటున్న (withdraw) అత్యంత నిస్సహాయ, విపత్కర పరిస్థితుల్లో కూడా మడమ తిప్పకుండా పనిచేస్తున్నాడు.

ఆచార్య కాశీం మరో ప్రధాన కార్యరంగం దళితుల హక్కుల సాధన. ఆత్మగౌరవ పోరాటం. ముఖ్యంగా మాదిగ రిజర్వేషన్లకోసం పోరాడుతున్న దళిత వర్గాలకు సైద్ధాంతిక దన్ను కాశీం. సమాజంలో అత్యంత చైతన్యవంతమైన ప్రజారాసులు దళిత వర్గాలు అనే విశ్వాసమున్న కాశీం, వారిని చైతన్యవంతంగా మార్చే క్రమంలో ఎన్నో ఉపన్యాసాలిచ్చాడు. అంతేకాకుండా వారికి రాజకీయ పాఠాలను నేర్పిన ఉపాధ్యాయుడు కాశీం. అక్షరాల వాసనే లేని దళిత వాడనుంచి ఎదిగి, దళితుల పక్షాన ఎన్నో వ్యాసాలు రాసాడు. ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లోని దళిత పరిశోధకులకు యు. జి. సి. ఫెలోషిప్స్ ఇవ్వడం మానేసిన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విధానం కూడా పాలకులకు రుచించలేదు. దళితుల జీవితాలను సజీవమైన శిల్ప నైపుణ్యంతో కవిత్వీకరించాడు. అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్త ృతంగా తీసుకెళ్ళాడు. తాను పనిచేస్తున్న విప్లవ రచయితల సంఘాన్ని మరింత ఉన్నతీకరించడానికి అంతర్గత యుద్ధం చేసి, దళితుల్లో గల పోరాట పటిమపై విశ్వాసం పెంచాడు.

*(తరువాయి భాగం 17వ పేజీలో ..)*


# ప్రశ్నించే గొంతులపై అణచివేత

**శివరాత్రి సుధాకర్**

అంతరాల్లేని సమాజాన్ని కలగనడం నేరమిక్కడ. హక్కుల కోసం గొంతెత్తి నినదించడం ద్రోహమిప్పుడు. నమ్మిన విశ్వాసాల్ని, రాజకీయాల్ని మాట్లాడటం రాజద్రోహమైంది. రాజ్యాన్ని కూల్చే కుట్రయింది. మాటా నిషేధం. పాటా నిషేధం. రాజ్యమెప్పుడూ ప్రశ్నను సహించదు. రాజ్యం పునాదుల్లో భూకంపం పుట్టించే ప్రశ్నలంటే దాని వెన్నులో వణుకు. వేల ఏళ్లుగా ప్రజల గొంతుగా నిలబడ్డది ప్రశ్నే. అందుకే పాలకులు ప్రశ్నించే ధిక్కార కలాలు, గళాలపై కత్తులు దూస్తున్నది. కుట్రలు చేస్తున్నది. కట్టుకథల కేసులల్లి ఖైదు చేస్తున్నది. మేధావుల్ని, బుద్ధిజీవుల్ని, కవులు, రచయితలు, కళాకారుల్ని వేటాడుతోంది. రాజ్యాంగాన్ని అమలు చేయమన్నందుకు సంఘ విద్రోహ శక్తులుగా, తీవ్రవాదులుగా చిత్రీకరిస్తోంది.

ప్రజల్ని మభ్యపెట్టి, మాయజేసి రెండోసారి అధికారంలోకి రాగానే దొరకు పట్టపగ్గాల్లేకుండా పోయినయి. తెలంగాణంతా తన అయ్య జాగీరనుకుంటున్నడు. నియంత పోకడ పోతున్నడు. దొరకు గుర్తులేనట్టుంది... ఇక్కడ నిజాం వ్యతిరేక పోరాటం. దొర గఢీలను కూల్చిన ప్రజా పోరాటాలు. దొర అనుకుంటున్నడేమో... తన లాబీయింగ్ పాలిటిక్స్ వల్లనే తెలంగాణ వచ్చిందని. 1969లో ఆరిపోయిన ఉద్యమం ఫీనిక్స్ లా పునరుత్థానమైంది ఎవరి వల్ల? మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని, పోరాటాన్ని రాజేసిందెవరు? సూర్యాపేట, వరంగల్ డిక్లరేషన్‌లప్పుడు దొర ఏడపన్నడు? తెలంగాణ జనసభ రాజేసిన పోరాటం ప్రజల కండ్లల్లో, చరిత్ర గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పోరాట గుర్తు. వేలాది అమరులు చిందిన నెత్తుటి త్యాగఫలం తెలంగాణ. త్యాగాల పునాదులపై నిర్మించిన తెలంగాణ ఇది. ఇప్పుడు తెలంగాణ నివురుగప్పిన నిప్పు. మౌనంగా ఉన్న అగ్నిపర్వతం. అది దోపిడీ, పీడనపై పేలేందుకు సిద్ధంగా ఉన్నది.

మలిదశ ఉద్యమానికీ మావోయిస్టు పార్టీ మద్దతిచ్చింది. దిశా నిర్దేశం చేసింది. ప్రత్యామ్నాయ రాజకీయాల్లేకపోతే ఈ



తెలంగాణెక్కడిది? ఇప్పుడు ప్రత్యామ్నాయ రాజకీయాలు మాట్లాడే బుద్ధిజీవులపై నిర్బంధమెందుకు? పాలకవర్గ దోపిడీని ప్రజలకు అర్థం చేయిస్తున్న మేధావులు, కవులు, రచయితలు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల నాయకుల్ని టార్గెట్ చేస్తోంది రాజ్యం. తన దోపిడీకి అడ్డు లేకుండా అక్రమ కేసులతో నిర్బంధిస్తోంది.

ఇటీవల ఆర్టీసీ కార్మికుల సమ్మె దొర అహంకారంపై కోలుకోలేని దెబ్బతీసింది. ఆర్టీసీ కార్మికులకు మద్దతిస్తున్న ప్రగతిశీల శక్తులు, విప్లవోద్యమ సానుభూతిపరులపై కక్ష గట్టింది ప్రభుత్వం. ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా ఆర్టీసీ కార్మికులు సమ్మెను ఆపలేదు. సమరశీల పోరాటం చేశారు. ఈ పోరాటం వెనుక ప్రజా సంఘాలు, విప్లవోద్యమం, విప్లవోద్యమ సానుభూతి పరులున్నారని రాజ్యం అనుమానించింది. భయపడ్డది. దీంతో ప్రజా సంఘాలు, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులపై, ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న జర్నలిస్టులు, బుద్ధిజీవులపై అక్రమ కేసులు బనాయించింది. మూడు అక్రమ కేసుల్లో 64మందిని నిందితులుగా చేర్చారు. వాళ్లంతా తెలంగాణ పోరాటంలో భాగమైనవాళ్లు. తెలంగాణ అంతటా పల్లెపల్లెనా తిరిగి ప్రజాస్వామిక తెలంగాణ కోసం ప్రజల్ని చైతన్యం చేసిన వాళ్లు.

ఈ కేసు మొదటగా గద్వాలలో మొదలైంది. అక్టోబర్ 4న గద్వాలలో ఒక ధర్నాలో పాల్గొని తిరిగివస్తున్న తెలంగాణ విద్యార్థి వేదిక గద్వాల జిల్లా కన్వీనర్ నాగరాజును అక్రమంగా అరెస్టు చేశారు. అనంతరం అక్టోబర్ 7న మహబూబ్ నగర్ లో తెలంగాణ విద్యార్థి వేదిక నాయకుడు బలరాంను అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులుగా విరసం నాయకుడు, స్టూడెంట్ మార్చ్ సంపాదకుడు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుడు కంతి జగన్, టీవీవీ అధ్యక్షుడు మద్దిలేటి, సీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శిల్ప, రేణుక, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మెంచ రమేష్, ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణల పేర్లు చేర్చారు. అక్టోబర్ 11న జగన్‌ను అరెస్టు చేశారు.

నవంబర్ 12న "అఖిల భారత హిందూత్వ దాడి వ్యతిరేక వేదిక" కన్వీనర్ బెల్లపు అనూరాధ, ఆమె సహచరుడు నర్ల రవిశర్మల ఇంటిపై దాడిచేసి వాళ్లిద్దర్నీ అరెస్టు చేశారు. వాళ్లతో పాటు మరో ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. మావోయిస్టు పార్టీ నాయకులతో పాటు విరసం నాయకుడు చింతకింది కాశీం, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు నలమాస కృష్ణ, మెంచు రమేష్, 'వీక్షణం' సంపాదకుడు నెల్లుట్ల వేణుగోపాల్‌ను నిందితులుగా చూపారు. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ), అన్ లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ ఆక్ట్(యూఏపీఏ), తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ కింద అక్రమ కేసులను బనాయించారు. వేణుగోపాల్, కాశీం, నలమాస కృష్ణ, మెంచు రమేష్‌లు పరారీలో ఉన్నట్లు రిమాండ్ కేస్ డైరీలో రాశారు. ఇదంతా కుట్రపూరితంగా జరిగిందే. ఉద్దేశపూర్వకంగానే వేధింపులకు గురిచేసే పన్నాగమిది. రాజ్యం దుర్మార్గాలను ప్రశ్నించే బుద్ధిజీవుల్ని భయపెట్టేందుకు వేసిన ఎత్తుగడ ఇది. నిజంగానే వేణుగోపాల్, కాశీంలు పరారీలో ఉన్నరా? ఈ పరారీ కట్టుకథ పాలుతాగే పసివాళ్లకు కూడా తెలుసు. ప్రశ్నను, విమర్శను అణచి వేసేందుకు అల్లిన కట్టుకథల కేసిది.

కంతి జగన్... ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకుడు. రెండు దశాబ్దాలుగా తెలంగాణ పోరాటంలో ఉన్నవాడు. తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్‌లో క్రియాశీలకంగా పనిచేశాడు. స్టూడెంట్ మార్చ్ సంపాదకుడు. విప్లవ రచయితల సంఘం నాయకుడు. కార్పొరేట్ కాలేజీల దోపిడీ, విద్య కాషాయీకరణ, నల్లమలలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రత్యేక సంచికలు తీసుకువచ్చి ప్రజల్ని చైతన్యం చేస్తున్నవాడు. ప్రజాస్వామిక తెలంగాణ సాధనలో గొంతెత్తడం అతడు చేసిన నేరం. మానవాళిని తుడిచిపెట్టే యురేనియం తవ్వకాలపై రాయడం, మాట్లాడటం, పత్రికను ముద్రించడం రాజ్యానికి కంటగింపయింది.

చింతకింది కాశీం. ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్. తెలుగు డిపార్ట్‌మెంట్ పాఠ్యప్రణాళిక సంఘం అధ్యక్షుడు. నిత్యం విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు. నడుస్తున్న తెలంగాణ ప్రధాన సంపాదకుడు. విరసం నాయకుడు. 'సంపాదకుని ఉత్తరం'తో ప్రజలతో సంభాషిస్తున్న బుద్ధిజీవి. తెలుగు సమాజంలో వందలాది వేదికలపై మాట్లాడుతున్నవాడు. జనం మధ్యే ఉంటూ, జనం కోసమే పనిచేస్తున్న అతడు పరారీలో ఉన్నాడని చెప్పడమే హాస్యాస్పదం. దీంతోనే అర్థమవుతుంది... ఈ కేసే ఓ కుట్ర అని.

అతడు నల్లమల అంచున వెల్లువైన పాలికేక. పాలమూరు పసినవ్వుల నెలవంక. ఊరి చివరి గుడిసెలో పూసిన మోదుగు పువ్వు. రాత్రి బడిలో నేర్చిన అక్షరాలు అతనిలో నిప్పురవ్వల్ని రాజేసినయ్. లందల్ల పొడిసే పొద్దును ఆవాహన

చేసుకున్నాడు. 'తెలంగాణ జనసభ'ల్లో నడకలు నేర్చిండు. పాలమూరు వలస బతుకుల గాయాల్ని పాటలల్లిండు. బతుకులు మారే దారిలో నడుస్తున్నడు. రెండు దశాబ్దాలుగా అతని మాట తెలంగాణ. రాత తెలంగాణ. యూనివర్సిటీలో తరగతి గదుల్ని ప్రశ్నించే కెరటాలుగా మారుస్తున్న అలుపెరగని సంద్రమతడు. అతడు దగాపడ్డ తెలంగాణ బతుకుల్ని మాట్లాడుతున్నడు. గులాబీ పార్టీ పుట్టడం కన్నా పదేళ్ల ముందు నుంచే తెలంగాణను మాట్లాడుతున్నడు. ప్రజాస్వామిక తెలంగాణను పలవరిస్తున్నడు. కలవరిస్తున్నడు. రాజ్యం మాటల్లో... అతనిప్పుడో రాజద్రోహి. రాజ్యాన్ని కూల్చే కుట్రదారు. **"తెలంగాణ కన్నీళ్లను కలంలో నింపడం ద్రోహమైతే... నేను రాజద్రోహం చెయ్యడానికి సిద్ధం"** అని ప్రకటించిన సృజనశీలి. 'ఉపా' కేసుల్తో అతని గొంతును ఆపాలని కుట్ర చేస్తోంది రాజ్యం. కళ్యాణరావు అన్నట్టు

**"పుట్టిన కులం నిషిద్ధం. కోరుకున్న పోరాటం నిషిద్ధం. అది నిన్న కావచ్చు. ఈ రోజు కావచ్చు. కాలం ఏదైనా కావచ్చు. ఈ వసంతం అప్పుడూ నిషేధమే. ఇప్పుడూ నిషేధమే."**

దశాబ్దాల తరబడి ప్రజల కోసం మాట్లాడుతూ, హక్కుల కోసం గొంతెత్తి నినదిస్తూ, రాస్తున్న వీళ్లంతా ఎక్కడ మొదలయ్యారు? ఏ ప్రజల కోసం పోరాటాల్లోకి నడిచివచ్చారు? రెండు తెలుగు రాష్ట్రాల్లో వీళ్లందరి గురించి పల్లెపల్లెకూ తెలుసు.

ఎన్. వేణుగోపాల్ కవి, రచయిత, విమర్శకుడు, అనువాదకుడు, పాత్రికేయుడు. మార్క్సిస్టు సాహిత్య విమర్శలో దారిదీపం. ముప్పై ఐదేళ్లకు పైగా ప్రజా ఉద్యమాల్లో ఉన్నాడు. ఎన్నో పుస్తకాలు ప్రచురించాడు. వందలాది వ్యాసాలు రాశాడు. వేలాది వేదికలపై మాట్లాడాడు. తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మాట్లాడు తున్నందుకు, విమర్శిస్తున్నందుకే ఈ కక్ష్య సాధింపు. ప్రత్యామ్నాయ ఆలోచనల్ని, భావజాలాన్ని కల్గివున్న బుద్ధిజీవుల్ని అణచివేసేందుకు పోలీసులు, పాలకులు కలిసి రచించిన కుట్రాజకీయమిది. ఈ కుట్రలు కూలక తప్పదు. ప్రశ్న తిరగబడ్తది. మర్లబడ్తది. అవని అంతటా పెనుమంటల్ని రాజేస్తది. ఎన్నెన్ని కుట్రలకు బలయినా ఫీనిక్స్‌లా మళ్లీ పునరుత్థానమైతది.

కవులారా, రచయితలారా, బుద్ధిజీవులారా... రండి. ప్రశ్నించే గొంతుల్ని కాపాడుకుందాం. దగాపడ్డ తెలంగాణను బతికించుకుందాం.

**"చీకటి రాజ్యం సాగదులే ఎల్లకాలమూ**
**రాత్రి అంతమై వెలుగొచ్చునులే..."**

రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయు T

---

**(14వ పేజీ తరువాయి)**

దళితులపై ఎక్కడ దాడి జరిగినా సంఘటనా స్థలానికి వెళ్లి, వారికి ధైర్యం చేప్పే మనిషి కాశీంపై పాలకులు అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిని తీవ్రమైన నిరసనలతో అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన ఆలోచనలను నిర్మూలించాలని ఉత్సాహపడుతున్న పాలకులను అత్యంత ధైర్యసాహసాలతో ఎదుర్కోవాల్సిన సందర్భమిది.

తెలంగాణ ఏర్పాటయ్యాక ఆలోచనపరులు, మేధావులు, కవులు, కళాకారులు రకరకాల రూపాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాలకులతో కలిసిపోయారు. మరికొంతమంది 'సిస్టమ్'లో అలా ఉండిపోయారు. పాలకులు కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ వ్యతిరేక స్వరాలను ఎంతమాత్రమూ ఉపేక్షించడం లేదు. వ్యతిరేక స్వరం చాలా పెద్ద మాటవుతుందేమో కానీ, కనీసం భిన్నమైన ఆలోచనలను కూడా సహించడం లేదు. రెండున్నర దశాబ్దాలుగా తెలంగాణ పదం తప్ప, దళితుల ఆత్మగౌరవ పతాకం తప్ప, మొత్తంగా పేద ప్రజల ఊసులు తప్ప స్వంత జీవితం, కుటుంబం గురించి ఆలోచించని ఆచార్య కాశీం లాంటి వారిపై ఉపా కేసులు పెట్టడమంటే ప్రజాస్వామిక తెలంగాణను, దళిత స్వరాన్ని నిర్మూలించాలని పాలకులు ఉత్సాహ పడుతున్నారు. పరిస్థితులు ఎంతో వేగంగా మారి పోతున్నాయి. వారి అసంబద్ధ, అసత్య ఆరోపణలను తుత్తునియలు చేయాల్సిన సమయమిది. ప్రజా సంఘాల్లో పనిచేసే కార్యకర్తల మీదా, హక్కుల కార్యకర్తలమీదా, విద్యార్థి నేతలమీదా, సంపాదకుల మీదా మోపుతున్న నిరాధారమైన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ ప్రజా ఉద్యమాన్ని నిర్మాణం చేయాల్సిన అనివార్యత ఉంది. కవుల, మేధావుల గళాలను, కలాలను రక్షించుకొందాం. ఆలోచనల వైవిధ్యాన్ని ఆహ్వానిద్దాం. వాటికి ప్రాణంపోద్దాం.

**★ రచయిత: అధ్యాపకుడు** T

# సంకెళ్ల నుంచి మొలకెత్తుతున్న ధిక్కారం

— అరసవిల్లి కృష్ణ

ఇవాళ దేశంలో ఏంజరుగుతుంది? ప్రశ్నించే గొంతుల చుట్టూ అల్లుకుంటున్న కంచెల మాటేమిటి? ఒకనాటికి దేశం నిశ్శబ్దంలోకి జారుకుంటుంది. ఏం జరుగుతుందో అవగతం కాకుండానే ప్రజలు ఒకానొక అచేతన స్థితిలోకి వెళ్ళిపోతారు. 2014 భారతీయ జనతాపార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి తన నీడలా ఉన్న సంఘ పరివార్ అజెండాను అనుసరిస్తున్నది. అదను చూచి ప్రజలపై ప్రయోగించడానికి సిద్ధపడుతున్నది. అభివృద్ధి నమూనాతో అధికారంలోకి వచ్చిన మోదీ, ప్రజల జీవన స్థితిగతులను పక్కనపెట్టి బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలాన్ని ముందుకు తీసుకువచ్చాడు. ఆరేళ్ళ మోదీ పాలనలో ఈ దేశం ఎవరిది అనే ప్రశ్న ముందుకు వచ్చింది. దేశంలో ప్రజల మధ్య అంతరాలను పెంచి హిందుత్వ దేశంగా మార్చాలనే పాలకవర్గాల ఆలోచన సహజంగానే భిన్నసంస్కృతులు కలిగిన దేశాన్ని ఆందోళనకు గురిచేసాయి. వైవిధ్యమైన జీవన సంస్కృతి కలిగి ఉండటమే కాదు, భిన్న భావజాలాల ప్రజలు వైవిధ్య భారతాన్ని తమ నీడగా తరతరాలుగా మలుచుకుంటున్న జీవన వైవిధ్యంలో ఒకే సంస్కృతి, ఒకే ప్రజ, ఒకే దేశం, ఇంకా ముందుకు వెళితే ఒకే భాష (హిందీ)గా ఉండాలనే ఆధిపత్య ధోరణితో ఉంటున్నప్పుడు, ప్రజాస్వామ్యం, దాని ప్రతిఫలనం, అసమానతలోని మానవీయ సమాజం మెల్లిగా అదృశ్యమయి దేశం కాషాయ నేలగా మారుతున్నప్పుడు సహజంగానే ఈ దేశం ఎవరిది అనే ప్రశ్న ముందుకు వస్తున్నది.

నిజానికి ఈ ప్రశ్నతోనే ముందుకు వెళితే, ఈ ప్రశ్నకు జవాబులు వెదికితే అధికార మార్పిడి (1947) తర్వాత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ నిజస్వరూపం మరింతగా మన అవగాహనలోకి వస్తుంది. ఏడు దశాబ్దాల పైబడిన ప్రజాస్వామ్య భావనలో సంఘ్ పరివార్ బీజరూపంలో చేసిన ప్రయోగాలు ఇవాళ అధికారాన్ని హస్తగతం చేసుకునే వరకు దారితీసాయి. ఇక్కడ అధికారం మాత్రమే ప్రధానమయిన అంశం కాదు. మొత్తంగా దేశాన్ని భయవిహ్వలతగా చేసి తనదయిన మార్క్ పాలనకు తెరదీసింది. ఈ ఆరేళ్ళ పాలనా సమయంలో దళితులు, ముస్లింలు, వారి జీవన వైవిధ్యంపై దాడిచేసింది. రెండవసారి అధికారంలోకి రాగానే కశ్మీర్, రామజన్మభూమి వంటి సున్నిత అంశాలలో తన మాటనే ప్రజల మాటగా ప్రచారం చేసుకుంది. తమని సమర్థించని కంఠస్వరాన్ని నిర్బంధం మాటున నొక్కేయడానికి ప్రయత్నిస్తున్నది. భారతదేశం వంటి భిన్న ప్రజల ఐక్యతను దెబ్బతీసి, అసమానతల దేశంగా రూపొందించడానికి భారతీయ జనతాపార్టీకి నేతృత్వం వహిస్తున్న "మోదీషా"లు ఈ దేశపు ప్రజల ఆలోచనలను బ్రాహ్మణీయ హిందుత్వంలోకి తీసుకెళ్ళే ప్రయత్నం ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నది. ఆర్థిక సామాజిక అసమానతలున్న దేశంలో అవి తొలగించే చర్యలను, నమూనాను రూపొందించుకోకుండా, కేవలం మతతత్వ అజెండాతోనే ఈ దేశాన్ని దీర్ఘకాలం పాలించాలనే రహస్య అజెండాతో ముందుకు వస్తున్నది.

మరి దీన్ని నిలువరించే శక్తి ఏమిటి? ఈ దేశంలో దీనిని నిలువరించే అవగాహనతో, పనిచేస్తున్న సంస్థలను, వ్యక్తులను భౌతికంగా, మానసికంగా నిలువరించే ఒక ప్రయత్నం చేసింది. కలబుర్గి నుండి గౌరీలంకేష్ వరకు దేశవ్యాప్తంగా ఉన్న ఆలోచనాపరులును అత్యంత కిరాతకంగా హత్యచేసింది. అదే సమయంలో ఈ దేశంలో అణగారిన ప్రజల పక్షాన మాట్లాడుతున్న సాయిబాబా నుండి వరవరరావు వంటి రచయితల వరకు ప్రజాస్వామిక వాదులును వారి స్వేచ్ఛా సమయాలను జైలు సమయాలుగా మార్చివేసింది. వారి ప్రజాస్వామిక భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్ళు వేసింది. దీనివెనుక సంఘ పరివార్ ప్రయోజనాలు ఏమిటో తెలియనివి కావు. ప్రజల మధ్య వుండే వైవిధ్యాన్ని గౌరవించో, స్వాగతించే పాలనా వ్యవస్థ అంతమయి దాని స్థానంలో నియంతల పాలన పరిఢవిల్లుతున్న దశ బలపడుతున్నది. బి.జె.పి. కనీస ప్రజాస్వామిక సూత్రాలను ఉల్లఘించి ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలపై ఎదురుదాడికి దిగుతున్నది. ఈ విషయం తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అవగాహనలో లేనిది కాదు.

అయినా నూతన రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ ప్రజల తెలంగాణగా మార్చాలని ప్రయత్నం చేస్తున్న ప్రజాసంఘాలపై విప్లవకర ముద్రవేసి, స్టూడెంట్ మార్చ్ పత్రిక సంపాదకుడు, తెలంగాణ విద్యార్థి వేదిక, విప్లవరచయితల సంఘాల్లో పనిచేస్తున్న కా.జగన్‌పై ఇంకా టీవీవీ, తెలంగాణ ప్రజాఫ్రంట్ నలమాస కృష్ణ, నాగన్న, రమేష్, బలరాం, మద్దిలేటిలను చైతన్య మహిళా సంఘం శిల్ప, రేణుకలపై తాజా ఉపా (యు.ఎ.పి.ఎ.) మోపి చట్ట విరుద్ధంగా జైలులో నిర్బంధించారు. మరో



కేసులో దేవేంద్ర, స్వప్న, టీవీవీ సందీప్‌లను నిర్బంధించారు. వీరంతా స్వేచ్ఛా జీవితంలో ఉన్నవారు. తమకున్న రాజకీయ అవగాహనతో ప్రజలకు మేలు చేద్దామనే తలంపుతో బయలు దేరినవారు. ప్రజాస్వామిక ఆకాంక్షలు నెరవేరాలనే ఆలోచనతో ఈ కార్యరంగాన్ని ఎంచుకున్నవారు. వారికి జీవితాలున్నాయి, కుటుంబం వున్నది. వారేమీ రహస్యంగా పనిచేస్తున్నవారు కాదు. వారి జీవితం, ఆచరణ అంతా బహిరంగమే. ఈ నేపథ్యం ఇలా ఉండగానే రామజన్మభూమి తీర్పుపై ఎవరు మాట్లాడకూడదనే ఆంక్షలు విధించింది. ఈ తీర్పు ఎవరి ప్రయోజనాలను రక్షిస్తుందో, ఎవరి ప్రయోజనాలకు కాపలాగా వుంటుందో అందరికీ తెలిసిందే. ఈ తీర్పు అంగీకారం కాదు అని ఒక ప్రెస్‌మీట్ పెట్టాలనుకుంటే, హిందూ ఫాసిస్టు వేదిక కన్వీనర్ రవిశర్మ, అనురాధలపై ఉపా కేసు పెట్టడమే కాదు. ఈ వేదిక కన్వీనర్‌లుగా ఉన్న బైరాగి, వేములపల్లి వెంకట్రామయ్యలను అరెస్టు చేశారు. ఇంకా ఈ కేసులోనే వీక్షణం సంపాదకుడు, రచయిత, వక్త అయినటువంటి ఎన్.వేణుగోపాల్‌పై ఉపా కేసును బనాయించారు. నడుస్తున్న తెలంగాణ సంపాదకుడు, విరసం కార్యవర్గ సభ్యులు, తెలంగాణాకు మాత్రమే కాకుండా తెలుగు సమాజంలో మేధో సృజన రంగాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ కాశింపై ఏడు ఉపాకేసులు పెట్టి మానసికంగా వేధించాలనుకుంటోంది. మేధో, సృజనరంగాలలో క్రియా శీలంగా ఉన్నా ఆలోచనాపరుణ్ని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు వేధించే విధానానికి తెరతీసాయి. నిజానికి కాశీం అణగారిన సమాజపు వంతెనపై నుండి ఇవాళ ప్రజల పక్షాన గొంతు విప్పుతున్నవాడు, ప్రజల తరపున పనిచేయాలనే ఖచ్చితమయిన సైద్ధాంతిక దృక్పథంతో పనిచేస్తున్నవాడు. నిత్యం ప్రజల మధ్య ఉన్నవాడు, ప్రజల గొంతుకగా ఉన్నవాడు, రాజ్యానికి తలవంచనివాడు. అరుదయిన రచయిత, ఉపన్యాసకుడు, బహుళ సృజనాత్మక రంగాలలో ప్రవేశం కలిగి ఒక నమూనాగా నిల్చినవాడు. అలాంటి మేధోవంతున్న ఏడు కుట్ర కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామిక ప్రభుత్వాల అధోగతికి పరాకాష్ట.

మొత్తంగా దేశంలో రెండు తెలుగు రాష్ట్రాలలో క్రియాశీలంగా ప్రజల పక్షం వహించిన వారిని రాజ్యం అనేక విధాలుగా వేధిస్తున్నది. "భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రభుత్వాల పనివిధానాన్ని విమర్శించే రాజ్యాంగంలోని మాట్లాడే స్వేచ్ఛను హరించివేస్తున్నది. ప్రజల నుండి వస్తున్న మౌలికమయిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, హిందుత్వ పెట్టుబడిదారీ సమాజ కేంద్రంగా మార్చేందుకు రాజ్యం ప్రయత్నిస్తున్న కాలంలో మాట్లాడేవారిని జైళ్ళవైపు దారి చూపుతున్న నిర్బంధంలో మొత్తంగా ప్రజాస్వామిక వ్యవస్థలన్నీ ధ్వంసం కాబోతున్న వేళ మనతరం ప్రజల మిత్రులను కేసుల నుండి జైళ్ళ నుండి వారి ప్రాథమిక స్వేచ్ఛలను హరించివేసే అన్ని రకాల నియంత్రణల నుండి మినహాయించగలిగితేనే ప్రజాస్వామ్య పాలనకు విశ్వసనీయత వుంటుంది.

అదే సమయంలో తెలుగు సమాజంలో ప్రజలకోసం పనిచేస్తున్న ప్రజాసంఘాలపై అక్రమ నిర్బంధం కొనసాగు తున్నది. ఈ నిర్బంధం నిషేధం వరకు వెళుతుందనే ఛాయలు కనబడుతున్నాయి. అసహనం అనేది పాలకవర్గాలు

జీర్ణించుకోలేనిది. భారతదేశంలో ప్రజల మౌలికమయిన అవసరాలు తీరలేదు. ఏడుపదులు దాటిన అధికారమార్పిడి మరింతగా ఆర్థిక, సామాజిక అసమానతలను పెంచింది. వాటి పరిష్కారం పాలక వర్గాల దగ్గర లేదు. కానీ ప్రజల మధ్య, వర్గాల మధ్య ద్వేషాన్ని పెంచి ప్రజలను వర్గాలుగా విడగొట్టి పాలనలో వుండాలనే అభిప్రాయం పాలక వర్గ నమూనాగా వుంది. అయితే దీనిని ఎదుర్కొనే శక్తులు పాలకుల, హిందుత్వ అభివృద్ధి నమూనాను ప్రశ్నించే వ్యక్తులను, సంస్థలను చలనంలో లేకుండా చేయడమే పాలకవర్గాలు అనుసరిస్తున్నది.

భారతదేశ వ్యాప్తంగా ఈ ప్రశ్నించే గొంతులపై అమలవుతున్న నిర్బంధాన్ని ప్రజాసమూహాల ఐక్యత, ప్రతిఘటన ద్వారానే ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. సంఘ పరివార్, మోదీ, షాలది మాత్రమే భారతదేశం కాదని, అసంఖ్యాక శ్రమజీవులదని, బ్రాహ్మణీయ హిందుత్వ సమాజం మాత్రమే కాదు, బహుళత్వ విలువలు కలిగిన మనుషుల దేశమని ఈ అరెస్టులు, కేసులు, నిర్బంధాలు ప్రజల ఆకాంక్షలు నెరవేరేదాకా వాటికి తలవంచక సృజనశీల మేధో ప్రపంచం ప్రజల పక్షాన నిలుస్తుందని, మొత్తంగా నిర్బంధాన్ని అనుభవిస్తున్న వారికి అండగా సంఘీభావంగా ఈ దేశ ప్రజానీకం మాత్రమే కాదు సృజన, మేధోరంగాలలో పనిచేస్తున్న బుద్ధిజీవుల సంఘీభావం, సామాజిక అసమానతలను, దానిద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలనేవారిని ఎంతోకొంతమేర నియంత్రించిన వారవుతారు. దేశవ్యాప్తంగా దళితులు, ముస్లింలు ఆదివాసులపై అమలవుతున్న కాషాయికరణ, టెర్రరిజం, అది వ్యాప్తి చెందుతున్న దశ, భారతీయమేధో ప్రపంచాన్ని కలవరపెడుతున్నా, మాట్లాడలేని స్థితిని ముందుకు తెచ్చింది. మాట్లాడుతున్న వారిపై కఠిన చట్టాల ద్వారా నియంత్రించే చర్య వేగవంతంగా అమలవుతున్నది. సైద్ధాంతిక ఆలోచనలలో భిన్న అభిప్రాయాలకు చోటు వుండవచ్చు. అసలు ప్రగతిశీల ఆలోచనలకే సెన్సార్‌షిఫ్ విధించాలనే పాశవిక చర్యతో వ్యక్తులపై కేసులు, జైళ్ళలో నిర్బంధం, చివరకు ప్రజాసంఘాల ఉనికిని ప్రశ్నించడం, ప్రజాస్వామ్య దేశపు పాలకులు అనుసరించాల్సిన విధానం కాదు.

ప్రజల కోసం పనిచేయడం, సామాజిక ఆర్థికరంగాలలో తమకున్న మేధోవికాసంతో పనిచేయడం మానవీయ ప్రజాస్వామ్యానికి అదనపు చేర్పు. ప్రజలకోసం పనిచేసే ఆలోచనలను స్వాగతించాలి కానీ సంకెళ్ళు వేయకూడదు. ఈ సంకెళ్ళు సృజనాత్మక రంగాలలో పనిచేస్తున్న వారికి మాత్రమే వేసినట్లు కన్పించినా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి తనకు తనే వేసుకున్న బంధనాలు కూడా.

T

## ‘నడుస్తున్న తెలంగాణ’ను ఆర్థికంగా ఆదుకోండి

నడుస్తున్న తెలంగాణ మీది. మాది. మనందరిది.

నొసటి నుంచి రాలిన చెమట చుక్కది.

పోరులో చిందిన నెత్తుటి బొట్టుది.

అంటరాని వెలివాడది. ఆశయాల బడుగు జీవిది.

విద్యార్థులది. అధ్యాపకులది. ఉద్యోగులది. వ్యాపారస్తులది.

కనుక ఈ పత్రికను నడపడానికి మీకు తోచిన ఆర్థిక సహాయం చేయండి.

పత్రికను పదికాలాలు నిలబెట్టండి.

# హత్యకు మూలాలు ఏమిటి?

చైతన్య

అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారి విజయారెడ్డి కార్యాలయంలోనే సజీవ దహనానికి గురికావడం బాధాకరమైన సంఘటన. ఉపాధ్యాయ వృత్తినుండి రెవెన్యూ శాఖలో ఉద్యోగం సాధించిన విజయారెడ్డి జరగబోయె పరిణామం గురించి కనీసం కూడా ఊహించి ఉండకపోవచ్చు. తల్లి మరణం తెలియని పిల్లలు అమ్మకోసం అడగడం సగటు మనుషుల హృదయాలను కలిచివేసింది. నాలుగు రోజులు గడిచేసరికి ఎమ్మార్వో విజయారెడ్డిని రక్షించే ప్రయత్నం చేసిన డ్రైవర్ గురునాథం చనిపోయాడు. వీరిద్దరి చావుకి కారణమైన సురేష్ కూడా బతకలేదు. హంతకులు ఎవరనే చర్చ కాసేపు అలా ఉంచితే మూడు కుటుంబాలు తమ దిక్కును కోల్పోయినాయి.

మన రాజకీయ నాయకులకు, పాలనా అధికారులకు చాలా సార్లు వాస్తవాలు పట్టవు. తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలతో పరస్పరం సహకరించుకుంటున్న రాజకీయ వ్యవస్థ, పాలనా వ్యవస్థలు విజయారెడ్డి హత్యానేరాన్ని సురేష్ అనే ప్రాణంలేని వ్యక్తి మీదకి మళ్లించి తప్పించుకోవాలని చూస్తున్నాయి. కండ్లు తెరిచి చూడకుండా పారిపోవాలని చూస్తున్నాయి. నిజాలను నిర్మొహమాటంగా మాట్లాడగలిగే నైతికత కొంతైన పాలకులకు అవసరం. విజయారెడ్డి హంతకులను శిక్షించాలని, ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో రెవెన్యూ అధికారులు చేసిన ఆందోళన తక్షణ స్పందనగా అర్థం చేసుకోగలిగేదే తప్ప న్యాయమైనది కాదని గుర్తించాలి. ప్రజాపన్నుల ద్వారా వచ్చే సంపద నుండి వేతనాలు పొందుతున్న ఉద్యోగులు ఆ ప్రజల సంక్షేమం చూడవలసిన వృత్తి ధర్మాన్ని మరిచిపోవద్దు. ప్రజలనుండే రక్షణ కావాలని కోరుకునే పరిస్థితి దాపురించడం పాలనా వ్యవస్థలోని పతన స్థాయిని సూచిస్తుంది. రియల్ ఎస్టేట్, మాఫియా, రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్స్, భూస్వాములు, ఇతర సంపన్న వర్గాలు ప్రధానంగా రెవెన్యూ శాఖను ప్రభావితం చేస్తూ తమ అదుపులో ఉంచుకుంటాయి. బక్కచిక్కిన పేద, మధ్యతరగతి రైతులు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారు. మహా అంటే ఏడ్చి, మొత్తుకోని తమ హక్కుల కోసం రెవెన్యూ అధికారులను అడుక్కోగలరే కానీ బెదిరించలేరు. అదిరించలేరు. ఇంకా కాస్త స్థోమత ఉంటే కూడబెట్టిన డబ్బులో లేదా అప్పులు తెచ్చి అధికారులకు సమర్పించుకుంటారు. తమకు సహజ సిద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా చెందవలసిన హక్కులను కూడా పొందలేకపోతున్న ఈ అభాగ్యుల నుండి ప్రభుత్వ శాఖలను మరింత దూరం చేయడమనేది రాజనీతిలో అంతర్భాగంగా ఉంటుంది.

ఇప్పుడు “హతులు, హంతకులు” మనమధ్య లేరు. వారి చావులకు కారణమైన వ్యవస్థ జీవించి ఉంది. మన కళ్ళముందున్న హంతక, అవినీతి వ్యవస్థ ప్రక్షాళన గురించి మాట్లాడడం అవసరం. రెవెన్యూశాఖ అన్ని శాఖల్లోకెళ్ల అవినీతి మయమైందని అందరూ ఒప్పుకుంటారు. ఇటీవల భూ ప్రక్షాళన మొదలైన నాటి నుండి అవినీతికి రెక్కలొచ్చాయి. ఏ కొద్దిమంది అధికారులో మినహాయిస్తే అవినీతి చేయని అధికారులు లేరని చెప్పవచ్చు. ఒకవేళ ఎక్కడో ఒకరు అవినీతి, లంచాలకు దూరంగా ఉంటే వారికి ఒంటరి జీవితమే మిగులుతుంది తప్ప సమూహంలో కలువలేరు. పైగా గత మూడు దశాబ్దాలుగా రాజకీయ వ్యవస్థలో వచ్చిన మార్పుల కారణంగా లంచాలు ఇవ్వడం, తీసుకోవడం, అవినీతి చేసి ఆస్తులు సంపాదించడం పెద్ద నేరంగా పరిగణించబడని స్థితి దాపురించింది. రాజకీయ అవినీతి పునాదిపైన న్యాయశాఖ, పాలనాశాఖ అవినీతి పెరిగి పెద్దదౌతున్నది. ఈ మూడు ప్రధాన వ్యవస్థలు సమాచార మాధ్యమాలతో కలిసి అన్ని వ్యవస్థలను అవినీతిమయం చేశాయి. రాజ్యవ్యవస్థలు, ప్రభుత్వ శాఖలు వాటి వాటి గొప్పతనాన్ని ఎంత గొప్పగా చెప్పుకున్నప్పటికీ, వాటిపట్ల కొన్ని వర్గాలలో



నమ్మకం ఉన్నప్పటికీ ఆయా వ్యవస్థలు పుచ్చుబట్టి పోయినాయి. అందమైన అంతస్తుల అద్దాల మేడలు ఆకాశమంత ఎత్తున ఉన్నప్పటికీ వాటి పునాదుల్లో చెదలు నిండిపోయింది. భూ ప్రక్షాళన జరగాలంటే పునాదుల నుండి జరగ వలసిఉంటుంది. భూ ప్రక్షాళన సందర్భంగా ఇప్పుడు కనిపిస్తున్న హత్యోదంతం పునారావృతం కాకూడదంటే ఆశ్రిత పక్షపాతంలేని, అవినీతిలేని పారదర్శకతతో కూడిన భూ పాలన వ్యవస్థ ఏర్పడలసి ఉంది.

150 సార్లు రూట్‌మార్చుకున్న ఓఆర్‌ఆర్ (హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు) రాజకీయ నాయకులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బంగారం పండించింది. బతుకు దెరువుకోసం భూమినే నమ్ముకున్న శ్రమజీవులను, రైతాంగాన్ని మెజార్టీగా బికారులుగా మార్చింది. నాటి కాంగ్రెసు భూ సేకరణ విధానానికి బాధితులైన వారిలో కొర్ర సురేష్ ఒక్కరు. ఓఆర్‌ఆర్ భూ నిర్వాసితుల్లో బడుగుజీవులే మొత్తంగా ఉన్నారు. కొర్ర సురేష్‌కు తండ్రి నుండి సంక్రమించిన నాలుగున్నర ఎకరాల భూమిలో రెండున్నర ఎకరాల భూమి ఓఆర్‌ఆర్‌కే పోయింది. ఉన్న భూమి రెవెన్యూ రికార్డులో అధికారికంగా లేదు. ఈ విషయమై పలుసార్లు కొర్ర సురేష్ వీఆర్వో, ఆర్‌డీవో, ఎమ్మార్వోలతో పాటు ఇతర అధికారులతో ఘర్షణ పడ్డట్లు అనేక ఆధారాలు బయటకు వస్తున్నాయి. భూమిపై వారసత్వంగా హక్కులు గల వారికి భూమిని చట్టబద్ధం చేయడానికి ఎకరాకు 5 వేల నుండి 10 వేల రూపాయల వరకు రైతులు లంచాలు ఇచ్చారు. ఇస్తున్నారు. అర్బన్, సబ్‌అర్బన్ ప్రాంతాలలో లంచాల రేటు లక్షల్లో ఉంది. అధికారుల అలసత్వానికి లంచగొండి తనానికి బలైన ఉదంతాలు తెలంగాణ ఏర్పడినాక అనేకం ఉన్నాయి.

సిరిసిల్ల జిల్లా కండికొట్కూర్ సంఘటన, వనపర్తి జిల్లా పాతపల్లి దళితుల భూమి సమస్య, మొదలైనవి ఎన్నో ఉన్నాయి. వాస్తవ సాగుదారులను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి వారికి చట్టబద్ధ హక్కులు కల్పించడంలేదు. ఈ విధానం వల్ల చట్టాల మీద అవగాహనలేక, అవకాశాలు లేని పేద, సన్నకారు, రైతాంగం ఆగమైతున్నారు. దున్నేవారికే భూమి దక్కాలనే ప్రాతిపదికన ఎన్నో గొప్ప పోరాటాలు చేసిన తెలంగాణ రైతుకూలీల త్యాగాల ఫలితంగా కౌల్దారి రక్షణ చట్టం, భూ గరిష్ట పరిమితి చట్టం లాంటి ఎన్నో భూ సంస్కరణ చట్టాలొచ్చాయి. వాస్తవ సాగుదారులను ఎంతమాత్రం గుర్తించ కుండా "పట్టా ఉన్న వారిదే భూమి"

అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ ప్రభుత్వ పాలకుల తప్పుడు విధానాలు, పాలనా యంత్రాంగల బాధ్యతారాహిత్యం, పేదరైతాంగం వెనుకబాటు తనం, అననుకూల పరిస్థితి వలన నిజమైన భూ హక్కు దారులు లక్షలమంది తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు.

రెవెన్యూ రికార్డులలో భూయజమానుల పేరు ఉండి వాస్తవ సాగుదారులుగా, అనుభవదారులుగా ఉన్న పేద రైతులు భూ ప్రక్షాళన సందర్భంగా భూములు కోల్పోయిన వారిలో రెండు, మూడు తరాల నుండి అనుభవదారులుగా ఉన్నవారు కూడా ఉన్నారు. రైతుకూలీసంఘం నాయకత్వంలో పేద రైతాంగం స్వాధీనం చేసుకున్న భూములు 30, 40 ఎండ్ల తర్వాత పట్టాలు లేవనే కారణంగా తిరిగి భూస్వాములు ఆక్రమించుకునే పరిస్థితి ఏర్పడింది. గతం వలె బలమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు లేకపోవడం భూ ఆక్రమణదారులే మూల మూలనా సామాంతరాజుల వలె అధికారం చెలాయిస్తుండడం వలన కొద్దిపాటి భూములు కూడా పేదల చేతుల్లో నుండి సంపన్నుల చేతుల్లోకి క్రమబద్దంగా బదాలాయించబడే ప్రక్రియ చాపకింద నీరులా జరుగుతున్నది. దళితులకు, పేదరైతాంగానికి ఇస్తానన్న 3 ఎకరాల వ్యవసాయ భూమి హామీగానే మిగిలింది. ఇతర ఆదాయ మార్గాలుండి, సాగులో లేని భూయజమానుల చేతుల్లో ఉన్న 60 లక్షల ఎకరాలకు పైగా భూమి వ్యవసాయాధారిత కుటుంబాలకు, కౌలురైతాంగానికి దక్కడం వలన భూ వికేంద్రీకరణ జరుగుతున్నది. "భూమిలేని పేదవర్గాలకు, సన్న, చిన్నకారు రైతులకు భూమి దక్కేటువంటి అనుకూల విధానమే భూ సంస్కరణల సారం" కానీ పెట్టుబడిదారులకు, రాజకీయ నాయకులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, భూస్వాములకు, భూములు వందల నుండి వేల ఎకరాల వరకు ఉన్నాయి. ప్రభుత్వ విధానం సంపన్న వర్గాల చేతుల్లో భూ కేంద్రీకరణ జరగడానికి అనువుగా ఉ ండడం వలన అవినీతిమయమైన పాలనా వ్యవస్థలో పేదలు భూములు కోల్పోవలసి వస్తుంది. సాదా బైనామాలను రెగ్యులరైజ్ చేయడంలో వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించడంలో ఇప్పటికే ప్రభుత్వం వైఫల్యం చెందింది. ఏనాడో గ్రామాలొదిలి పట్టణాల్లో, విదేశాల్లో నివసిస్తున్న సంపన్నులు రైతుబంధు సందర్భంగా, భూ ప్రక్షాళన సందర్భంగా వారి తాతతండ్రుల పేర ఉన్న భూముల భూమి సరిహద్దులు చూసుకోవడం ఇంకో రకమైన గడీల పునరుద్దరణ రూపంగా తెలంగాణలో తలెత్తుతున్నది.

విజయారెడ్డి హత్య నేపథ్యంలో విధులను బహిష్కరిస్తూ ఉద్యమిస్తున్న రెవెన్యూ ఉద్యోగసంఘాలు అవినీతిరహిత సేవలు అందిస్తామని వాగ్దానం తీసుకుంటే సమాజం హర్షిస్తుంది. తెలంగాణ సాధనలో కీలకమైన పాత్ర గల వర్గాల్లో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. వారు ప్రభుత్వాన్ని అనేక విషయాల్లో డిమాండ్ చేస్తున్నారు. అవి న్యాయమైనవే. కానీ పాలనా యంత్రాంగంలో పేరుకపోయిన అవినీతి గురించి ఆయా సంఘాలు భవిష్యత్‌లో చేపట్టబోయే పారదర్శక విధానం ప్రకటిస్తే ప్రజలు హర్షిస్తారు.

ఉత్పత్తికి ప్రధాన వనరైన భూమి ఇప్పుడు కేవలం మానవాళికి ఆహార ధాన్యాలు అందించే సాధనమే కాదు, మార్కెట్ వస్తువు అయింది. అమ్మడంకోసం కొనడం, కొనడంబకోసం అమ్మడమనే నీతి బాహ్యమైన విధానాన్ని పాలకులు చేపట్టిన తరువాత పేద, మధ్య తరగతి మనుషులకు సొంత ఇంటి స్థలాలు, వ్యవసాయభూమి రాను రానూ దరిచేరని గుమ్మంగానే మిగిలిపోతుంది. ఈ అవినీతి మయమైన పాలనా వ్యవస్థను సంపూర్ణంగా ప్రక్షాళన చేయకుంటే విజయారెడ్డి, గురునాథం, సురేష్ లాంటి ఎందరో వ్యవస్థ విధించిన శిక్షకు బలికాకతప్పని పరిస్థితి ఏర్పడింది. కార్యకారణ సంబంధాలు పరిశీలించి మూలాల నుండి భూ పాలనను ప్రక్షాళన చేయడానికి ప్రభుత్వం పూనుకుంటుందా? ప్రభుత్వాలు ఏవైనా, పార్టీలు ఏవైనా కూర్చున్న కొమ్మనే నరుక్కుంటాయా?

T

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు**

**ఫేస్‌బుక్ పేజి:** www.facebook.com/pages/Nadustunna-Telangana

# ప్రభుత్వం ముందే ప్రకటిస్తే...?

కె. సూర్యం

పాలక వర్గాలు తమ అధికారాన్ని కాపాడుకోవడానికి కొన్ని సంక్షేమాలు అందిస్తూ ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా ప్రయత్నాలు చే. కానీ, ఒక్కొక్కసారి ప్రభుత్వాలు తమ నిజమైన స్వభావం దాని ప్రజా వ్యతిరేకత రుజువవుతుంది. దాని నుండి తిరిగి ఎలా గట్టెక్కాలని కుటిల ఎత్తుగడలకు దిగుతున్నాయి. సరిగ్గా తెలంగాణ ఆర్టీసీ కార్మికుల 52 రోజుల సమ్మెలో ముఖ్యమంత్రి ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రజలు అర్థం చేసుకోవాలి. ఆర్టీసీ ప్రజా రవాణా వ్యవస్థ. దీనిని లాభ దృష్టితో చూడరాదు. మెరుగైన సౌకర్యాలు అందించడానికి ప్రభుత్వాలు నిధులు విధిగా కేటాయించాలి. ఇది సమాజంలోని సామాన్య ప్రజల రవాణా వ్యవస్థ. దేశంలోనే తెలంగాణ ఆర్టీసీ పేరెన్నిక గన్నది. అనేకమైన అవార్డులు కూడా అందుకున్నది. సుమారు 50 వేల మంది కార్మికులు, 10 వేల 4 వందల బస్సులు, 97 డిపోలు, 364 బస్టేషన్లు, సుమారు 60 వేల కోట్ల ఆస్తులను కూడా కలిగి ఉంది.

"కర్ణుడి చావుకు కోటి కారణాలన్నట్లుగా" ఆర్టీసీ నష్టాలకు అనేక కారణాలు ఉన్నాయి. పెరిగిపోయిన డీజిల్, దానిపై పన్నులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల చెల్లింపు, టికెట్ల రాయితీ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడం, ప్రయివేట్ బస్సులకు అడ్డుకట్టవేయకపోవడంతో నష్టాలను చవి చూస్తున్నది. విద్య, వైద్యం, రవాణాలు సేవా రంగాలుగా ప్రజల సంక్షేమాలు అందించే లక్ష్యంతో ఉంటాయి.

ఆర్టీసీ కార్మికుల వేతన ఒప్పందం రెండు సంవత్సరాల కిందట జరుగాల్సి ఉంది. అనేక సార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కార్మికులు 2019 అక్టోబర్ 5వ తేదీ నుండి సమ్మెలోకి దిగారు. రాష్ట్రంలోని 97 డిపోల వద్ద జరిగిన నిరవధిక దీక్షలలో రాష్ట్రం దద్దరిల్లింది. సమ్మె పట్ల కేసీఆర్ అత్యంత నిరంకుశంగా వ్యవహరించారు. 6వ తేదీ అర్ధరాత్రి వరకు సమ్మె విరమించి డ్యూటీలకు రానిచో ఉద్యోగం లేదు, అందరినీ "డిస్మిస్" చేస్తా "సెల్ఫ్ డిస్మిస్" అయ్యారని అన్నా కూడా ఏ ఒక్క కార్మికుడు/కార్మికురాలు లెక్క చెయ్యలేదు. సమ్మెల పట్ల, సంఘాల పట్ల కేసీఆర్ ఎన్నోరకాలుగా మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు సమ్మెకి సంఘీభావం అందించాయి. కేసీఆర్ మొండివైఖరికి వ్యతిరేకంగా రాష్ట్ర బంద్, చలో ట్యాంక్‌బండ్, మౌనదీక్షలు, నిరాహారదీక్షలు, నాయకుల నిరవధిక దీక్షలు, ర్యాలీలు, సభలు, ధూంధాంలు జరిగాయి. దేశవ్యాపితంగా ఆర్టీసీ కార్మిక సమ్మె చర్చనీయాంశం అయ్యింది. తిరిగి నెల రోజుల తర్వాత నవంబర్ 5 వ తేదీ లోపు డ్యూటీలో చేరండి లేనిచో ఆర్టీసీ ఉండదు, ప్రయివేట్‌పరం చేస్తా అని "డెడ్‌లైన్ "విధించారు. కేసీఆర్ బెదిరింపులకు కేవలం 300 మంది (అంటే ఒక శాతం కూడా కాదు) మాత్రమే విధుల్లో చేరారు. ఇది కార్మికుల గొప్ప ఐక్యత. ఇలా కార్మికులు ఆత్మగౌరవం కాపాడుకుంటూ సమ్మెలో నిలబడ్డారు.

**హక్కులడిగితే అణిచివేస్తాం! కాళ్ళు మొక్కితే కనికరిస్తాం!**

ఏభై వేల మంది ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలంలో కేసీఆర్ అత్యంత నిరంకుశంగా వ్యవహరించారు. నేను వద్దంటే సమ్మె చేస్తారా? చర్చలు జరపననీ, సమస్యలు పరిష్కరించననీ మొండికేసారు. రాష్ట్ర హైకోర్టు, "ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించే మంచి తండ్రి పాత్ర పోషించడం, ఆదర్శ యజమానిలా వుండాలని" కోరింది. గవర్నర్ కూడా కార్మికుల సమస్యను పరిష్కరించాలని తెల్పింది. ఆర్టీసీ జేఏసీ సమ్మె విరమించి పనిలో చేరితే, కక్ష సాధింపులకు పోకుండా డ్యూటీ ఇవ్వండని హైకోర్టు తీర్పులో సూచించినా కేసీఆర్ ఆమోదించలేదు. సమ్మె విరమించి విధులకు హాజరు అవుతామని ప్రకటించినా ఆహ్వానించలేదు. కేసీఆర్ మొండి వైఖరి కారణంగా ఆర్టీసీ జేఏసీ బేషరతుగా నవంబర్ 25 నాడు సమ్మె విరమిస్తూ విధులకు హాజరు కండని పిలుపిచ్చారు. రాష్ట్ర వ్యాపితంగా డిపోల వద్దకు వేలాది మంది డ్యూటీ ఇవ్వండని రాత పూర్వక ప్రతులను ఇచ్చారు. డిపోల వద్ద మూడు అంచెల భద్రతతో, వందలాది మంది పోలీస్ పహారా మధ్య డ్యూటీలో చేర్చుకోవడానికి ఆదేశాలు లేవని, సుమారు 10 వేల మంది కార్మికులని అరెస్ట్ చేశారు. చట్ట వ్యతిరేక సమ్మె చేస్తున్నారు

కనుక లేబర్ కోర్టు తేల్చిన తర్వాతే డ్యూటీ అని ఆర్టీసీ ఎండీ ప్రకటించారు. నవంబర్ 5 లోపు డ్యూటీలో చేరండని 'డెడ్‌లైన్' పెట్టిన ఆనాడు కూడా కార్మికులు సమ్మెలో వున్నారు కదా? ఆనాడు కాని చట్ట వ్యతిరేకత ఈనాడు అయ్యిందా? కార్మికులు డి.ఎం.లను అభ్యర్థించినా డ్యూటీలు ఇవ్వలేదు. ఒక వేళ మమ్మల్ని తొలగించారా? తొలగిస్తే నోటీసులు ఎందుకు ఇవ్వలేదని కూడా కార్మికులు ప్రశ్నించారు. సమ్మె విరమించి డ్యూటీకి వస్తే తీసుకోక పోవడం ఐ.డి.యాక్ట్ క్రింద 'అన్‌ఫేర్ లేబర్ ప్రాక్టీస్'గా పరిగణించాలని లేబర్ అధికారులకు, కార్మికులు వినతి పత్రాలు సమర్పించారు. జేఏసీ "డిమాండ్లు వదిలి సమ్మె విరమించి వచ్చారు కదా! వారికి డ్యూటీలు ఇస్తే మంచిది" అనే అభిప్రాయాలు తెలంగాణ పౌర సమాజం నుండి వ్యక్తం అయ్యాయి. దీనితో 28 క్యాబినెట్ మీటింగ్ తర్వాత ప్రెస్ మీట్‌లో కేసీఆర్ "ఏలాంటి షరతులు వుండవు. రేపటి నుండి డ్యూటీలో చేరండి" అని ప్రకటించారు. ఎన్నికైన టీఎంయూ ఆఫీస్‌కు తాళం వేశారు. యూనియన్ నేతలకు సెలవుతో కూడిన "ఆన్ డ్యూటీ" ఒప్పందాన్ని రద్దు చేసి, సంఘాల పట్ల తన నియంతృత్వ వైఖరిని చూపించారు. ఇది పూర్తి చట్ట వ్యతిరేక, అప్రజాస్వామిక చర్య.

డిసెంబర్ 1న 97 డిపోల నుండి 5గురు చొప్పున ప్రగతిభవన్‌కు పిలిచి, భోజనం వడ్డించి, సమ్మె కాలంలో నిరంకుశంగా వ్యవహరించిన కేసీఆర్, ఎందుకు వరాలు గుప్పించారో కార్మిక వర్గం అర్థం చేసుకోవాలి. మొన్నటి దాక "ఆర్టీసీ వుండదనీ, దీనిని బ్రహ్మదేవుడు కూడా కాపాడలేడనీ, 5100 బస్సులను ప్రైవేట్ వారికి అప్పిగిస్తూ క్యాబినెట్ నిర్ణయించిందనీ ప్రకటించడం, హైకోర్టు విచారణ సమయంలో ఆర్టీసీకి 47 కోట్లు ఇవ్వలేమనడం, సెప్టెంబర్ నెల జీతం ఇవ్వడానికి సొమ్ము లేదనీ, 50 వేల కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేసిన కేసీఆర్, ఆకస్మాత్తుగా, పూర్తి భిన్నంగా వరాలు గుప్పించారు.

కార్మికుల వయో పరిమితి 58 నుండి 60 ఏండ్లు, సెప్టెంబర్ నెల జీతం రేపే చెల్లింపు, 52 రోజుల సమ్మె కాల జీతం కూడా చెల్లిస్తాం. సంవత్సరానికి బడ్జెట్ ద్వారా 1000 కోట్లు కేటాయిస్తాను. మహిళా కార్మికులకు రాత్రి డ్యూటీ రద్దు, వారికి 6 నెలల ప్రసూతి సెలవులు, చైల్డ్ కేర్ సెంటర్స్ ఏర్పాటు, అందరికి మంచి వైద్యం, కార్మిక పిల్లలకు రీయంబర్స్‌మెంట్, ఉచిత పాస్‌లు, సమ్మె కాలంలో చనిపోయిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆర్టీసీని లాభాల బాటలో తీసుకొచ్చి సింగరేణి మాదిరి 1 లక్ష బోనస్ పొందాలి. ఒక్క బస్‌ను కూడా ప్రైవేటీకరించననీ, కోపంతో అలా చేసాననీ, దేశంలోనే ఎక్కువ జీతాలు అందుతున్నాయంటే అది తెలంగాణలో అని తెలియాలని అన్నారు. పి.ఎఫ్., సీసీఎస్ బకాయిలు చెల్లిస్తామనీ, ఆర్టీసీ కార్మికులని 'ఉద్యోగులని' పిలవాలనీ, ఉద్యోగ భద్రత వుంటుందనీ ప్రకటించారు. "ఆర్టీసీకి నేనే బ్రాండ్ అంబాసిడర్", ఏదైనా నేనే చేయాలి, కాని కార్మిక సంఘాల ఎన్నికలుండవనీ, ప్రతి 4 నెలలకు ఒకసారి ఇలాగే భోజనం చేసి మాట్లాడుతాను అని ప్రకటించారు.

### కాళ్ళు పట్టుకో బిర్యాని పెట్టిస్తా

కేసీఆర్ ఆర్టీసీ కార్మికులకు నెలకు 50 వేలు జీతాలు ఉన్నాయనీ, కానీ నెలకు 5 వేలు కూడా రాని వారు కోట్ల మంది వున్నారనీ, అన్నమో రామచంద్రా అంటున్నారనీ అన్న కేసీఆర్, నేడు ఎక్కువ మంది కార్మికులకు జీతం 30 వేలు కూడా లేవనీ, లాభాలలోకి తెస్తే మరో 10 వేలు పెంచుకోవాలని అంటున్నారు. అందరినీ తొలగిస్తాం "డిస్మిస్", "సెల్ఫ్ డిస్మిస్" అన్న కేసీఆర్ 'ఒక్కరిని కూడా తొలగించం, ఉద్యోగ భద్రత వుంటుందని' అంటున్నారు. సమ్మె కాలంలో ఆయన గారి నిరంకుశ, అహంకార మాటల వలన భయభ్రాంతులకు, వత్తిడికి గురై 38 మంది కార్మికులు అసువులు బాసారు కదా? మారిన మనిషిగా కేసీఆర్ నేటి మాటలు చనిపోయిన ఆ కుటుంబాల పెద్ద దిక్కును తెచ్చి ఇవ్వగలరా? తల్లి, తండ్రిని కోల్పోయి అనాథలైన వారికి న్యాయం చేయగలరా? సమ్మె పట్ల నియంతలా వ్యవహరించి తాత్కాలిక డ్రైవర్లతో బస్సులు నడిపించిన ఫలితంగా మరణించిన అనేక మందిని తిరిగి బతికించగలరా? అక్టోబర్ 19నాడు రాష్ట్ర బంద్ సందర్భంలో పోలీస్ నిరంకుశ పద్ధతి వల్ల సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోటు రంగారావ్ ఎడమ చేతి బోటన వేలు ఇవ్వగలరా? నవంబర్ 10న ఛలో ట్యాంక్ బండ్ పిలుపు సందర్భంగా పోలీసులు అతి ఉత్సాహం ప్రదర్శించి కార్మికుల చేతులూ, కాళ్ళు విరిగిన ఘటనలు, తలలు పగిలి రక్తం చిందిన సంఘటనలను ఎలా మరిచిపోగలం? బస్సులు లేక ప్రైవేట్ వాహనాల, అధిక చార్జీ మోతతో రూ. 3 వందల కోట్ల ప్రజల నష్టాన్ని 12 వందల కోట్లతో పూడ్చగలరా?

కేసీఆర్ చేసిన ప్రకటనలకు గుండె పగిలి ఏడ్చి ఏడ్చి,

పిచ్చి పట్టి తనువు చాలించిన వైనాన్ని మరిచి పోగలమా? తను తిప్పవలసిన బస్ పోలీసు కాపలాతో తన ముందు నడిపిస్తే ఒంటిపై పెట్రోల్ పోసుకొని తగలబెట్టుకున్న కార్మికుడి ఆర్తనాదాలు కళ్ళ ముందు తిరుగుతున్నాయి కదా? అది ఎలా మరిచిపోగలము? అప్పుడు సాధ్యం కానిది ఇప్పుడు ఎలా సాధ్యం కాగల్గింది. కాళ్ళు మొక్కితే కనికరిస్తారా? కార్మికులు ఏడ్చి, ఏడ్చి, దండాలు పెట్టే విధంగా మారాలని ఈ నిరంకుశ వైఖరి తీసుకుని తిరిగి నేనే వరాలు ఇవ్వగలనని అనిపించు కోవడానికే చేయడం భావ్యమైనదా? నాడు చీదరించుకున్న కార్మికులతో అభిమానం పొందడానికి చేశారు కదా? నేనే అదుకోగలను, నేనే అణిచి వేయగలను అనే సంకేతం పంపడానికి ఇలా చేశారు.

ఆర్టీసీ ఒక ప్రజా రవాణా సేవారంగానికి తగిన సహాయం అందించాలని అందరూ అరిచి గీపెట్టినా వినలేదు. తల ఎత్తి నిలబడితే, హక్కులు అడిగితే, సహించను. "కాళ్ళు మొక్కండి, బిర్యాని పెట్టిస్తా" అనే విధంగా వ్యవహరించడం ఎంత వరకు సరియైనది? ఇదేనా ప్రజలు కోరుకున్న తెలంగాణ, పౌర సమాజమంతా ఆలోచించాలి. ఎంత మంది చనిపోయినా ఉలకనూ, పలకనూ అనే నిరంకుశ వైఖరి ఎందుకు మారిపోయిందో ప్రజలు అర్థం చేసుకోవాలి. ఒకటి రాష్ట్ర వ్యాపితంగా కార్మిక, ఉద్యోగ, మేధావులు, పౌర సమాజ వ్యతిరేకత వచ్చింది. రెండు మునిసిపల్ ఎన్నికలు దగ్గర పడడం. మూడు డ్యూటీలో చేరండి లేనిచో తొలగిస్తానని బెదిరించినా ఏ ఒక్కరు చేరకపోవడం. 52 రోజులుగా ఐక్యంగా సమ్మె పోరులో వుండడంతో కార్మికులను తిరిగి ఏలా మభ్యపెట్టాలి, సంఘాలను ఎలా దెబ్బ కొట్టాలనే ఈ వరాలు గుప్పించారు. కార్మిక వర్గం జాగ్రత్తగా వ్యవహరించాలి. నేటి వరాల ప్రకటనలు సమ్మె పోరుతో లభించినవేనని భావించాలి. రెండు నెలల సమ్మె కాలం జీతం చెల్లింపు వరంగా భావించరాదు. సమ్మెను నివారించి ఉంటే పనిచేసే వారే కదా? ఇది ఐక్యంగా ధైర్యంగా నిలబడినందుకే, తిరిగి సానుభూతి సంపాదించడానికే ఇలా చేస్తున్నారని గ్రహించాలి.

**ఆర్టీసీ కార్మికుల విరోచిత సమ్మె – నేర్చుకోవలసిన గుణపాఠాలు**

చరిత్రలో కార్మిక వర్గం అనేక విరోచిత పోరాటాలు చేసింది. తలపెట్టిన ప్రతి పోరాటంలో విజయాలు రాక పోవచ్చు. కానీ దాని నుండి తగిన గుణపాఠాలను, మెలుకువలను కార్మిక వర్గం నేర్చుకుంది. తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమ్మె 52 రోజులపాటు సాగింది. 'చర్చలు జరపను' అన్న ప్రభుత్వం, కోర్టు ఆదేశంతో చర్చలు జరపవలసి వచ్చింది. మొక్కవోని ధైర్యంతో కార్మిక వర్గం ప్రభుత్వ బెదిరింపులకు జడిసి పోలేదు. డెడ్ లైన్ విధించినా బెదరలేదు. రెండుసార్లుగా ప్రభుత్వం విధించిన షరతులను ఆర్టీసీ కార్మికవర్గం తిరస్కరిస్తూ మొక్కవోని ధైర్యంతో సమ్మె కొనసాగించడం అపూర్వమైనది.

ఒక ప్రక్క ప్రభుత్వ మొండివైఖరి, సమ్మె కాలంలో రాష్ట్ర హైకోర్టు కార్మికులకు ఉత్సాహం, విశ్వాసం కలిగే విధంగా వ్యవహరిస్తు వచ్చింది. ఆదర్శ తండ్రిలా వుండాలనీ, ఆకలైతే తాను ఉపవాసముండి పిల్లలకు తిండి పెట్టే ప్రేమ గల తల్లిలా వుండాలనీ, గద్ద నుండి కాపాడమని శరణ వచ్చిన పావురం కొరకు శిబి చక్రవర్తి తన ప్రాణాలను కూడా ఇవ్వడానికి సిద్ధమైన రాజులా వుండాలి ప్రభువులు. ఎంతటి వారైనా ప్రజల చేతుల్లో ఓడిపోతారని చరిత్రలో ఎన్నోమార్లు నిరూపితమైంది. ఫిలిప్పిన్స్ రాజునే అధికారం నుండి దింపారనీ, ప్రజలు శక్తివంతులనీ, కోర్టుకు తప్పుడు లెక్కలు ఇస్తున్నారనీ, ప్రభుత్వంపై తీవ్ర పదజాలంతో విరుచుకపడి తీరా 45 రోజుల తర్వాత హైకోర్టు మొండి చేయి చూయిస్తూ నడి సముద్రంలో ముంచింది. మరోపక్క బీజేపీ కార్మికులకు అండగా వుంటాననీ, ప్రభుత్వం మెడలు వంచుతామని, ఆర్టీసీని కాపాడుతామని బీరాలు పలికింది. తీరా ఆర్టీసీ సమస్య మా పరిధిలో పరిష్కరించలేము, రాష్ట్రాలదే అధికారమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనతో కార్మికులు మరింతగా క్రుంగి పోయారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వం మొండిగా, నిరంకుశమైన వైఖరి తీసుకోవడంతో కార్మికులు భయాందోళనకు గురి అయ్యారు. 52 రోజుల తర్వాత సమ్మె విరమించినా విధులకు రానివ్వని వైనాన్ని కార్మికులు చూసారు. ఈ స్థితిలో షరతులు లేకుండా చేరండి అనే ప్రభుత్వ ప్రకటనకు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ప్రగతిభవన్‌లో మీటింగ్ పెట్టి హక్కులనూ, స్వేచ్ఛనూ, ఆత్మగౌరవాన్నీ లాగేసుకున్న కార్మిక సంఘాలు వుండవని ప్రకటించినా కూడా కేసీఆర్ ఇచ్చిన వరాలకు పొంగిపోయారు. ఈ వరాలు మీ వీరోచిత సమ్మె వల్లనే వచ్చాయని గుర్తించడాన్ని మరవరాదు. అయితే ఈ సమ్మె నుండి కార్మిక సంఘాలు, ప్రతిపక్షాలు అనేక పాఠాలు నేర్చుకోవాలి. అలా అయితేనే భవిష్యత్ తరాలకు మార్గదర్శకత్వాన్ని అందించగలం.

**రచయిత: ఐఎఫ్‌టీయు జనరల్ సెక్రటరీ**

# అగ్గి రాజేసిన మతాధారిత పౌరసత్వ సవరణ చట్టం

సంతోష్

నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజన్ (ఎన్ఆర్‌సి) సుప్రీంకోర్టు ఆదేశం మేరకు అస్సాంలో 2019 ఆగష్టు 31న ప్రకటించింది. అందులో చోటు దక్కని వారు 19 లక్షల 60 వేలు. ఇది బి.జె.పి ఆశించినట్లుగా లేదు. తొలగించిన వారిలో 14 లక్షల వరకు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందూవులుగా ఉన్నారు. దీంతో ఎన్ఆర్‌సిని కేంద్ర ప్రభుత్వం అస్సాంలో మళ్లీ నిర్వహించడంతో పాటు దేశమంతటికీ విస్తరిస్తామని ప్రకటించింది. ఒక ప్రజాస్వామిక దేశంలో, లౌకిక రాజ్యాంగం అమలులో ఉన్న చోట ప్రజల పౌరసత్వాన్ని మతం ఆధారంగా నిర్ధారించటమే పెద్ద విషాదం. మనిషి గుర్తింపును మతంలో రంగరించటమే అతి పెద్ద దుర్మార్గం. ఈ దుర్మార్గపు చర్యలకు ఏమాత్రం చింతించక మరింత కసిగా అమలు చేసేందుకు పూనుకోవడం ఫాసిస్టు లక్షణం. ఆ ఫాసిస్టు లక్షణాలను పుణికి పుచ్చుకున్న బిజెపి 'ఈదేశంలో ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులు' అన్న సంకేతాన్ని వారికి పంపేందుకు పౌరసత్వ సవరణ చట్టం–2019 తెచ్చిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రపంచ దేశాలలో ఈ దేశ ప్రతిష్ట మంట గలిసి పోతున్నా వెరవక, ఈ పౌరసత్వ చట్టాన్ని దేశమంతా వర్తింపచేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

1947 అధికార మార్పిడి తదనంతరం నెహ్రూ– పటేళ్ల సారథ్యంలో దౌర్జన్యంగా విలీనం చేసుకున్న ఈశాన్య ప్రాంతం అపార ప్రాకృతిక సంపదలకు నిలయం. బ్రహ్మపుత్ర లోయ పరిధిలోని భూములు అత్యంత సారవంతమైనవి. చమురు నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. విశాలమైన తేయాకు తోటలకు అసోం ప్రసిద్ధి. అనేక రకాలైన సిరిసంపదలకు నిలయమైన అసోంను బ్రిటీష్ వారు నిలువు దోపిడీ చేశారు. ఆ పరంపరనే అధికార మార్పిడి తర్వాత భారత పాలకులు కొనసాగిస్తున్నారు. అసోం ప్రజల పేదరికానికి, అక్కడ తాండవిస్తోన్న నిరుద్యోగానికి పాలకుల దోపిడీ విధానాలేనన్నది ముందు గుర్తించాల్సిన అవసరం ఉంది. అసోంకి 4 వేల కిలోమీటర్ల పొడవైన సరిహద్దును కలిగిన పొరుగుదేశం బంగ్లాదేశ్ నుండి వచ్చి చేరిన



శరణార్థుల, వలసల సమస్య తోడైనాయన్నది ఒక భౌతిక వాస్తవం.

బ్రిటీష్ ప్రభుత్వ ప్రోత్సాహంతో 1826 నుంచి వలసలు జరిగిన మాట నిజమే. భారత భూభాగం ఏక ఖండంగా ఉండటంతో జరిగిన సహజమైన వలసలు అవి. 1947 దేశ విభజన సమయంలో మరోసారి వలసలు ఎడాపెడా జరిగాయి. పౌరసత్వంపై రాజ్యాంగ పరిషత్తులో సుదీర్ఘ చర్చ జరిగింది. పుట్టిన స్థలాన్ని (నివాసం) బట్టి పౌరసత్వం ఇచ్చే 'జుస్ సోలి' అనే విధానం చైతన్యవంతమైందనీ ఆధునికమైందనీ నాగరికమైందనీ ఆ సమావేశం భావించింది. అందుకు భిన్నమైన సూత్రం 'జుస్ సాంగినిస్' అంటే జాతిని (రక్తం) బట్టి పౌరసత్వం అన్న భావనను తోసిపుచ్చింది. భారత దేశంలోనే పుట్టినా తల్లిదండ్రులలో ఒకరు గనుక స్వతహాగా అక్రమ చొరబాటు దారులైతే (అంటే బంగ్లాదేశీ ముస్లింలని భావం) వారికి ప్రత్యేక పౌరసత్వం ఇచ్చే పద్ధతిని 2004లో ప్రవేశపెట్టారు. భారత రాజ్యాంగం తిరస్కరించిన 'జుస్ సాంగినిస్' సూత్రానికి సంపూర్ణ బదలాయింపును సిఎబి, ఎన్ఆర్సి ప్రతిబింబిస్తున్నాయి. 1971 బంగ్లాదేశ్ ఆవిర్భావ సమయంలో మరోసారి వలసలు జరిగాయి.


భారత రాజ్యాంగం పట్ల కమలనాధులకు విశ్వాసం లేదు. మన లౌకిక వ్యవస్థ వారికి కంటిలో నలుసుగా ఉంది. మనదేశంలోని బహుళత్వం, వైవిధ్యం వారికి నచ్చదు. అవకాశం వస్తే భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలని, ఇంకా వీలయితే దాన్ని సమూలంగా తుడ్చి పెట్టాలని ఆరాట పడుతున్నారు. ఇప్పుడు వారికి పార్లమెంటులో సరిపోయే బలం ఉంది. కాబట్టి తమ ఎజెండాలోని అంశాలను చట్టబద్ధం చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అందులో భాగంగానే కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తినిచ్చే 370 రాజ్యాంగ అధికరణను రద్దు చేశారు. కశ్మీర్ రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా విభజించి కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చి గత ఆగష్టు 5 నుంచి కేంద్రం అక్కడ సైనిక పాలన సాగిస్తోన్న విషయం మనకు తెలిసిందే.

ఏ దేశ ప్రజలకైనా పౌరసత్వమన్నది కీలకమైన అంశం. దాని ద్వారానే రాజ్యాంగ హక్కులు లభిస్తాయి. ఇప్పుడు 1955 పౌరసత్వ చట్టానికి సవరణలు తీసుకొచ్చింది. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) డిసెంబర్ 13న రాష్ట్రపతి ఆమోదం పొందింది. ఈ చట్టం ద్వారా ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చి, పార్సీ, సిక్కు, బౌద్ధుల అనుగ్రహం పొందాలని భావిస్తోంది. నిజానికి ప్రపంచంలో ఏ దేశంలో మత ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వడం లేదు. సిఎఎ ద్వారా ప్రజలను మతపరంగా విభజించి, హిందూ-మైనారిటీల మధ్య శతృత్వం పెంచి, తద్వారా రాజకీయ లబ్ది పొందాలని బిజెపి పన్నాగం. నిజానికి మత ఆధారంగా పౌరసత్వం ఇవ్వడాన్ని భారత రాజ్యాంగం వ్యతిరేకిస్తుంది. ఈ విషయం 1955 పౌరసత్వ చట్టంలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. నూతన పౌరసత్వ చట్టం నివాసాన్ని బట్టి పౌరసత్వం అనే హక్కును నిరాకరిస్తుంది.

## హిందూత్వ ఎజెండాలో భాగమే సిఎఎ

1985లో నాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ సంతకం చేసిన అస్సాం ఒప్పందానికి ద్రోహం చేయడమే క్యాబ్ ఆమోదమని ఈశాన్య భారత ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తూర్పు పాకిస్తాన్ (బంగ్లాదేశ్) నుండి వలస వచ్చిన వారికి భారత్ పౌరసత్వం మంజూరు చేయడాన్ని రాజీవ్‌గాంధీ 1971, మార్చి 24న 'కటాఫ్' తేదీగా ఖరారు చేశారు. అయితే దాన్ని క్యాబ్ 2014, డిసెంబర్ 31గా పొడిగించింది. విచిత్రమేమంటే ఇంతకాలం క్యాబ్‌ను వ్యతిరేకిస్తూ వస్తున్న అస్సాం గణపరిషత్ (ఏజిపి) యూటర్న్ తీసుకొని పౌరసత్వ సవరణ బిల్లుకు మద్దతు తెలిపింది. అసోంలో అధికారంలో ఉన్న బిజెపి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో ఎజిపి భాగస్వామ్య పార్టీ కావటం, ఎజిపి అధ్యక్షుడు అతుల్ బోరా బిజెపి ముఖ్యమంత్రి సర్బానంద్ సోనోవాల్ కేబినెట్‌లో మంత్రి కావటమే అందుకు కారణం. 1979 నుండి 1985 వరకు విదేశీయుల వ్యతిరేక ఉద్యమానికి నేతృత్వం వహించిన 'ఆసు' అధ్యక్షుడిగా సోనోవాల్ బాధ్యతలు నిర్వర్తించారు. అస్సాం ఒప్పందంపై సంతకాలు జరగడంతో ఆ ఉద్యమం ముగిసింది. ఇప్పుడు సోనోవాల్ 1992 నుండి 1999 వరకు నేతృత్వం వహించిన విద్యార్థి యూనియన్‌కు వ్యతిరేక పక్షాన ఉన్నారు.

'పౌరసత్వ హక్కు సవరణ చట్టం-2003' ప్రకారం జూలై 1-2003 లోపు జన్మించిన వారి తల్లిదండ్రులు భారతీయులు కాకున్నా 11 సంవత్సరాల నివాసముంటే భారత పౌరసత్వం ఇవ్వబడుతుంది. అలాగే 2003 సవరణ చట్టం తరువాత పుట్టినప్పటికీ వారి తల్లిదండ్రులు భారత పౌరులు అయితే వారికి కూడా మనదేశ పౌరసత్వం ఇవ్వబడుతుంది. అలాగే తల్లిదండ్రులలో ఒక్కరు భారతీయులైతే పౌరసత్వం ఇవ్వబడుతుంది. ఈ భారత పౌరసత్వ చట్టం రూపకల్పనకు కొద్ది కాలం ముందే నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్తాన్ ప్రధాని లియాఖత్‌ఖాన్‌ల మధ్య జరిగిన ఒక సుదీర్ఘమైన, సమగ్రమైన ఒప్పందం ప్రభావం కూడా ఉంది.




ఆ ఒప్పందంలో కూడా మతాల ప్రస్తావన కన్నా పౌరులను, వారి ఇబ్బందులను, ఉభయ దేశాలలో వారు ఎదుర్కొంటున్న సమస్యల ఆధారంగానే పౌరసత్వం ఉండేలా నిర్ణయించారు. ఈ రకంగా 'పౌరసత్వ హక్కు చట్టం-1955' సంపూర్ణంగా మన రాజ్యాంగ స్ఫూర్తికి, స్వభావానికి లోబడి ఒక లౌకిక చట్టంగా రూపొందించబడింది. అమలు చేయబడుతున్నది.

బిజెపి తన విభజనవాద, వివక్షాపూర్వక ఎజెండాతో మొండిగా, మూర్ఖంగా ముందుకు సాగుతోంది. దాని లక్ష్యం ప్రజలను మతపరంగా విభజించి మెజారిటీ మత ప్రజల ఉద్ధారకులుగా ప్రచారం పొందడం ఒకటే కాదు, అంతకు మించి పార్సీ, సిక్కు, బౌద్ధ, జైన మతాలకు చెందిన వారిని ప్రసన్నం చేసుకోవాలని కూడా సంఘ్ పరివారం భావిస్తోంది. అందుకే అది 'ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులూ తమ శత్రువులుగా ఏనాడో ప్రకటించింది. ప్రపంచంలోని ఏ ప్రజాస్వామిక దేశంలోనూ ప్రజలకు మత ప్రాతిపదికగా పౌరసత్వం ఇవ్వడం లేదు. ప్రస్తుతం తమకున్న మూకబలంతో ఈ చట్టాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమై విజయం సాధించారు. ప్రజలను మతపరంగా విభజించి, ఇరువురి మధ్య శత్రుత్వాన్ని సృష్టించి తద్వారా రాజకీయ లబ్ధిపొందాలనుకుంటున్న బిజెపి నాయకుల పన్నాగాలు ఈ దేశానికి అత్యంత ప్రమాదకరం.

## భగ్గుమంటున్న ఈశాన్యం

పౌరసత్వ సవరణ బిల్లుపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటుతున్నాయి. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజలందరూ రోడ్లపై కొచ్చి నిరసనలు తెలియజేస్తున్నారు. మనదేశంలో అక్రమంగా నివసిస్తున్న లక్షలాది ముస్లింయేతర కాందిశీకుల్లో అత్యధికులు ఈశాన్య రాష్ట్రాల్లోనే నివసిస్తున్నందున, కొత్త చట్టంతో వారు ఇక్కడే స్థిరపడతారని, తమ భాష, సంస్కృతి, ఉపాధులు, అభివృద్ధికి ముప్పు వాటిల్లుతుందని ఈశాన్య భారతీయులు ఆందోళన చెందుతున్నారు. 'పౌరసత్వ సవరణ చట్టం, 2019'కి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు వెల్లు వెత్తుతున్నాయి. క్యాబ్‌కు మద్దతు తెలపడాన్ని నిరసిస్తూ ఆగ్రహంతో విద్యార్థులు డిసెంబర్ 15న ఎజిపి దిబ్రూఘర్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. పెద్దసంఖ్యలో యువత, విద్యార్థులు ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేపడుతున్నారు. శాంతియుతంగా జరుగుతున్న వారి ర్యాలీలపై పోలీసులు బలప్రదర్శనకు దిగటం ఉద్రిక్త వాతావరణానికి దారితీస్తోంది. లాఠీచార్జీలో గాయపడ్డ వారిలో ఇద్దరు హాస్పిటల్‌లో మృతి చెందారు. పోలీసుల కాల్పులు, లాఠీచార్జీ నేపథ్యంలో అసోం, మేఘాలయ, త్రిపురలో పరిస్థితి రణరంగంగా మారింది. కలకత్తాలో బస్సులు, రైల్లు అగ్గిబుగ్గయ్యాయి. ఇప్పటి వరకు

ఈశాన్య రాష్ట్రాల్లో పోలీసు కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. ఢిల్లీలోని జామియా వర్సిటీ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేసి గాయపరిచారు. ఢిల్లీలో ఇద్దరు విద్యార్థులు పోలీసు కాల్పుల్లో మరణించారు. ఎబివిపి గుండాలు పోలీసు యూనిఫాంలో వచ్చి ఆర్ట్స్ ఫ్యాకల్టీ వద్ద విద్యార్థులపై దాడి చేశారు. మరోవైపు పోలీసులే ఒక బస్సును తగులబెట్టి ఆ సాకుతో జామియా కాలేజీలో చొరబడి విద్యార్థులను అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టారు. పలు ఈశాన్య రాష్ట్రాల్లో బ్యాంకులు, పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. విమాన సర్వీసులు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 15న షిల్లాంగ్ వెళ్లాల్సిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ మంత్రులు తమ పర్యటనను రద్దు చేసుకున్నారు. జపాన్ ప్రధాని షింజోఅబే కూడా క్యాన్సిల్ చేసుకునే యోచనలో ఉన్నట్టు ఆ దేశ మీడియా వర్గాలు వెల్లడించాయి.

## పాలకుల విభజించి పాలించు విధానాలు

'శరణార్థులు, కాందిశీకులు, వలసదారులు, పేరేదైతేనేం? జన్మభూమిలో కొనసాగుతున్న నిరంతర ఘర్షణలు, యుద్ధ వాతావరణం, ఉగ్రదాడులు, మతపరమైన వేధింపులు, కరువు పరిస్థితులు వంటి కారణాలతో పొట్టచేత పట్టుకుని స్వదేశాన్ని విడిచి తమ కుటుంబాలను కాపాడుకోవడానికి వలసబాట పట్టినవారే. తమ ఆస్తులతోపాటు సొంత అస్తిత్వాన్నీ కోల్పోయి దినదిన గండంగా బతుకుతూ జీవిస్తున్నవారే. యుద్ధాలు, హింస, విద్వేషపూరిత ఘటనలతో ప్రపంచ వ్యాప్తంగా 7.1 కోట్ల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ ఇటీవల ప్రకటించింది. కాగా, ప్రపంచవ్యాప్తంగా 27.2 కోట్ల మంది ప్రజలు వివిధ దేశాల్లో వలస జీవనం సాగిస్తోంటే, ఒక్క భారత దేశంలోనే అత్యధికంగా 1.75 కోట్ల మంది ప్రజలు ప్రవాస జీవితం గడుపుతున్నారని ఇంటర్నేషనల్ మైగ్రెంట్ సాక్ 2019 వెల్లడించింది.

పెట్టుబడిదారీ వర్గం ఎప్పుడూ ప్రజల అభద్రతనూ కోరుకుంటుంది. అందుకోసం ప్రజలను మతాలు, జాతులు, కులాలు, ప్రాంతాలు లాంటి భావోద్వేగాల ఆధారంగా చీల్చేందుకు, చీల్చి ఒకరికెదురుగా మరొకరిని శత్రువులుగా నిలబెట్టి వారి మధ్య వర్గ పునాదిగా సిద్ధించే సహజ మైత్రికి సమాధి కట్టేందుకు పూనుకుంటుంది. సంఖ్యరీత్యా తమ వర్గం అత్యల్పం కాబట్టి అత్యధికులైన తమ శత్రువర్గాన్ని ఐక్యతకు దూరం చేయడం దానికి అనివార్యం. ప్రజలలో ఎరుక పెరిగే కొద్దీ, తమపై వ్యతిరేకత పెరిగే కొద్దీ, ప్రజలలో ఐక్యత పెరిగే కొద్దీ ప్రజల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేయబడ్డాయని ప్రచారంలో ఉన్న రాజ్య అంగాలకు కోరలు మొలిపించి, మరింత క్రూరంగా ప్రజల మీదికి వొదులుతుంది. ఇప్పుడు మన దేశంలో అదే జరుగుతూ ఉంది. పెట్టుబడిదారుల ముద్దుబిడ్డ అయిన రాజ్యం తన వర్గ ప్రయోజనాల కోసం తాను కప్పుకున్న ఒక్కొక్క ముసుగునూ తొలగిస్తూ విరుచుకు పడుతున్నది. పాలకుల ఆగడాలకు న్యాయవ్యవస్థ సైతం ముకుతాడు వేయలేని స్థితికి చేరుకున్నదీ దేశం. న్యాయ వ్యవస్థ తీర్పులను సైతం నిర్వీర్య పరచి సొంత ఎజెండాను అమలు చేసే పాలకపక్షాన్ని సైద్ధాంతికంగా ఎదుర్కోలేని దుస్థితిలో ప్రతిపక్షాలు కూరుకు పోతున్నాయి.

మనదేశంలో పెట్టుబడిదారీ విధానం తెచ్చిన ఆర్థిక సంక్షోభం, కరువు సామాన్య ప్రజలను అనాథలనుగా చేస్తోంది. పెట్టుబడిదారీ విధానం వారి శ్రమను దోపిడీ చేస్తోంటే, పాలకులు వారి అస్తిత్వాన్ని దోపిడీ చేస్తున్నారు. 'వ్యక్తి స్వభావం, స్వేచ్ఛ, వికాసాలు సమాజంతో పెనవేసుకుని ఉంటాయ'ని మార్క్స్ చెప్పినట్లుగా వ్యక్తి ఆర్థిక ప్రయోజనాలూ, ఆ వ్యక్తి ఒక వర్గానికి చెంది ఉండడమనే అంశాలు మానవుల లక్షణాలనూ, ప్రవర్తననూ నిర్దేశిస్తాయి. ఇప్పుడు దోపిడీకి గురువుతున్నది శారీరక శ్రమ మాత్రమే కాదు, మానసిక శ్రమ, తమ అస్తిత్వం కూడా. ఈ దేశం అందరిదీ. ఇదే మతం ఇవాళ ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజల అస్తిత్వాన్ని, పౌరసత్వాన్ని నిర్ణయించే పనిలో పడింది. 'బలవంతులు దుర్బల జాతిని బానిసలను కావించారు/ నరహంతకులు ధరాధిపతులై చరిత్రలో ప్రసిద్ధి కెక్కిరి' అన్నట్లుగా కర్ర పెత్తనం చేస్తున్నారు. దేశం ఏదైనా, ప్రాంతం ఎక్కడైనా– శరణార్థులు, కాందిశీకులు, వలసదారులు–పేరేదైనా వారికి రక్షణ, కనీస అవసరాలు కల్పించడంతో పాటు మానసిక స్థైర్యాన్ని అందించటం 'అంతర్జాతీయ నీతి'. అదే సరైన మానవీయత.

ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల్లో ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడటం పరిశీలకులను ఆశ్చర్యానికి గురిచేశాయి. ప్రతిపాదిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలని దేశవ్యాపితంగా 600 మందికి పైగా రచయితలు, కళాకారులు, మాజీ న్యాయమూర్తులు, అధికారులు మోడీ సర్కారుకు విజ్ఞప్తి చేశారు. పౌరసత్వం (సవరణ) బిల్లు 2019 'విచ్ఛిన్నకర, వివక్షాపూరిత, రాజ్యాంగ విరుద్ధమైనది' అని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న భిన్న సంస్కృతులు, మతాలను పరిరక్షించటం రాజ్యాంగ ధర్మం.




ఆ దిశగా పాలకులు ఆలోచించాలేగానీ, మెజారిటీ ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. మత ప్రాతిపదికన వివక్షపూరితంగా చట్టాలు రూపొందించడం రాజ్యాంగానికి విరుద్ధమేకాక భారత లౌకిక ప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకం.

### పౌర సమాజ నిరసన గళం :

ప్రముఖ న్యాయకోవిదులు, మానవ హక్కుల కార్యకర్తలు, రచయితలు కళాకారులు 720 మందితో కూడిన బృందం పౌరసత్వ (సవరణ) బిల్లు (క్యాబ్), ప్రతిపాదిత అఖిల భారత ఎన్ఆర్సికి వ్యతిరేకంగా ప్రచారాందోళన ప్రారంభించింది. "స్టాండ్ అఫ్ ఫర్ ది కాన్స్టిట్యూషన్ (రాజ్యాంగాన్ని రక్షించుకుందాం), క్యాబ్, 2019 రద్దు చేయండి, ఎన్ఆర్సి వద్దు" అనే పిలుపుతో తాము ప్రారంభించిన సోషల్ మీడియా ఉద్యమానికి ప్రజల తోడ్పాటు కోరింది. భారత పౌరసత్వం సమానత్వం, వివక్షారహితం అనే రాజీలేని సూత్రాలపై ఆధారపడి ఉందని వారు వక్కాణించారు. రాజ్యాంగ విలువల పరిరక్షణను కోరుకునే పౌర సమాజంలోని ప్రసిద్ధ మేధావుల అభిప్రాయాలను సైతం ఖాతరు చేయకపోవటం దాని మూర్ఖపు ఒంటెత్తు పోకడకు నిదర్శనం. ఈ ప్రకటనపై సంతకం చేసిన వారిలో సుప్రీంకోర్టు మాజీ జడ్జీ పి.బి.సావంత్, బంబాయి హైకోర్టు మాజీ జడ్జీలు హోస్పెట్ సురేష్, బి.జె.కొల్సే పాటిల్, మానవ హక్కుల కార్యకర్తలు తీస్తా సెతల్వాడ్, జావెద్ ఆనంద్, కవి సినీ రచయిత జావెద్ అక్తర్, సీనియర్ అడ్వకేట్ మిహిర్ దేశాయ్, మాజీ ఉన్నతాధికారి హర్ష్ మందెర్లున్నారు.

ఇదిలావుండగా, దాదాపు 1000 మంది శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, దేశంలో సుప్రసిద్ధమైన పరిశోధనా సంస్థలకు చెందిన రీసెర్చి స్కాలర్స్ పౌరసత్వ (సవరణ) బిల్లును ప్రస్తుత రూపంలో ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఒక పిటిషన్పై సంతకాలు చేశారు. బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టక ముందు వారీ ప్రకటన చేశారు. బిల్లు పట్ల ఆందోళన చెందుతున్న పౌరులుగా తమ వ్యక్తిగత హోదాలో ఈ ప్రకటన చేస్తున్నట్లు పిటిషన్ తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు కూడా సిఎఎని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా అమెరికాకు చెందిన రెండు కమిటీలు తీవ్రంగా స్పందించాయి. క్యాబ్ను పార్లమెంటు రెండు సభలు ఆమోదించినట్లయితే హోంమంత్రి అమిత్షా, ఇతర ముఖ్య నాయకులపై ఆంక్షలు విధించే విషయాన్ని పరిశీలించాలని అమెరికా హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీ కూడా ఈ బిల్లును తప్పు దిశలో ప్రమాదకరమైన మలుపు'గా అభివర్ణించింది. పౌరసత్వానికి మత ప్రాతిపదిక ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాన్ని దెబ్బ తీస్తుందని వ్యాఖ్యానించింది.

## ముగింపు

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15,21,25,26లను అతిక్రమిస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం ద్వారా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులకు ఎంతో లాభం చేకూరుస్తుంది. వీరు డిసెంబర్ 31, 2014 కంటే ముందే భారత్‌కు వచ్చి ఉండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ మతాలకు చెందిన వారు మూడు దేశాల నుంచి వచ్చినవారు ఎలాంటి అవసరమైన పత్రాలు లేకున్నా భారతీయ పౌరులుగానే పరిగణించబడుతారు. ఒకవేళ వీరి వద్ద సరైన పత్రాలు లేకపోయినప్పటికీ వీరు బహిష్కరణకు గురవ్వరు. భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేయడానికి ముందు వీరు కనీసం 11 సంవత్సరాలు దేశంలో ఉండాలన్న నిబంధనను ఆరేళ్లకు సడలించారు. ఈ బిల్లు మయన్మార్ రోహింగ్యాలను, శ్రీలంక తమిలులను, ఇతర దేశాల నుంచి వచ్చిన ముస్లింలను విస్మరించింది.

పౌరసత్వ చట్ట సవరణ చట్టం (సిఎఎ), పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్‌పి) ప్రక్రియను ఒకే విధంగా చూడాలి. ఇందులో సిఎఎ ముస్లిమేతర వలసవాసులను దేశ పౌరులుగా గుర్తిస్తుండగా, ఎన్ఆర్‌సి ప్రక్రియ అక్రమ వలసవాసులుగా చెప్పబడుతున్న ముస్లింలను టార్గెట్ చేస్తుంది. ఈ చర్యల ద్వారా వారిని దేశంలో ద్వితీయశ్రేణి పౌరులుగా మార్చి వారి హక్కులను కాలరాసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్ఆర్‌సి గుర్తించే 'విదేశీయు'లను ఏం చేస్తారు? బహిరంగ జైళ్లు నిర్మిస్తారా? ఉపాధి లేకుండా చేస్తారా? ఈ దేశంలోనే పుట్టి పెరిగిన లక్షలాదిమందిని శిక్షిస్తారా? ఇది మత సమస్య కాదు. మానవ సమస్య, మానవత్వం సమస్య. ఈ ఆలోచనా విధానం, చర్యల వెనుక వి డి సావర్కర్ ప్రబోధించిన ద్విజాతి సిద్ధాంతం వుందనటంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇవాళ దేశం ఆర్థికంగా అధోగతి పాలవుతోంది. నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మహిళ ప్రాణాలకు రక్షణ లేదు. నిరుద్యోగం పెరిగిపోతోంది.

ఈ పరిస్థితిల్లో వాస్తవిక సమస్యల గురించి ప్రజలు ఆలోచించకుండా చేయటానికి, ఆందోళన పథంలో అడుగు పెట్టకుండా ఉండటానికి ఇటువంటి సమస్యలు సృష్టిస్తోన్నారు. బిజెపి–ఆరెస్సెస్ స్వార్థ రాజకీయాలకు అనువైన విభజన అజెండాను సృష్టించేందుకు మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు క్యాబ్, ఎన్ఆర్‌సిలను బిజెపి వినియోగించుకునే అవకాశాలున్నాయి. కాబ్‌ను సుప్రీం కోర్టులో పలువురు సవాలు చేశారు. దీనితోపాటు కాబ్–ఎన్ఆర్‌సిలకు సంబంధించి బిజెపి పన్నుతున్న దుర్మార్గపు కుట్రలను ఎండగట్టాలి దేశవ్యాప్తంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని పునాదిగా చేసుకుని ముందుకు సాగుతున్న సమాజం మనది! ఈ ఐక్యతను ముక్కలు చేయడమే మతం పేరుతో రాజకీయాలు చేసే వారి లక్ష్యం. దానిని తిప్పికొట్టడమే అభ్యుదయవాదులు, ప్రజాతంత్ర శక్తుల తక్షణ కర్తవ్యం! T

**రచయితలకు సూచనలు:**

**1. రచనలను పేజీకి ఒకవైపు మాత్రమే అర్థమయ్యేలా రాసి పత్రిక అడ్రస్‌కు ప్రతినెల 15వ తేదీలోగా పంపగలరు.**

**2. డీటీపీ చేయించి పంపేవారు ప్రతినెల 18వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో పంపించగలరు.**

**3. చేతి రాతలో పంపే రచనలను స్కాన్ చేసి మెయిల్ ద్వారా కాకుండా పోస్ట్ ద్వారా పంపించగలరు.**

**4. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**5. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**6. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**7. పరిశోధకులు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు. –సం.**

జాతీయం

# రైతాంగానికి హానిచేసే నూతన విత్తనబిల్లు-2019


ఎ.నర్సింహారెడ్డి

విత్తన చట్టం–2019 ముసాయిదా బిల్లును విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం, నవంబర్ 15 నాటికి సూచనలు, సలహాలు, సవరణలు పంపాలని వెబ్‌సైట్‌లో పెట్టింది. కేంద్ర ప్రభుత్వాలు నూతన విత్తన బిల్లు తేవడానికి 2004 నుండి మల్లగుల్లాలు పడుతూనే ఉన్నాయి. 'విత్తన బిల్లు–2019' రైతుల హక్కులను హరించేలా ఉంది. గత విత్తన హక్కు చట్టంలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు 2004లో అప్పటి సంయుక్త పార్లమెంటరీ కమిటీ కొన్ని ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వం ముందుంచింది. వాటిని పదిహేనేళ్ళ నాన్చి, ఆ సిఫార్సులను బేఖాతరు చేసే నూతన విత్తన బిల్లును ప్రస్తుత ఎస్.డి.ఎ ప్రభుత్వం నవంబర్ 18 నుంచి నడుస్తున్న శీతాకాల పార్లమెంటు సమావేశాలలో ప్రవేశపెట్టబోతున్నది. ఇది కార్పొరేట్ విత్తన కంపెనీల లాభాల వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగించేందుకు అవకాశం ఇచ్చేదిగా ఉంది.

భారతదేశంలో హరిత విప్లవ నేపథ్యంలో 1966లో విత్తనాలు దిగుమతి చేసుకోవడానికి వీలుగా విత్తన చట్టం తెచ్చారు. తర్వాత 1986లో దీనికి సవరణ చేశారు. మొక్కల రక్షణ కొరకు 'ప్లాంట్ వెరైటీ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తెచ్చారు. 1965 నుంచి 1985 వరకు జరిగిన హరిత విప్లవ కాలంలో సంకర విత్తనాల వాడకం వల్ల ఆహారధాన్యాలే కాక అన్ని పంటల ఉత్పత్తి 5 రెట్లు పెరిగింది. నూనె గింజలు, పండ్లు, పూలు, తదితర పంటల ఉత్పాదకత గణనీయంగా పెరిగింది. ఎగుమతులు కూడా జరిగాయి. విత్తనంలో వచ్చిన మార్పుల ఫలితంగా ఇది సంభవించిందన్నది నిజమే కానీ రైతును కుంగదీసింది. అందువల్ల దేశ విత్తన విధానం రైతుకు స్వేచ్ఛా నిచ్చేదిగా ఉండాలి. విత్తన రక్షణ అంటే దేశ ప్రజల ఆహార రక్షణగా గుర్తించాలి.

భారత్‌లో అన్నదాతకు సేద్యం ఎప్పుడూ నిరాశనే మిగులుస్తోంది. అదేం విచిత్రమోగానీ రైతులను మినహాయిస్తే వ్యవసాయ ఉత్పత్తులపై ఆధారపడిన దళారులు, వ్యాపారులు వంటి వర్గాలన్నీ లాభాల బాటలోనే సాగుతున్నాయి. విత్తన కొనుగోలు నుంచి మార్కెట్లలో పంట విక్రయించడం వరకు రైతుల ప్రయోజనాలను పరిరక్షించేలా సమగ్ర చట్టాలు లేకపోవడం పెద్ద లోపం. విత్తన చట్టమే ఇందుకు ఉదాహరణ. నిజానికి వ్యవసాయ ముఖ్య వనరుల్లో విత్తనం ఒకటి. ప్రభుత్వరంగ విత్తన సంస్థలు రంగంలో ఉన్నప్పుడు రూపొందించిన నిబంధనలే, ప్రైవేటు రంగం విస్తరించిన కాలంలోనూ ఆచరణలో ఉండటం రైతుల ప్రయోజనాల్ని బలిపెట్టడమే అవుతుంది. వ్యవస్థలోని లోటు పాట్లు రైతుల హక్కుల్ని కాలరాస్తున్నా దశాబ్దాలుగా చోద్యం చూసిన పాలకులు కొత్త విత్తన చట్టం రూపకల్పన వైపు త్వరితంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో విత్తన బిల్లు ముసాయిదాను మరోసారి దేశం ముందుంచిన మోదీ ప్రభుత్వం కొత్త విత్తన చట్టాన్ని రైతు ప్రయోజకరంగా రూపకల్పన చేయాలని రైతాంగం కోరుకుంటోంది.

ఇప్పటికే అమల్లో ఉన్న విత్తన చట్టం ప్రకారం నకిలీ, నాసిరకం విత్తనాల సమస్యలు ఉత్పన్నమైనప్పుడు రైతులు వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేస్తే రాష్ట్రస్థాయి కమిటీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుంది. చట్టంలోని నిబంధనలు కఠినంగా లేకపోవడంతో కొన్ని కంపెనీలు లేదా విక్రేతలు కొందరు కీలక అధికారుల్ని ప్రభావితం చేస్తూ కొద్దిపాటి జరిమానాలతో తప్పించుకుంటున్నారు. పెద్దసంఖ్యలో రైతులు నష్టపోయిన కేసుల్లో మాత్రం వ్యక్తులు/కంపెనీల లైసెన్సులు రద్దు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో కూడా పలు కంపెనీలు మారుపేర్లతో అవే విత్తనాలను తయారు చేస్తూ విపణిలోకి ప్రవేశిస్తున్నాయి. ఇవన్నీ ఆయా రాష్ట్రాల వ్యవసాయ శాఖలు, నిఘా విభాగాలకు వీరి మధ్య నెలకొన్న అపవిత్ర సంబంధాలు కారణమని తెలిసినా అన్నదాతల ఉసురు తీస్తూనే ఉన్నాయి.కొన్ని కంపెనీలు మిగిలిపోయిన విత్తనాలను తదుపరి పంటకు తిరిగి కొత్తగా ప్యాకింగ్ చేసి విక్రయించడం, జన్యు స్వచ్ఛత లేని వాటినీ సరికొత్త




విత్తనాలతో కలగలిపి మార్కెట్ చేయడం వంటి అనుచిత పనులు చేస్తుంటాయి. ఫలితంగా రైతులకు దిగుబడి తగ్గుతుంది. కొంతమంది పేరొందిన కంపెనీల విత్తన ప్యాకెట్ల మాదిరిగానే అచ్చుగుద్దినట్టు ముద్రించి రైతులకు అంటగడుతున్నారు. ఇలాంటి నకిలీ విత్తనాల్ని నియంత్రించాల్సిన ప్రభుత్వాలు మౌనం ప్రదర్శిస్తున్నాయి.

**నూతన విత్తన చట్టం ప్రయోజనం అంతంతమాత్రం**

వ్యవసాయంలో కీలకమైన విత్తనాన్ని, విత్తనచట్టాన్ని కేంద్రం తన పరిధిలో ఉంచుకున్నది. 1966 విత్తన చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం 2004లో రూపొందించిన విత్తన బిల్లును 2004 డిసెంబర్ 9న రాజ్యసభలో ప్రవేశపెట్టారు. వివరమైన పరిశీలన కోసం 2004 డిసెంబర్ 16న పార్లమెంట్ వ్యవసాయ స్థాయి సంఘానికి పంపారు. పార్లమెంటరీ స్థాయి సంఘం 2004 విత్తన బిల్లులో ఉన్న లోపాలను గుర్తించి, చేసిన సూచనలకు కొత్త ముసాయిదా చట్టం 2019లో చేర్చకపోవడం శోచనీయం. 2019 విత్తన చట్టం ముసాయిదా బిల్లు సెక్షన్ 11 ప్రకారం "రైతు అంటే ఎవరు అనే నిర్వచనంలోనే తేడా ఉంది. వ్యవసాయ భూమి స్వంతదారులై ఉంటే చాలు. వ్యవసాయం చేసినా, చేయించినా రైతులే అని బిల్లు అంటుంది. అంటే భూమిని కొనుక్కుని వ్యవసాయం చేయించే కంపెనీలు కూడా రైతులు అవుతున్నారు". సెక్షన్–21 ప్రకారం నకిలీ, నాసిరకం విత్తనాల వల్ల రైతులు నష్టపోతే విత్తన అమ్మకందారుల నుంచి 1986 వినియోగదారుల చట్టం కింద రైతులు పరిహారం పొందవచ్చని ప్రస్తావించారు. ఇది సరికాదు. విత్తనం అమ్మిన వ్యక్తులు లేదా కంపెనీలు నష్టపరిహారాన్ని కేవలం ఆ మొత్తానికి వడ్డీ కలిపి చెల్లించాలని ఫోరం తీర్పు చెబుతుందే కానీ, ఆ విత్తనాలు వాడటం వల్ల రైతు ఒక పంట కాలాన్ని, తద్వారా కోల్పోయిన దిగుబడికి తగ్గ పరిహారాన్ని ఇవ్వాలని ఫోరం ఆదేశించడం లేదు. పైగా ఫోరం తీర్పులు ఏళ్ల తరబడి సాగుతుండటం కూడా రైతులకు నష్టమే. ఇందుకు నష్టపరిహారం అందించే కేంద్ర, రాష్ట్ర స్థాయి విత్తన కమిటీలలో రైతులు, కర్షక సంఘాల ప్రతినిధులకు అవకాశం కల్పించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

విత్తన కంపెనీలు తమ విత్తనాలకు సంబంధించి స్వీయ ధ్రువీకరణ ఇచ్చుకోవడాన్ని ముసాయిదాలో రద్దు చేయడం బాగుంది. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ధరలను నియంత్రించే సావకాశం కమిటీకి ఉంటుందని బిల్లులో పేర్కొనడం వల్ల వాణిజ్య పంటల విషయంలో విత్తన ధరలను నియంత్రించడం కష్టమవుతుంది. తద్వారా రైతులు మరింత ఇబ్బందిపడే అవకాశముంది. కాబట్టి ధర నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వాలకు విధిగా నియంత్రణ ఉండేలా ముసాయిదా

మార్చాలి. సెక్షన్-40 ప్రకారం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే విత్తన రకాల విషయంలో పర్యావరణ రక్షిత చట్టం ప్రకారం నిబంధనలను నిర్దేశించారు. దిగుమతి చేసుకునే విత్తనాలను కనీసం 21 రోజులపాటు 'క్వారంటైన్'లో పెట్టి క్షేత్రస్థాయిలో తగిన పరిశోధనలు చేసి మన వాతావరణంలో పరీక్షించిన తర్వాతే మార్కెట్లోకి విడుదల చేయాల్సిన అవసరముంది. ముసాయిదాలో ఆ మేరకు మార్పులు చేపట్టాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

సాధారణంగా విత్తన స్వచ్ఛత నూరు శాతం, మొలక 80 శాతం ఉండాలి. అంతకు తగ్గితే వాటిని నాసిరకాలుగా నిర్ధారిస్తామని ముసాయిదాలో పేర్కొనాలి. సెక్షన్-23 ప్రకారం వ్యవసాయ పట్టభద్రులకే డీలర్ లైసెన్స్ ఇవ్వాలి. విత్తన మోసాలు, విత్తనాల జన్యుస్వచ్ఛత, విత్తన నాణ్యత లోపించినప్పుడు విత్తన అమ్మకదారులకు రూ. 25 వేల నుంచి అయిదు లక్షల రూపాయల వరకు జరిమానా, గరిష్ఠంగా ఏడాది జైలుశిక్ష లేదా రెండూ విధించే అవకాశం కల్పించారు. 2004 చట్టంలోనే రూ. 50 వేల నుంచి అయిదు లక్షల రూపాయల వరకు జరిమానాలు విధించవచ్చని పేర్కొన్నారు. పార్లమెంటరీ స్థాయా సంఘం గరిష్ఠంగా ఏడాది జైలుశిక్షతో సహా జరిమానా రెండు లక్షల రూపాయల నుంచి రూ. 10 లక్షల వరకు విధించాలని సూచించినా 2019 ముసాయిదాలో జరిమానాలను తగ్గించింది. వీటిని స్థాయా సంఘం సూచనల ప్రకారం పెంచాల్సిన అవసరముంది.

రైతు విత్తనాలు కొని పంట పండించిన తర్వాత ముందుగా విత్తన కంపెనీలు చెప్పిన మేరకు దిగుబడులు రాకపోతే ఆయా విత్తన కంపెనీలు నష్టపరిహారం చెల్లించేందుకు అవసరమైన కాంపెన్‌సేషన్ కమిటిని నియమించే అధికారాన్ని ఇచ్చే సెక్షన్‌ను ఈ బిల్లులో తీసివేశారు. వినియోగదారుల రక్షణ చట్టం-1986 ప్రకారం నష్ట పరిహారం పొందాలని పేర్కొన్నారు. ప్రత్యేక కాంపెన్‌సేషన్ కమిటీని నియమించే అధికారాలు బిల్లులో ఉంటే రైతులకు సకాలంలో నష్టపరిహారం అందుతుంది. నాణ్యమైన విత్తనం మాత్రమే సరిపోదు. ఆయా విత్తనాల ధరలు నియంత్రణలో ఉండాలి. రైతు భరించగలిగేలా విత్తన ధరలు ఉండాలని పార్లమెంటరీ కమిటీ సూచించింది. కేంద్ర ప్రభుత్వం 'విత్తన ముసాయిదా' బిల్లులో కార్పొరేట్‌ల స్వేచ్ఛ కల్పించింది. రైతులు నష్టపోతే కన్జ్యూమర్ కోర్టుకు వెళ్లాలంటూ బిల్లులో పెట్టింది.

గత పదేళ్లుగా వరంగల్, గుంటూరు పత్తి, మిర్చి పండించే రైతులు కన్జ్యూమర్ కోర్టుల్లో వేలాది కేసులు వేశారు. వీటిలో 80 శాతం పెండింగులో ఉన్నాయి. తీర్పు వచ్చిన కేసులపై కంపెనీలు హైకోర్టుకు అప్పీల్ చేశాయి. మొత్తానికి కంపెనీలు పరిహారం నుంచి తప్పించుకుంటున్నాయి. వీటికి మద్దతుగానే కేంద్రం ఇప్పుడు పెట్టిన ఈ కోరలు తీసిన బిల్లు రైతులకు ఏమాత్రం ఉపయోగపడదు. అనుచిత కార్యకలాపాలకు పాల్పడే విత్తన విక్రేతలు, కంపెనీల విత్తన లైసెన్స్‌లను శాశ్వతంగా రద్దు చేయాలి. వారిపై పీడీ చట్టాన్ని ఉపయోగించి భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలకు పాల్పడకుండా చర్యలుండాలి. ఆషా, రైతు స్వరాజ్య వేదిక, అఖిల భారత రైతు సంఘం కేంద్ర వ్యవసాయశాఖకు పంపిన సూచనలను ముసాయిదాలో చేర్చితే విత్తన చట్టాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఉంటుంది.

## ప్రభుత్వంపై విత్తన కంపెనీల ప్రభావం

1995లో మొదలైన సరళీకృత వ్యవసాయ విధానాల వల్ల డబ్ల్యూటీఓ షరతులు అమలు జరపడం వల్ల విదేశీ బహుళజాతి సంస్థలు వచ్చి ఇక్కడే విత్తనం ఉత్పత్తి చేయడమే కాక, రైతులు వాణిజ్యపరంగా సాగుచేయడానికి విత్తనాలను అమ్ముతున్నారు. ప్రస్తుతం మోన్‌శాంటో, సింజెంటా, కార్గిల్ వంటి కంపెనీలు భారతదేశంలో 20శాతం విత్తనాలు అమ్ముతున్నాయి. ఈ బహుళజాతి కంపెనీలు రైతులకు నాణ్యతలేని విత్తనాలను, కల్తీ విత్తనాలను సరఫరా చేసి వేల కోట్లు లాభాలార్జిస్తున్నాయి. ఏటా ఉభయ తెలుగు రాష్ట్రాలలో 5.6 లక్షల ఎకరాలలో పంటలు దెబ్బతింటున్నాయి. దీనిపై రైతు సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేసి మారిన పరిస్థితులకు అనుగుణంగా విత్తన చట్టం తేవాలని కోరారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వ 'విత్తన ముసాయిదా చట్టం' తెచ్చింది. దానికి రైతులు, రైతు సంఘాలు, లా కమిషన్ చేసిన సూచనలను జతపరిచి, బిల్లుగా రూపొందించి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఆమోదించబడితే బహుళజాతి సంస్థలు వేలాది కోట్ల నష్టపరిహారం చెల్లించడమే కాక, వాటి లైసెన్సులు రద్దు చేయబడటం వంటి అంశాలు బిల్లులో ఉన్నాయి. దీంతో బహుళజాతి కంపెనీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిలును ఆమోదించకుండా నిలిపివేశాయి.

జాతీయ రైతు కమీషన్ అధ్యక్షుడు, యం.ఎస్ స్వామినాథన్ కూడా విత్తన హక్కు చట్టాన్ని రైతులకు

అనుకూలంగా మార్చేందుకు గాను కొన్ని సూచనలు చేశారు. అభివృద్ధి చెందిన దేశంలోని అత్యధిక పౌరులకు ఉపాధిని, బతుకుకు భద్రతను ఇచ్చే వృత్తి వ్యవసాయం కావున, విత్తనం మీద రైతుకే సర్వహక్కులుండాలనే సిఫార్సును బలపరిచారు. నిరంతర రైతుల ఆందోళన ఫలితంగా 2010లో మరొకసారి సవరణలతో బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. మళ్లీ అదే ఒత్తిడి రావడంతో ఆమోదానికి పెట్టలేదు. రాజ్యాంగ రీత్యా విత్తన చట్టం రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలి. కానీ, కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చి తానే చేస్తానని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. అయినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు సంఘం ఆందోళన ఫలితంగా 2012లో శాసనసభలో బిల్లును పెట్టింది. అయితే, కేంద్రం ఒత్తిడితో దాన్ని ఉపసంహరించుకుంది. 2015లో టిఆర్ఎస్ ప్రభుత్వం చర్చల కోసం, సూచనలు చేయాలని ముసాయిదాను విడుదల చేసింది. కానీ, నేటికి కూడా శాసనసభలో పెట్టలేదు. రాష్ట్రాలను రాజ్యాంగేతరంగా ఫెడరల్ విధానానికి వ్యతిరేకంగా కేంద్రం బెదిరిస్తుందనడానికి ఇది నిదర్శనం.

## రైతులకే విత్తన హక్కులుండాలి

విత్తనోత్పత్తి వ్యాపారంలోకి ప్రైవేటు కంపెనీలు విస్తృతంగా రాని రోజుల్లో కేవలం ప్రభుత్వ రంగ విత్తన సంస్థలే ఉన్న కాలంలో రూపొందించిన 1966 విత్తన చట్టమే నేటికీ చలామణీ అవుతుండటం గమనార్హం. విత్తనోత్పత్తి విషయంలో కార్పొరేట్ కంపెనీలు పలు అంశాలను రహస్యంగా ఉంచుతుంటాయి. విత్తనాల ఉత్పత్తి, ప్యాకింగ్, అమ్మకాల వివరాలను వ్యవసాయశాఖకు తెలియజేయాలనే నిబంధనలు పాత చట్టంలోనే ఉన్నా ఆ శాఖ వద్ద సమాచారం లేదంటే–పర్యవేక్షణ ఎంత లోపభూయిష్ఠంగా ఉన్నదో అర్థమవుతోంది. కొన్ని కంపెనీలు రైతులతో విత్తనోత్పత్తి చేయించే విషయంలో మధ్యవర్తులను పెట్టుకుంటాయి. నేరుగా రైతులతో ఒప్పందాలు కుదుర్చుకోవు. దీనివల్ల పరిహారం చెల్లించాల్సిన సమయంలో మధ్యవర్తులు జారుకుంటే రైతులు అన్యాయం అవుతున్నారు. ఇలాంటప్పుడు మూడో పక్షంగా జిల్లా వ్యవసాయాధికారులు ఉండాలని రైతుసంఘాలు సూచిస్తున్నాయి.

జన్యు మార్పిడి పంటల విషయంలో కూడా కంపెనీలు ఒక రకానికి అనుమతులు తెచ్చుకుని అనధికారికంగా తదుపరి తరం విత్తనాలపై స్వేచ్ఛగా క్షేత్రస్థాయి ప్రయోగాలను నిర్వహిస్తున్నాయి. వీటిపై నిషేధం అమల్లో ఉన్నా చర్యలు తూతూమంత్రంగా సాగుతుండటం వ్యవస్థలోని మరో లోపం. స్వయంగా విత్తనోత్పత్తి చేసి విక్రయించుకునే విషయంలో ఎలాంటి బ్రాండ్‌పేరు లేకపోయినా స్వేచ్ఛగా అమ్ముకునే సావకాశం రైతులకు ఉండాలి. రైతులు క్షేత్రస్థాయిలో వారి విత్తనాలను సాగు చేసినప్పుడు కంపెనీలు ప్రకటించిన లక్షణాల మేరకు అవి ఫలితాలనిచ్చాయా అనేది ముఖ్యం. ఈ విషయంలో తేడాలుంటే కంపెనీలపై చట్ట ప్రకారం చర్య తీసుకునే అధికారం ప్రభుత్వాలకు ఉండాలి. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడుకుంటూ ఇక్కడి చట్టాలకు లోబడి వ్యాపారం చేసుకునేలా బహుళ జాతి కంపెనీల కార్యకలాపాలు ఉండాలని, ఎలాంటి వెసులుబాట్లు ఇవ్వకుండా బిల్లును చట్టరూపంలోకి తీసుకురావాలని దేశవ్యాప్తంగా రైతులు, రైతుసంఘాలు ముక్తకంఠంతో కోరుతున్నాయి.

కొత్త విత్తన చట్టం తమ ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉండాలనీ రైతులు కోరుతున్నారు. విత్తన ధరల నిర్ణయంలో కంపెనీల ఇష్టానికి వదిలిపెట్టకుండా ప్రభుత్వ 'నియంత్రణ ఉండాలి. విత్తనాలు నాసిరకాలని తేలినప్పుడు వాస్తవ పంట నష్టాన్ని చెల్లించేలా కంపెనీలు జవాబుదారీతనం కలిగి ఉండాలని రైతులు కోరుతున్నారు. నకిలీ, నాసిరకాలు సరఫరా చేసే వారు ఇతర పేర్లతో విత్తన వ్యాపారం చేపట్టకుండా జీవిత కాలం నిషేధించడంతో పాటు, కఠినంగా శిక్షించాలి. దేశీయ విత్తన రంగం ప్రభావితం కాకుండా విత్తనోత్పత్తిపై రైతులకున్న స్వేచ్ఛను హరించకుండా చట్టాలను బలోపేతం చేయాలి. దేశంలో విత్తనోత్పత్తి చేసే సంస్థ లేదా వ్యక్తుల కార్యకలాపాలు ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణలో ఉండాల్సిన అవసరముంది.

## నకిలీ విత్తనాలపై కొరవడిన నియంత్రణ

పండించిన పంట నుంచే విత్తనాలను దాచుకుని వాటినే వాడుకోవడం సాంప్రదాయకంగా మన రైతులకున్న అలవాటు. సంకర జాతి వంగడాలు వచ్చాక ఈ పరిస్థితి కొంత మారింది. సంప్రదాయ పంటల తరహాలో తదుపరి పంటకు విత్తనాలు వాడుకునే వెసులుబాటు సంకరజాతి, జన్యుమార్పిడి పంటల్లో ఉండదు. నాటిన ప్రతిసారీ కొత్తగా కొని వాడుకోవాల్సిందే. ఈ కారణంగా విత్తనాల కోసం

రైతులు కంపెనీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. లాభామే సర్వస్వం అనుకొనే స్థానిక విత్తన కంపెనీలు, బహుళ జాతి కంపెనీల భాగస్వామ్య వ్యాపారంలో ఇరుక్కున్నాయి. దీంతో విత్తనాలు ఖరీదైన ఉపకరణాలుగా మారి, రైతుకు దూరమౌతూ వచ్చాయి. పత్తి, కూరగాయ పంటల విషయంలో ఈ ధోరణి వేగంగా జరిగింది. ఇతర ఆహార ధాన్య పంటలకు అది విస్తరిస్తున్నది. దీంతో విత్తన స్వావలంబనకు ముప్పు ఏర్పడే పరిస్థితి నెలకొన్నది. ముఖ్యంగా వాణిజ్య పంటల విషయంలో 90-95 శాతం రైతులు సంకరజాతి, జన్యుమార్పిడి విత్తనాల కోసం కంపెనీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రపంచ విత్తన వ్యాపారంలో భారత్ వాటా తక్కువగా ఉన్నప్పటికీ విత్తన వినియోగం రీత్యా అతి పెద్ద మార్కెట్లలో మనదీ ఒకటి. ఈ కారణంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకునే దిశగా ఈ కంపెనీలు భారీ లాబీయింగ్ చేసే శక్తియుక్తుల్ని ప్రదర్శిస్తున్నాయి.

విత్తన దిగుమతుల్ని నియంత్రించాల్సిన అవసరముంది. అనేక కంపెనీలు అనేక కూరగాయ విత్తనాలను విచ్చలవిడిగా విదేశాల నుండి తెచ్చి అమ్మటాన్ని చూస్తున్నాం. తద్వారా సమస్యలు ఎక్కువై, సాగు ఖర్చు రైతుకందనంత ఎత్తుకు వెళ్తోంది. ఈ విషయంలో విత్తన బిల్లులో స్పష్టత లేదు. ముఖ్యంగా జన్యు మార్పిడి సాంకేతికాల వాడకం ద్వారా రూపొందిన విత్తనాల నియంత్రణ పకడ్బందీగా జరగాలి. బిల్లులో పొందుపరిచిన పండ్ల మొక్క ఉత్పత్తి, విడుదల విషయంలో సూచన అసమగ్రంగా ఉంది. నియంత్రణా వ్యవస్థ కేవలం పండ్ల మొక్కల విషయంలోనే కాక పూర్తి ఉద్యనవన కేంద్రీయ నర్సరీలపై ఉండాలి. ప్రస్తుతం అనేక కూరగాయల నారును ఉత్పత్తి చేసి, రైతులకు అమ్మి సొమ్ము చేసుకొనే కంపెనీలు పెరిగాయి. రైతులు వాటి విషయంలో ప్రచారాన్ని నమ్మి మోసపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దాన్ని దృష్టిలో పెట్టుకొని పటిష్టమైన నియంత్రణా వ్యవస్థను, నేరానికి తగిన శిక్షను విధించగల అవకాశాలను బిల్లులో విపులంగా పొందుపరచాలి. అంటే ఈ బిల్లు... స్వేచ్ఛా వ్యాపార ముసుగుతో విత్తన రంగంలో ప్రవేశించిన బహుళజాతి వ్యాపారులకు, కంపెనీలకు అనుకూలంగా కాకుండా, బతుకు దెరువు, ఉపాధి హామీ కేంద్రంగా నడిచే వ్యవసాయానికి, వ్యవసాయదారులకు, ఆహార వినియోగదారులకు, పర్యావరణ రక్షణకు తగినట్లు ఉండాలి.

**ముగింపు**

దేశంలో విత్తన కంపెనీలకు అడ్డుకట్ట వేసి రైతుల హక్కుల్ని కాపాడతామంటూ 2002లో కేంద్ర ప్రభుత్వం కొత్త విత్తన చట్టం కోసం రైతు సంఘాల సూచనలు కోరింది. 2004లో పాక్షికంగా ఒక ముసాయిదాను రూపొందించింది. దీనికి సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అడుగు ముందుకు పడలేదు. 2010లో పార్లమెంటరీ స్థాయి సంఘం సూచనల మేరకు కేంద్రంలోని యూపిఎ ప్రభుత్వం విత్తన బిల్లు ముసాయిదాకు పూర్తి రూపమిచ్చేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు కోరింది. పాత ముసాయిదాకు స్వల్ప మార్పులు చేసి 2010 విత్తన బిల్లును రూపొందించారు. ఇందులోని నిబంధనలు రైతులకంటే కంపెనీల ప్రయోజనాలను పరిరక్షించేవిగా ఉన్నాయంటూ రైతు సంఘాలు వ్యతిరేకించడంతో ఇది చట్టరూపం దాల్చకుండా ఆగిపోయింది. విత్తనోత్పత్తి చేసే సంస్థలపై కఠిన చర్యలు ప్రతిపాదిస్తూ పలు రాష్ట్రాలు ముసాయిదాకు సవరణలు తెలిపినా విత్తన కంపెనీల లాబీయింగ్ ముందు అవి నిలవలేకపోయాయి.

అఖిల భారత కిసాన్ సభ, ఇతర రైతు సంఘాల సూచనలను పాలకులు చిత్తశుద్ధితో స్వీకరించి దేశ వ్యవసాయ రంగ సుస్థిరతను, విత్తన స్వావలంబనను పెంచాలి. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడుకుంటూ ఇక్కడి చట్టాలకు లోబడి వ్యాపారం చేసుకునేలా బహుళజాతి కంపెనీల కార్యకలాపాలు ఉండాలనీ, ఎలాంటి వెసులుబాట్లు ఇవ్వకుండా బిల్లును చట్టరూపంలోకి తీసుకురావాలని రైతులు, రైతుసంఘాలు ముక్తకంఠతో కోరుతున్నాయి. అయితే నూతన విత్తన బిల్లులో రైతు సంఘాల, పార్లమెంటరీ కమిటీ సిఫార్సులకు అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. ముఖ్యంగా 'విత్తన ధర' విషయంలో వ్యాపార సంస్థలకే ప్రాధాన్యత ఇచ్చారు. ఇది రైతుకు నష్టం చేస్తుంది. రైతు ప్రయోజనాలను పరిరక్షించే విత్తన చట్టాన్ని సాధించుకోవడానికి రైతు సంఘాలు సంఘటితంగా పోరాడాలి.

# తెలంగాణ పోరాట కవిత్వం

దుండె రాజేశ్వరి

కవిత్వం గురించి రాయలంటే కొద్దిగా కష్టమే. అట్లని కవిత్వం గురించి ఆలోచించటం, తలెత్తే ప్రశ్నలకు సమాధానం వెతుక్కోవటం వదిలి వేయలేం. కవిత్వాన్ని విశ్లేషించటం వలన కవిత్వంలో సృజనాత్మకత పెరుగుతుంది. కొత్తగా కవిత్వం రాసే వారికి మేలు జరుగుతుంది.

తెలంగాణ పోరాట కవిత్వమంటే, తెలంగాణ విముక్తి పోరాటంలో వచ్చిన సాహిత్యం. తెలంగాణ విముక్తి కోరుతూ తెలంగాణ వారే కాకుండా తెలంగాణేతరులు కూడా ఈ కవిత్వాన్ని రచించారు.

కవి మనసులో పుట్టిన ఆలోచనలు అక్షర రూపం దాల్చి పాఠకుల వద్దకు రావటానికి మధ్య కవిత్వ నిర్మాణంలో చాలా ప్రాసెస్ ఉంటుంది. కవి ఒక దృశ్యాన్ని చూసిన వెంటనే స్పందించకపోవచ్చు. కాని ఆ సంఘటన వెంటాడుతూనే ఉంటుంది. దానికి కవితా రూపం ఇవ్వకపోతే ప్రశాంతంగా ఉండలేరు. అట్లా కవిత్వాగ్ని దగ్ధమయ్యే స్థితి నుంచే మంచి కవిత్వం వస్తుంది. కవిత్వం రాయటమంటే ప్రసవ వేదనలా భావించిన వారే చక్కటి కవిత్వం సృష్టించగలరు. సాధారణ మనుషుల ఆలోచనలను తాకని విషయాలు కవి హృదయాన్ని కల్లోలం చేస్తాయి. అప్పుడు అసంకల్పితంగా వ్యక్తమయ్యే భావాల సముదాయం కవిత్వంగా బయటికొస్తుంది.

ఇది 'తెలంగాణ', 'నా తెలంగాణకోటి రత్నాల వీణ' అన్న దాశరథి కంటే ఒక పన్నెండేండ్లకు ముందే ఈ పేరుతో సి.ఇ. ఆంద్రూస్ ఒక కవిత రాసినాడు.

*"వెలయుచున్నది దేశబాషలకు మిన్నా*
*ఆంధ్రభాషా మతల్లి ప్రయాస మనక*
*ప్రబలుచున్నది తెనుగు కబ్బము చెలంగి*
*నివురు గప్పిన యనలమై కవుల మదిని*
*నివురు గప్పిన యనలమై"*

ఎంత మంచి మాటన్నాడోయి ఈ కవి. తెలంగాణ



కవులు నివురుగప్పిన నిప్పులు. పైకి అట్లా కన్పించరు. లోపల కవిత్వంముంటుంది. అది పోకుండ మొదటి తెలంగాణ కవి పాల్కురికి సోమనాథుడు, భాగవతం రాసిన పోతన "పలికించు విభుండు రామ భద్రుండట" అనే అన్నాడు కాని, నేను దేశాన్ని అదరగొట్టే కవిత్వం రాస్తున్నాననలేదు.

తెలంగాణ రైతాంగ పోరాటం, తెలంగాణా పోరాటంలో భాగమే అయినా లక్ష్యసాధన మాత్రం వేరువేరుగా కనిపిస్తుంది. ఈ లక్ష్య సాధనలో "స్వేచ్ఛ" అనే అంశం ఏకోన్ముఖంగా కనిపిస్తుంది. లక్ష్య సాధనకు తెలుగు కవులు కేవలం కవిత్వం మాత్రమే కాకుండా నవల ద్వారా కూడా కృషి చేశారు.

తెలంగాణలో జీవిస్తూ పోరా టంతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్న వారు, పోరాటంతో సంబంధం లేకుండా దాని స్ఫూర్తితో దూర ప్రాంతాల్లో ఉండి మనస్థైర్యాన్ని అందిస్తూ రచనలు చేసిన వారూ ఉన్నారు. వర్గ పోరాటాన్ని సమర్థించే కవులకు తెలంగాణ సాయుధ పోరాటం గొప్పకవితా వస్తువైంది. దీన్ని ఫ్యూడల్ వ్యవస్థ మీద తిరుగుబాటు ఉద్యమంగా అభ్యుదయ కవులు వర్ణించారు.

తెలంగాణ పోరాటంలో అభ్యుదయ కవుల పాత్ర ఎక్కువగా ఉండడం వల్ల తెలంగాణ పోరాటాన్ని, అభ్యుదయ కవిత్వోద్యమాన్ని విడదీసి చూడలేనంతగా కలిసిపోయాయి. అవంత్స సోమసుందర్ 'వజ్రాయుధం", గంగనేని "ఉదయిని", రమణారెడ్డి "భువనఘోష", ఆరుద్ర "త్వమేవాహమ్", కుందుర్తి "తెలంగాణా" దాశరథి అగ్నిధార, రుద్రవీణ, కాళోజీ నా గొడవ మొదలైనవి తెలంగాణ ప్రజల ఆశలను, ఆశయాలను, పోరాటాలను కవితా వస్తువులగా ప్రతిఫలింపచేసిన కొన్ని ముఖ్యమైన రచనలు.

ప్రసిద్ధమైన ఈ కవులే కాకుండా ఎంతో మంది అజ్ఞాత కవులు, జానపద కవులు వేలకొద్ది పాటలతో ప్రజా చైతన్యానికి కారణమయ్యే సాహిత్యాన్ని సృష్టించారు. ఆ పాటలలో చాలా వరకు తెలంగాణ జానపద గేయాల బాణీలోనూ, తెలంగాణ మాండలిక పదాలలోనూ, నుడికారాలలోనూ కొనసాగి, ప్రజల హృదయాల్ని కదిలించగలిగాయి. చైతన్యం, స్వేచ్ఛ, విముక్తి భావనలను కవిత్వంలో పలికించడానికి పాట వచన కవిత్వం, పద్యాలుగా పలికాయి.

'కవిత్వం' గురించి తెలుసు కొనేటప్పుడు 'కవి' అంటే ఎవరు? అని సంక్షిప్తంగానైనా వివరించటం సమంజసం "కవిర్మనీషీ పరిభూః స్వయంభూః" అని శావాస్యాపనిషత్తులో కనిపిస్తుంది.

జానపద గేయాలు, బుర్రకథలు, యక్షగానాలు వంటి రూపాలు తెలంగాణ పోరాటం వల్ల మరింత శక్తివంత మయ్యాయని ఈ సందర్భంలో మనం గమనించాలి.

*"నైజామ్ సర్కరోడ*

*నాజీల మించినోడా*

*బందెనక బండి కట్టి*

*పదహారు బండ్లు కట్టి*

*ఏ బండ్లో పోతావొ కొడుకో"*

వంటి పాటలు 'రూప' వైవిద్యానికి చక్కని నిదర్శనాలు. ప్రజా రూపాల్లో సాహిత్యాన్ని తీసుకురావడానికి ఇది ఎంతగానో దోహదపడిన 'పాట' అని భావించవచ్చు. విశాలాంధ్రో ద్యమంలోని 'మా కొద్దీ తెల్లదొరతనము" అనే పాట గరిమెళ్ళను "జాతీయ కవి"ని చేసింది వేములపల్లి శ్రీకృష్ణ రాసిన 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా, గతమెంతో, ఘనకీర్తి గలవాడా", శివయ్య రాసిన 'పలనాడు వెలలేని మగాణిరా" త్రిపురనేని రామస్వామి చౌదరి రాసిన "వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరో తెలుపుడి" శంకరం బాడీ సుందరాచారి రాసిన మా తెలుగు తల్లికీ మల్లెపూదండ మొదలైన పాటల ద్వారా తెలుగు కవిత్వం రూపంలో ఎంతో వైవిధ్యాన్ని పొందిందని గమనించవచ్చు.

"ప్రహ్లాద కవిత్వం ఆరిపోయే దీపాన్ని రగుల్చుతుంది. పరుగెత్తే పామరుణ్ణి నిలేస్తుందని తన కవిత్వ లక్ష్యాన్ని నిర్దేశించడం గమనించవచ్చు. ఈ కవిత్వాన్ని తర్వాత చాలా పత్రికలు ప్రోత్సహించాయి. ముద్దుకృష్ణ నడిపిన "జ్వాల" పత్రిక, "ఉదయిని" 'ప్రతిభ', కృష్ణా పత్రిక మొదలైన వాటిని ఈ కృషిలో ప్రముఖంగా చెప్పుకోవచ్చు. ప్రహ్లాద కవిత్వం అని శిష్టా పెట్టిన పేరు ప్రచారంలోకి రాకపోయినా, ఆ రూపంలోని కవిత్వాన్ని కొనసాగించి, దాన్ని 'వచన కవిత్వం' అని పిలిచారు. కవులు, విమర్శకులు.

ఆధునిక కాలంలో సంస్కరణ, జాతీయోద్యమ, భావ కవిత్వానికి ఇచ్చిన ప్రాధాన్యతను తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సాహిత్యానికి ఇవ్వలేదు. కనీసం చరిత్రలో భాగం కానివ్వలేదు. చిలకమర్తి అల్లిన 'భరత ఖండంబు' పద్యానికి

ఎంతో ప్రాచుర్యాన్ని కల్పించారు. గరిమెల్ల 'మా కొద్ది తెల్లదొర తనం' పాటకు గొప్ప గౌరవం ఇచ్చారు. అట్లే సుద్దాల హన్మంతు రాసిన 'పల్లెటూరి పిల్లగాడా" బండి యాదగిరి రాసిన 'బండెనక బండి కట్టి' పాటలు కొట్లాది మంది ప్రజల నాలుకల మీద ఉన్నా పాఠ్యపుస్తకాలోకి రాలేదు.

వరవరరావు, చెరబండరాజు, గద్దర్, అల్లం రాజయ్య ప్రత్యామ్నాయ భాషను, నుడికారాన్ని, నిర్మాణాన్ని విప్లవ సాహిత్యానికి అందించారు. తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన విప్లవ సాహిత్యానికి రూపంలో, శిల్పంలో చాలా తేడాలు ఉన్నాయి. నన్ను ఎవ్వరెలా పిలిస్తే నాకేంటి నేనొక నక్సలైట్‌ను అయినప్పుడు అనే శైలి తెలంగాణలో ఉంటుంది. 'సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మ కన్నీటిని కత్తుల్లా మార్చి కొమరెల్లి కొండలో కొలిమి రాజేయ్యాలని పిలుపునిచ్చిన గద్దర్.

దాశరథి రాసిన ఒక కవితా ఖండిక

***"రానున్నది ఏది నిజం***

***అది ఒకటే సోషలిజం***

***కలపండోయ్ భుజం భుజం***

***కదలండోయ్ గజం గజం"*** వంటి సమసమాజ స్థాపనను ఆకాంక్షించే దృక్పథాన్ని తెలియజేస్తున్నాయి. కవిత్వానికి సామాన్య ప్రజలను మరింత దగ్గరగా చేసాడు.

***"ఇది నా కవిత్వం గీతి, వినేవాడు నరుడు***

***చదువు సంధ్యలు రాని రోడ్డు మీద పామరుడు***

***లేమి తల్లి వొడిలో నిరంతర గాఢ నిద్రపరుడు"*** అని వర్ణించడం చూడవచ్చు

కవిత్వంలో వస్తువు ప్రధానం అని భావించే వారిలో కుందుర్తి ఒకరు. ఈ అభ్యుదయ కవిత్వంలో మరో మంచి కవి అజంతా వీరి 'స్వప్నలిపి' సామాన్య మానవుడి ఆలోచనలు కలలో ఉండే స్వప్నలిపి వంటివి. అందరికీ అర్థం కానివి అతనికి మాత్రమే తెలిసేవి. స్వప్నం పూర్తయిన తర్వాత అది గుర్తుండడం, గుర్తుండక పోవటం జరుగుతుండిన వాటిని ఇతరులు అర్థం చేసుకోవడం అంత సులభమైన పనికాదు. అజంతా రాసిన స్వప్నలిపిలోని కవితలలో మానవుడి ఆలోచనలు, ఆశలు, ఆశయాలు వెనుక ఏదో నిరాశ కనిపిస్తుంటుంది. అది నిరాశగా మిగిలి పోకుండా చైతన్యానికి దారి తీసేలా చేస్తుంది.

***"ఆశ లేదు ఆస్కారం లేదు***

***ఫలానా రోజు శాపం ఆఖరవుతుందనే హామీ లేదు***

***ఫలానా రోడ్డు గమ్యం చేరుస్తుందనీ***

***సూచన ఎక్కడా ఏమీ లేదు***

***జీవితం ఇప్పుడు ఇలా కన్నీళ్ళు***

***ప్రవాహంగానే సాగుతుందనుకుంటాను***

***రోడ్డు పొడవునా చెట్లు కూలుతున్న***

***దృశ్యాల్ని చూపుతుందనుకుంటాను.***

ఈ కవితా ఖండికను చూస్తే బయటికి నిరాశ కనిపిస్తుంది. అంతర్లీనంగా దాన్ని పోగొట్టి చైతన్యానికి ఉద్దీపులు కమ్మంటుంది. మధ్య తరగతి మానవుని జీవితాన్ని సజీవంగా చిత్రించిన గొప్ప అభ్యుదయ కవి అజంతా.

తెలుగు సాహిత్యానికి కొత్త చూపుతో అధ్యయనం, పరిశోధన చేస్తూ అసలైన తెలంగాణ సాహిత్య చరిత్రను రూపొందించుకోవాలి. తెలంగాణ పాలకులు పూనుకోవాలి. అరవై ఏళ్ళుగా నిరాదరణకు గురైన భాషా సాహిత్యాలకు మన మన అనే భావన ఇక్కడి ప్రజలలో వచ్చింది. మన భాష, మన కళలు, మన సాహిత్యం, మన సంస్కృతి అనే బలమైన వ్యక్తీకరణ గత పదేళ్లలో పెరిగింది.

తెలంగాణ, గ్రామీణ జీవితం, పట్టణ జీవితం, పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, 'జీవన సమరం'లో తెలంగాణ ప్రజల జీవనం కనిపిస్తుంది.

**ఉపయుక్త గ్రంథసూచి:**


1. తెలంగాణ తెలుగు నవల – డా॥ పంతంగి వెంకటేశ్వర్లు.

2. తెలంగాణ సాహిత్యం – కాశీం

3. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత–ఎస్. శరత్ జ్యోత్స్నారాణి

4. తెలంగాణ వైతాళికుడు – కాళోజీ – డా॥వేలూరి శ్రీదేవి

5. తెలంగాణ భావ విపంచిక – గొలకొండ కవుల సంచిక – అనుమాండ్ల భూమయ్య



★ **రచయిత: పరిశోధక విద్యార్థి**

సాహిత్యం/కథ

# ఉద్యోగాలు లేనిచోటు

సమీర

'ఆకుపచ్చా సందామామా నీవెలే నీవులే..' 'లేరా.. లేరా ఓరైతన్నా-రెక్కల..'

'పల్లెసీమ ఒక భాగ్యసీమరా..' వ్యవసాయం పాడి పరిశ్రమ వంటి గ్రామీణ నేపథ్య ఔన్నత్యాన్ని ఇనుమడింప జేసే పాటలు, రైతు ప్రాధాన్యతను ఉన్నతీకరించే పాటలను వాటికి సంబంధించిన సినిమాదృశ్యాలను టీవీలోచూస్తూ మరిపెంలో మునిగి ఉన్నరు అవ్వా మనవరాండ్రు.

'ఛెంగు ఛెంగునా గంతులు వేయండి..'

'అమ్మా ఒదినా అన్నా...' అదాటుగ వాకిట్లోనుంచి అరుపులు విని, ఆశ్చర్యంతో ఇద్దరూ మంచంమీద నుంచి దిగ్గన లేచి పెద్ద దర్వాజ కెదురుగ వచ్చి బైటకు చూసిన్రు.

మధు ఎడమచేతిని వెనుక ఉంచి గేటుదాటి వాకిట్లో నుంచి, ఉరికొచ్చి నట్లొచ్చి పడుసాల దాటుతూ కనిపించిండు.

'ఏంది బాబాయ్-ఏందిరా అంత సంబరం' అవ్వా మనవరాళ్ళిద్దరూ ఒకేసారి ఆత్రంగా అడిగిన్రు.

'అమ్మా మా రిజల్ట్ ఒచ్చింది. నాకు మంచి ర్యాంక్ ఒచ్చింది. నౌకరి ఖాయం.' అంటూ తల్లిముందు వంగిండు మధుసూదన్.

'అరే మధూ మీరిజల్టొచ్చిం....' గేటుదాటి వస్తూనే పెద్దర్వాజ అవల మొదటగా కన్పించిన, తమ్ముణ్ణి అడుగబోయి, అక్కడి దృశ్యాన్ని చూసి విషయం అర్థమైనట్లు ఆగిపోయాడు వీరస్వామి. తల్లికాళ్ళకు దండంబెట్టి వీరస్వామి ముందు వంగబో తుండగా, జబ్బ పట్టి నివారించి 'ర్యాంకు మంచిగొచ్చిందా' అన్నడు.

'అన్నా తొంభైయ్యారవ ర్యాంకే. ఉద్యోగమూ కోరుకున్న చోటనే వస్తది. మిఠాయి తీస్కోండమ్మా, అన్నా' వెనుకకు పట్టుకున్న స్వీట్ డబ్బాను ముందుకుంచి డబ్బా మూత తెరిచిండు.

'మానాయ్న! మీ నాయిన అన్న ఒదినల కష్టం ఊకె పోలే...'

'కష్టమంత మీదేనా?బాబాయ్ కష్టపడలేదా ఏంది!' రాములమ్మ వీరస్వామిల తర్వాత తనకిస్తున్న స్వీట్ డబ్బాను తీసుకుంటూ లలిత అంది.

'ఏంది?! మిఠాయంత ఇంటోల్లే దింటరా, మాకేమన్న మిగిలిస్తరా!' అదివరకే వెనకున్న వంటింట్లో ఉన్న రేణుక నడిమి దర్వాజ కాడికొచ్చి విషయమంతా తెలసి నిష్ఠుర సరసాన్ని గొంతులో వినిపించింది.

'అదేమట్లంటవేందే రేణుకా. ఇగో మిగిలిందంతా ఆమెకీయే.' మనవరాలికి సూచించింది నవ్వుతూ.

'నేనియ్య, ఆమె ఎవరో తెల్వుకోకుండ.' అని తల్లివైపు తిరిగి, ఎవరమ్మా నీవు?! బైటవోయేదానివి ఇంట్లకెట్లొచ్చినవ్, ఎప్పుడొచ్చినవ్, ఎందుకొచ్చినవ్? మీన్నుంచి మేం సంతోషంల మిఠాయిలు తెచ్చుకొని తింటుంటే వాటా అడ్గుతావ్? ఆ! ఎంత ధైర్యం నీకు! నడు! తొల్త బైటకు నడిచి మాట్లాడంతే!' అసహనాన్ని నటిస్తూ ఆదేశించింది.

'దొంగ ముండా నీకు తెలివెక్కువై మాటలు బగ్గ నేర్సినవే...' అంటూ చేతికందిన ఒక జడ నందుకున్నది. వెనుకకు పట్టుకున్న స్వీట్ డబ్బాను అందుకునే ప్రయత్నం చేస్తూ.

'అబ్బా నొప్పైతుందే రాక్షసీ. కాపాడుండ్రి ఎవరన్నా. మొదలు నా ప్రశ్నలకు జవాబు చెప్పు. తర్వాత మిఠాయి తిందుగాని'

తల్లీ బిడ్డ ఆటలను చూస్తున్నరు మిగిలినోళ్ళు.

'సూతం జవాబు చెప్పి తీస్కుంటదా? ఒట్టిగనే గుంజు కుంటదా' వీరస్వామి.

'నేను నేనెవర్నా? వీరస్వామి అనే ఈయన మీ అయ్య, పన్నెండేండ్ల కింద ఇగో ఈ తల్గు...' మెడలోని పుస్తెల తాడును చూపిస్తూ,' నా మెడకు గట్టి గుంజుకొచ్చి, ఈ చిన్న రాక్షసిని చూసుకొమ్మని నా మొకం మీద పడేసిండు. నేనాయ్న పెండ్లాన్ని. నిన్యాడనుంచి దెచ్చి నాకిచ్చిండో! ఇప్పుడు చెప్పు, నీవెవతివే.' మిఠాయి డబ్బ గుంజుకొని.

ఈ ఆటను చూసి, 'మీరట్లనే ఆడుకోండి, నేనుబైటకు

వోయొస్త.' అంటూ బైటినుంచొచ్చినోడొచ్చినట్లే మళ్ళీ బైటకు పోయిండు వీరస్వామి.

'ఔనూ, సంజీవన్న గుడ రాసిండు గద. అన్నకొచ్చిందో లేదో కనుక్కో మధూ'

'ఔగద మర్సిపోయినం. మంచి గ్గుర్తుజేసినవ్ బిడ్డ!..' రాములమ్మ.

ఆవిడట్లంటుంగనే మధు ఫోన్ చేయవట్టిండు. సిగ్నల్ సమస్య వల్ల కావచ్చు ఫోన్ అసలు మోగకుంటే పడుసాలలోన్కి అటు నుండి వాకిట్లోన్కి నడుస్తూ, ఇదో ప్రాబ్లమ్! ఈ నడ్మ ఎక్కువైతాంది' విసుక్కుంటున్నడు.

'బగమంతుడా దయజూడు. ఇది ఆయన మూడోసారి రాసుడు. ఇది ఆకరుసారంట.

ఇంకోపారికి ఒయిసు దాటిపోతుందంట.

సల్లగ జూడు తండ్రీ దేవుడా! పిల్ల సుకపడ్తది.' చేతులు పైకెత్తి దేవున్కి దండం బెడుతూ రాములమ్మ.

ఊళ్ళోకెళ్ళిన వీరస్వామి గొర్రెపోతును బేరమాడి తీసుకొస్తూండగా బర్లనాగమ్మ పల్కరించింది. 'ఏందల్లుడా గొర్రెపోతును తీస్కపోతుండవేంది? ఏంది సంబరం?!'

'నీకు దావతియ్యక శానదినాలాయ్. బిడ్డ వుట్టి నప్పుడిచ్చిన. అత్త తనను మర్సిపోయిండు అల్లుడు, అని అన్కుంటదని'

'ఓ ఇగ సాల్తీ నీ పరాశ్కెం. నేనొక్కదాన్ని ఆ గొఱ్ఱెపోతు నంతా తింటనా ఏంది. అస్సల్ ముచ్చటేందో సెప్పరాదోయ్!'

'తమ్ముడు నౌకరి పరీక్షల మంచిగ పాసైండు. ఈపారి నౌకరి గ్యారంటంట. వాడోల్లకు, దగ్గెరోల్లకు దావతిస్తత్తా, ఇగో అత్తా, మాటలమాట.ఆ దావత్ రోజు ఒగదినం ముందే సెప్త. ఆ రోజు నాకు ఇర్వై, ఇర్వయ్యైదు లీటర్ల పెరుగు గావాలె. పుక్కేనికేం గాదులే. మంచి ధరనే గట్టిస్త'

'అదేందల్లుడా,మధు నాకు సిన్నల్లుడు, నాకెందుకు పైసలు. తొల్తనౌకరి సేతుల వడ్డంక మీయమ్మ, నా పెద్ద బిడ్డతో కల్పి నాకు సీర వెట్టరా ఏం?'

ఇంటికి వచ్చి, గొర్రెను కొట్టంలోని గుంజకాడికి కట్టేయనీకె ఈడ్చుకపోతూ, వాకిట్లో ఫోన్ పట్టుకొని అసహనంతో నిలబడిన మధును చూసి, 'ఏందిరా మధూ చికాకు పడుతున్నట్లున్నవ్?'

'బావ సంజీవ్ రిజల్ట్ కనుకుందమంటె ఫోన్ కాంటాక్ట్ దొర్కుతలేదు.'

'ఔగద!..' అంటుండగానే ఇంట్లనుంచి ఫోన్ మోగిన శబ్దం విని,' ఏంది నా ఫోన్ ఇంట్ల మర్సిపోయి నట్లున్న. అందుకోవే లల్లీ'

'హలో హలో..ఆ..ఆ. అట్ ..ల..నా!'

'బావ మందు దాగి పొలంకాడ వడ్డడంట. పట్నం దీస్క పోయిండ్రంట. పాండి పోదం. అరే మధూ, మేం బోతం. పొలంకాడ్కి వోయి నాయినను దీస్కొని నీవెన్కరార.' అంటూ, అదివరకంతా సంకల బనీన్‌తోనే ఉన్న వీరస్వామి ఇంట్లకు వోయిండు, అంగితొడుక్కోనికె.

'ఏందీ! సం..జీవ సంజీవ! మందు దాగిండా! పేలయ్యిండేమో! ఈనౌకర్లమీన మన్నవొయ్య, నేనేం జేయాలె తండ్రో దేవుడా ఇట్లైందుకాయె తండ్రో!' గొడోమంటూ పడుసాల్లో కూలబడింది రాములమ్మ.

'అప్పుడే అంత కీడెందుకూహిస్తవ్. హాస్పిటల్‌కు దీస్కపోయిండ్రంటే పానం ఉన్నపుడు జూసి తోల్క పోయుంటరు గుండె వల్గకు, లేవ్ జెల్ది పోదం పా.' వీరస్వామి తల్లిని సముదాయిస్తూ రేణుకా గొఱ్ఱెనిడువు పక్కింట్ల..' అంటూ రేణుక కింకేదో చెప్పబోయి అటు చూసిన అతన్కి అంతకుముందే కట్టేసిన చోట కన్పడక పోవడంతో, తమ్మున్తో మాట్లాడుకుంట 'ఎట్ల గట్టేసినవ్నో జీవం కట్లిప్పుకొని పారిపోయింది.'

అనియంత్రితంగా, అలవాటుగా భర్త అన్న మాటను,' జీవం కట్లిడ్సుక పారిపోయినట్లుంది' మనసులో అనుకుంటూ ఏదో కీడు నిర్ధారణంగా తెలిసిందా?' అనుకుంటూ, అత్తా దానిదేముంది పా నడు జెపాట' అంటూ 'లల్లీ, తాలమేసిన వానె. సరే పా' అంటూ గేటుదాటిన్రు. ఊరు చేరినంక తెలిసింది. చనిపోయినంకనే పోలీసులకు తెలిపి పంచనామా చేసినంకనే పట్నానికి పోర్టుమార్టం కోసం పంపిమరీ ఫోన్ చేసిండ్రని.


పోస్టుమార్టం అయి రాగల మృతదేహం కొరకు ఇంటివద్ద ఎదురుచూస్తున్న బంధుమిత్రులు ఇరుగుపొరుగు జనం ముగ్గురు నల్గురు ఒకగుంపుగా వాకిట్లోని చెట్టుకింద, ఆవరణ రాతి పిట్ట గోడమీద ఆవరణావల బాటలో నిలబడి, కూర్చొని మాట్లాడు కుంటున్నరు.

పన్నెండేళ్ళ లలితబుర్రలో ప్రశ్నలు! 'ఉద్యోగం–ఏందీ ఉద్యోగం?–దానికింత ప్రాధాన్యత, అమితానందభరిత ఉద్వేగం!'

అందుకు పూరా భిన్నమైన మరణానికి తెగబడి ఐనవారిని దుఃఖసముద్రంలో ముంచేటంత ఉద్వేగం!

జవాబుల కోసం అన్వేషణ? గుంపులుగ చేరి మాట్లాడుకుంటున్న సమూహాల వద్దకు తిరుగాడుతుంది.

'ప్చ్! ఎంతపని జేసిపోయిండు పిలగాడు! మూడేండ్ల బిడ్డన్న యాద్కి రాలేదు పిలగాన్కి. ఆరెకురాల ఎవుసానికి ఒక్కడే కొడుకు, భూమంతా ఒక్క పంటకు గ్యారంటీ. రొండో పంటకు రొండున్నర మూడెకురాల పొలం ఎత్మినాన్. నౌకరి లేకుంటే బత్క లేకుండెనా?! దేశమాంత జెనం నౌకరితోనే బత్కుతాంద్రా' యాభై ఏండ్లుదాటిన ఒక పెద్ద మనిషి.



* * *

'ఒదిన, పాలోళ్ళింటి యారాలి మొగడు, సంజీవన్నకు తమ్మునొరుస, ఆఫీస్‌ల అటెండర్. ఆయన ఆర్నెల్లకో మూన్నెల్లకో, ఏదో ఒక ఫంక్షన్ వంకతోని ఒక కొత్త చీరనో, బంగారు నగ, సిన్నదో పెద్దదో, మార్కెట్లకు కొత్తదేదొస్తె ఆ మాడల్ తెస్తడు. ఆమె కట్టవల్సిందే. ఏస్కోవల్సిందే. ఉన్న పొలం పని గెట్టుమీద దొర్సాని లెక్క నిలవాడి సేపిచ్చుడే.నడుమొంచేది లేదు.

ఆమెతో తనను పోల్చుకోని గాచ్చు, ఎప్పుడు సీరియస్‌గ ఉంటదనీ, ముద్దు మురిప్యానికి తావియ్యదనీ బాధ పడేటోడు సంజీవన్న. అటు కాప్దనంల తండ్రికి తోడుగా ఉంటూనే, నౌకరి సాధించాలంటని రాత్రి పగల్లు బాగ సద్వెటోడు.' ఒక పక్కింటి పడుచు.

'అదేందో ఎప్పుడు ఒకటీ అరమార్కుతోనే కటాఫ్ ఒచ్చి నౌకరి తప్పిపోయేది.' కొనసాగింపుగా మరో యువతి.

'ఈ కాలం సద్వుకున్న వొయిసు పిల్లలకు బత్కనీకె నౌకరే కావాలె. ఆ నౌకరి కోస్రమే సద్వులు.'

'గా ఆలోచనను ఎగేసేదెవురు? ఎలక్షన్ లొచ్చినప్పుడల్లా, యాడాదికి లచ్చ ఉజ్జోగాలని ఒగరంటే,కోటి ఉజ్జోగాల నింకోరు..' మరొక ఇగురం తెల్సిన పెద్ద మనిషి.

* * *

అంత్యక్రియలు ముగించి ఇంటికి చేరిన రాములమ్మకు దినాలు గడిచినా రోజూ ఏడుపే. నిద్రకని ఇంటికి తీసుకొచ్చిన మంగతాయిని, దినాలకే అత్తగారింటికి తీస్కపోయి, మళ్ళీ పుట్టింటికే బిడ్డను తీసుకొని వచ్చింది. రేణుక కూడా ఆడబిడ్డ పుట్టెడు దుఃఖంలో ఉన్నదని అపురూపంగా చూసుకుంటున్నది.

* * *

'సావ్‌కారమ్మా, అర్ధకిలో ఉల్లిగడ్డ, పావుకిలో పెసర్ పప్పీయి!'

'నాకు సిన్న చక్ర టీడబ్బ ఇయి సావ్కారమ్మా'

కిరాణా కొట్టుముందు ఉదయం సుమారు 8 గంటలకే పోగయ్యిను జనం. నాకు ముందూ, నాకు ముందూ అంటూ పోటీ పడుతూ. ఆ ఊళ్ళో చిన్న చిన్న కొట్లెన్ని ఉన్నా, లేదనకుండా దొరికే ఒకే ఒక్క పెద్ద దుకాణమది మరి.

'జెర తాళుండి. నాకేమన్న నాల్గు సేతులుండయా! సూడు సూడంటని ఈ సేతికింది పిలగాడు ఈరోజే రాలేదు... ఈయనేమొ పూజలో ఉన్నడు, ఇస్తనే ఉండగద!' కసురుకున్నది షావుకారమ్మ.

'ఇగోమ్మ నాకు మంచినూనె, సక్కెర రొండే. నాకు మొదలీయమ్మా..' అంటూ ఆకాశంవంక చూస్తూ, 'పొద్దుగాల్నే మబ్బులు కమ్మినయ్, వానొచ్చేటట్లుంది..'

'ఇగో సావుకారమ్మా నేను ముందుగా లొచ్చిన. ఆయ్నకంటే నాకే ముందుగా లియ్యాలె.'

'ఏయ్ ఉండు పిల్లా. కల్లంల మిర్చి ఆరవోసినం, చినుకులొస్తె నాన్తయ్, నేనువోవాలె.'

'అదేం కుదరదు. నాకు పనిలేదా, నాగ్గుడ బడికి లేటైతది.'

ఇంతలో సావుకారి ఒచ్చిండు. 'స్వామియే శరణం!' అంటూ.

షావుకారమ్మ పక్కకు జరిగింది. షావుకారి నిండుగా నిరంధిగా ఉన్నడు. పూజ ముగించి వచ్చిండు. చిరునవ్వుతో ఒకరిద్దర్కి ఇచ్చిండో లేదో, ఫోన్ మోగింది. అందుకున్నడు.

'హలో హలో స్వామీ సెప్పుబ్బా..ఆ! అదెట్లైతది స్వామీ. లారీ మాల్. ఒచ్చి సూసి పోయినవ్ స్వామీ, గా ధరెట్ల కుదురుతది? లేదు స్వామి, కుదరదట్ల. ఇంకో యాడాదైనా ఉంచుకుంట. ఆరు వేలకు ఒక్కరూపాయి తగ్గేది లేదు స్వామీ నమస్కారం. శరణమయప్ప' ఫోన్ పెట్టేసి కస్టమర్‌ల వైపు తిరిగిండు. 'సెప్పుండిగ, బందెయ్య స్వామీ సెప్పు నీకేం కావాలె.'

'ఇగో క్రిష్ణమూర్తి సేటూ, నేను వీళ్ళందర్కంటె ముందొచ్చిన. పావుకిలో టీ డబ్బ, కిలో చక్కెర, పావు కిలో పుట్నాలు' లలిత కంఠంలో జిద్దు!

'లలితా, స్వామి అనే! సావ్‌కారి మాలేస్కున్నడు కన్పిస్తలేదానె?' షావుకారి మెప్పుకోసమని, అంత లోనే, 'అది మొండిపిల్ల, పడనీయదు. పద్దతంటది, దానికిచ్చి పంపు సామీ పంచాయి తెందుకు! తర్వాతే మిగిలినోళ్ళ నటుబెట్టి నాకిద్దుగానీ. సినుకులు ఆడోటీడోటి పడ్తనే ఉన్నయ్!..' ఆకాశం వంక చూస్తూ 'కాలంల మన్నువడ! వానలకో రుతువూ, కాలం లేకుండ వోయింది'

షావుకారికి పైసలిచ్చి తన సరుకులను అందుకొని, విజయగర్వంతో అక్కడున్నోళ్ళనూ, ముఖ్యంగా బందెయ్య వైపు చూస్తూ దుకాణం ముందుమెట్లు దిగింది.

'మిర్చి ధరనేనా స్వామీ నీవు మాట్లాడిందీ' తన సరుకులు కడుతుంటే మాట కలిపిండు బందెయ్య రైతు షావుకారితో.

'ఔ స్వామీ, ఐదు వేలంటాండ్రు. నేను గొన్నదే నాల్గున్నరకు, నీకు దెల్వందే ముంది?'

వాళ్ళ సంభాషణ జాగ్రత్తగా వింటూ అడుగులేస్తున్నది లలిత. పదిరవై అడుగులేసిందో లేదో చినుకులు పెరిగినయ్. తన సరుకు లందుకొని ఆదరా బాదరాగ పరుగు వంటి నడకతో తనను దాటిపోతున్న బందెయ్యను చూసి, తను తొందరబడి తప్పుచేసిన్నేమో అనుకుంటూన్న లలిత మెదడులో మళ్ళీ ఆలోచనల మథనం, 'వానొస్తుందని పంట తడుస్తుందనే ఆందోళన షావుకారి కెందుకు లేదు. రేటు గిట్టకుంటే, తను కోరిన ధర ఒచ్చిన్నాడే అమ్ముతనంటాండు. ...

బందెయ్య మామకు పంట, వ్యవసాయం, షావుకారి కున్నట్లు ఎత్మినాన్ వ్యాపారం కాదెందుకు? వ్యాపారమూ ఉద్యోగమూ, ఏ ఒడిదొడుకులులేని దాదాపు, ఒకే రకమైన రంధి లేని బతుకుదెరువులేమో! అందుకేనా, ఉద్యోగాలకోస్రం అంత...

'ఇంత సేపైందేమే బడికి టైం యాద్కి లేదానె?!' గేటుదాటి వాకిట్లో కొచ్చిన లలిత, తల్లి కసిరింపుతో పరధ్యానం నుండి బయట పడింది.

* * *

నాల్గు నెలల తర్వాత మంగ అత్తమామలు కోడలిని, మనవరాలిని తీసుక పోనీకె వచ్చిన్రు. కోడల్ని ప్రాధేయపడ్డరు.

'మంగా కొడుకైనా బిడ్డైనా నీవుగాక మాకింకెవరు తల్లీ. రామ్మా ఇంటికి పోదం.

ఇంటికి ఒక్కడే కొడుకంటని, మీవోళ్ళు గూడ మాకు, గదే నీ మొగన్కి, మేమడిగిందానికంటే ఎక్వనే ఇచ్చిరి. పెట్టిపోతలు జేసిరి. నీఇల్లు నీ జాయ్ జాత్ నీకుండది. రామ్మా, మాతల్లివి కాదు..' మంగతాయి మామ '..నొసటి రాత వాన్నట్ల అగ్గనగల్ల దీస్కపాయె.' అన్నాడు.

'ఆయన్ను నొసటి రాత దీస్కపాయెనా మామయ్యా, కనికరం లేనోడు. మందు దాగేటపుడు సన్నపిల్లన్న యాదికి రాలేదు రాతి గుండెకు. నేనేమన్న అది తక్వాయ్ ఇది తక్వాయంటని పోరువెడ్తినా అత్తా, పరీక్ష తప్పినప్పుడల్ల ఎంత దైర్నమిస్తి!'

'అయ్న లేని ఆ ఇంట్లా..ఆ...హుహ్ ..హ్వా..' అంటూ శోకమందుకున్నది.

కోడలు దుఃఖం పట్ల సానుభూతి ఉన్నా, కొడుకును గురించన్న మాటకు నొచ్చుకున్నది మంగతాయి అత్త, 'ఔ! కనికరం లేని కఠినాత్ముడు కొడ్కు –ఉంటెమాత్రం ఏం లాభం. వాడు లేని ఇంట్ల వాన్ని యాజ్జేస్కుంట ఇష్టం లేని బతుకు ఎందుకు బత్కుతవ్ బిడ్డా...' ఉబికి వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ అత్త నర్సమ్మ అన్నది.

'...పొయ్యా, ఆ పిల్లకు రావాలన్పించినపుడే ఒస్తది రా. మన్మరాలినైనా చూస్కునే అదృట్టం లేదేమో పా, లేవ్ నద్వు.'

'అత్తా అంతమాటనకు. ఒస్తది తీ. ఇంకో నాలుగైదు దినాలకు నే దీసుకొస్తలే..' ఏడుస్తున్న నర్సమ్మను సముదాయిస్తూ వీరస్వామి అన్నాడు.

'..పొద్దువోయింది.రేప్పొద్దుగాల్నే లేచి పోదురుండుండ్రి' అన్నాడు.

రాత్రంతా ఏమాలోచించిందో మంగతాయి, మరుసటి రోజు వేకువకు ముందే తయారై ప్రయాణానికి సిద్ధమై అత్త మామలకై ఎదురు చూస్తు పడుసాల్ల కూచున్నది.

మొదట అందరు ఆశ్చర్యపోయినా, వెంటనే తేరుకొని మంగతాయి అత్తగారింటికి పోడానికి సిద్ధమైనందుకు మెచ్చి, అత్త మామెంబడి పంపుతూ, బస్ స్టాపు వరకు సాగనంపిన్రు.

* * *

మేనత్త భర్త ఉద్యోగం సాధించలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన తదనంతరం కొనసాగిన దుఃఖం, అదే సమయంలో బాబాయ్ సాధించిన ఆనందసంబరోద్వేగ్నితలు లలితను బాల్యాన్ని త్వరితంగానే వయసుకు మించిన పెద్ద తనపు ఆలోచనాహిత, దేనినో అన్వేషించే హావభావ ధోరణిగల వ్యక్తిత్వానికి మార్చివేసినయ్. అరుదుగా మాత్రమే, అవసరానికే పిల్లతనాన్ని తెచ్చి పెట్టుకుంటుంది లలిత.

ఉద్యగ ఎంపిక పరీక్షా ఫలితాలు వెల్వడి నెలలు గడుస్తున్నా, ఎంపిక కానివాళ్ళ అసమ్మతి అసంతృప్తుల నడుమ కోర్టు కేసుల సాకుల్తో ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ కౌన్సిలింగ్ పిలుపు రాలేదు. మూడు నెలలు చూసి, మధు పట్నంలోని తన పూర్వ ప్రైవేటు కాలేజీ విధులలో చేరిండు. ఆయన ఉన్నత విద్యార్హతలు, ఉద్యోగం వచ్చే అవకాశాలు తెలుసుకొని ఆడపిల్లల తలిదండ్రులు మేమంటే మేం, అని ముందు కొస్తున్నరు. ఉద్యోగ నియామక పత్రాలందుకొని ఉద్యోగంలో చేరినాకనే వధువు ఎంపిక, పెళ్ళిముచ్చట అని ఖచ్చితంగా నిరాకరిస్తున్నడు మధుసూదన్.

అన్న అప్పుతెచ్చి కొనిచ్చిన టూ వీలర్ మీదే సుమారు 30/40కిలోమీటర్ల దూరంలోనున్న పట్నానికి ఉదయం 9 గంటలకే బయల్దేరి సాయం 7 గంటలకు ఒక్కోసారి 8 గంటల కల్లా ఇంటికి చేరుతున్నడు

కాలేజీలో వచ్చిన సంపాదననుండి నెలకు నాలుగైదు వేల చొప్పున ప్రతినెలా అన్న చేతిలోనో, తండ్రి చేతిలోనో పెడుతున్నడు.

మొత్తానికి ఫలితాలు వెల్వడిన పదకొండు నెలల పిదప, తరువాతి విద్యా సంవత్సరం నడుమలో అన్ని ఫిర్యాదులు కోర్ట్ వ్యాజ్యాల పరిష్కారానంతరం కౌన్సిలింగ్‌కు పిలుపందుకున్నడు మధుసూదన్. అటు పట్నానికీ, ఇటు స్వంత ఊరికీ నడుమ మెయిన్ రోడ్డుకు దూరంలో నున్న ప్రాథమికోన్నత పాఠశాలలో రెండవ జూనియర్ స్కూల్ అసిస్టెంటుగా ఎన్నుకుని ఉద్యోగంలో చేరిండు. తలిదండ్రులు, అటు అన్నతోపాటు, కొందరు అమాయక సహచర స్నేహితులు సైతం ఆశ్చర్య పోయిన్రు మధు ప్లేస్ ఎంపికచూసి. అటు పట్నం శివార్లలో, ఇటు సొంత ఊరిలోని ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న స్థానాన్ని ఎన్నుకోనందుకు.

ఆ రహస్యం ఆయనకు తప్ప మరెవ్వరికీ తెల్వదు.అతను కూడా చెప్పదలచుకోలేదు.ఎందుకంటే చదువై పోయినంక నిరుద్యోగిగా ఉన్న కాలంలో చాలా మంది బతకనేర్చిన ఉపాధ్యాయులను, అదే స్వభావం గల సంబంధిత ఉన్నతాధి కార్లను చూసి ఉన్నడు. విని ఉన్నడు. వారి బాటనే ఎంచు కున్నడు.

ఉద్యోగంలో చేరినంక ఇక ఆలస్యం చేయలేదు మధు. సూచనప్రాయంగా తల్లి దండ్రులకు చెప్పి,తనూ తన ప్రయత్నాల్లో భాగంగా తనవివరాలను బ్యూరో కందించిండు.

తల్లి రాములమ్మ తన ఆడబిడ్డ బిడ్డను మధుకు పరిచయం చేస్తూ, 'పిల్ల మీ ఒదినోలిగనే కుందనపు బొమ్మ. డిగ్రీ దాన్క సదివి మానేసింది. కట్నం ఏమంత ఇయ్యక పోవొచ్చు. నీకు నౌకరి ఉండనే ఉంది. అట్లని ఏమీ ఈయక పోరు. చేస్కుంటే బాగుంటది. ఐనోల్లబిడ్డ. ఆలోచించురా' ఆశపడి సూచించింది.

'అందం ఏం దెస్తది? మనమేమన్న కోటీశ్వరులమా? ఈ కాలంల ఎంత దబ్బున్నా తక్వనే. సర్కారుదో,ప్రవేటుదో నౌకరి జేయగలిగే సద్వు, నా నౌకరికి తగినంత కట్నం తెచ్చే కోడల్ని జూస్కోవాలమ్మా.' ఖుల్లంఖుల్లాగ కడ్పులో మాట కక్కిండు.

ఆ మాటలు చెవికి సోకి ఉలికిపడింద్రు రేణుక ఆమె మామ, ఇంటికి పెద్ద భీమయ్య.

'ఎంత త్యామానమొచ్చె వీన్కి నౌకరొచ్చెటాల్లకు' అనుకున్నట్లు బైటకే అని తలతిప్పి అటూఇటూ చూసింది, తన మాటను ఎవరైన వినలేదు గదాని. నడిమింట్లో తము దప్ప వేరెవరూ లేనందువల్ల, ఎవరూ వినలేదనుకుని స్థిమిత పడ్డది.

నెల లోపే రెండు ఎక్కడివో సంబంధాలొచ్చి, మధు నచ్చక వెనుకకు పోయినయ్. ఒక రోజు బ్యూరో మనిషొకరు పట్నం నించి వచ్చి ఫోటోలు, వివరాలిచ్చి ఆలోచించండని చెప్పి పోయిండు. మధు ఆలోచనా సరళి నచ్చక ఆ విషయాన్ని

గురించెవరూ స్పందించలేదు. ఒకరోజు ఏకాంతంగా తల్లితో తన పెళ్ళి గురించి దీర్ఘంగానే మాట్లాడిండు మధు.

ఆ మరుసటి ఉదయమే 11 గంటల సమయాన గేటు ఆవల ఒకకారు ఆగింది.

పడుసాలలో కూచొని పెసళ్ళు చెరుగుతున్న రాములమ్మకు, క్రితం రాత్రే చెప్పి ఉంచినమాట గుర్తుకొచ్చి, వాళ్ళే కావచ్చుననుకొని, చుట్టూ పరుచుకున్న చాప దాన్యం వస్తు సామాగ్రిని సర్దసాగింది.

అంతలోపే ముందురోజు వచ్చిన పెద్దమనిషి మొదటగా గేటుదాటి వాకిట్లోకొచ్చి 'అమ్మా నమస్తే.' అన్నాడు.

'మీరేనాయ్యా. మావోడు రాత్రే చెప్పిండు కని, రేపు ఒస్తరన్నడు..' అంటూ సర్దిన వాటిని ఇంట్లోకి తీసికెళ్ళుతూ 'ఈకుర్సీల కూసోండి, మీరు' అని నడిమింట్లో ఉన్న మరో రెండు కుర్సీలు వేసి, పడుసాలలోనే ఉన్న పలంగిమీద జంపుకాన పరిచింది.

ఇంటి వెనుక కెళ్ళి 'రేణుకా వాళ్ళొచ్చిండ్రు' చెప్పి,వెనుక దొడ్డి గోడకాడికి పోయి, పక్కింటోళ్ళనడిగి, మరో రెండు కర్చీలు తెచ్చి పడుసాలలో వేసి, పొలంకు పోయిన వీరస్వామికి ఫోన్ చేసి, విషయం చెప్పి భర్తను తోలుకొని వెంటనే రమ్మని చెప్పింది.

బైటకు బిరబిరా వచ్చి, బాయి కాడికి వెళ్ళి బకెట్లలో నీళ్ళుతోడి, సబ్బు తువాలు బావి గోడ మీద పెట్టి, మిగిలిన నలుగురితో, 'కాల్లు సేతులు కడుక్కోండి' అని చెప్పి ఇంట్లో కెళ్ళి పెద్ద చెంబులో నీళ్ళు తెచ్చి రెండు గ్లాసులనూ పలంగ్ మీద ఉంచింది. వచ్చినోళ్ళు కడుక్కొని చాయ్ తాగి, పలంగ్ మీదున్న పేపర్ను తలా ఓ పేజీని అందుకొని కాలక్షేపం చేస్తుండగా, అరగంట దాటిన తర్వాత వీరస్వామి, భీమయ్యలు పొలం నుంచి వచ్చిన్రు. ఆ మాటీమాటతో కాలం గడుపుతుంటే, మరో అరగంట తర్వాత, భోజనానికి లెమ్మని పిలిచింది రాములమ్మ.

'కతికితే అతకదన్నరు పెద్దలు. మొదలు మాట్లాడుకొని భోజనాలు కానిద్దం. అబ్బాయి గుడ వస్తనన్నడు, ఫోన్ చేసి వచ్చాం' అన్నడు మధ్యవర్తి, ఎట్లాగైనా తాము అతికించుకొని పోడానికే సిద్ధమై వచ్చినమనే విషయాన్ని ధ్వనిస్తూ.

అతనీ మాటంటుంగనే మధ్యాన్న విరామానికని లలిత వచ్చింది, ఆ వెంటనే మధువచ్చిండు. సూటిగా బింకంగా లోపలింట్లకు నడిచిండు.

పడుసాలలో భీమయ్య, వీరస్వామి వచ్చిన అతిథులూ కూర్చోగా,రాములమ్మ పడుసాలను నడిమింటికి కలిపే పెద్దర్వాజ గడపావల కింద తలుపు నానుకొని కూర్చోగా, రేణుక అత్తవెనుక తలుపు నానుకొని నిలబడి ఉండగా, మధు నడిమింట్లో నుల్కమంచం మీద కూర్చొని, కండ్లు టీవీ మీద, చెవులు చర్చల మీద ఉంచిండు. చర్చలు మొదలైనవి.

పెళ్ళికూతురి వైపు వాళ్ళు 15 లక్షల కట్నం ప్రతిపాదించిన్రు. వీళ్ళు కుదరదు 30 లక్షలన్నారు. కొంతసేపటికి వాళ్ళు18కి పెరిగారు, వీళ్ళు 28కి తగ్గిన్రు. ఇది గమనిస్తున్న లలిత, 'బాబాయ్ ఏందది తాడుగుంజేటి ఆట పోటీలెక్కుంది. చిన్నమ్మ ఫోటోల బార్బీడాల్ లెక్క ముద్దుగుంది, నానమ్మకు చెప్పు, ఏదో కాడికి ఒప్పుకోమని.'


'నాకేమీ తెల్వదురా నన్ను పెంచి పెద్దజేసింది వాళ్ళు. వాళ్ళిష్టం' నంగనాచిగా తప్పుకున్నడు. లలిత పిల్లి లాగా నాయినమ్మ వెనుక చేరింది. మోకాళ్ళమీద కూచుని, 'నానమ్మా మొన్న నీవు బండెడ్లను యాభైవేలు చెప్పి ఆకర్కు మప్పైఐదు వేలకే అమ్మలే! మంచి గుంది, పెద్దగ సద్వుకున్నది గుడ చిన్నమ్మ. జెల్ది యాడ్నోకాడ్కి జెర తక్కువైనా బ్యారం తెంచేయ్!' చెవిలో గొణిగింది.

'ఏయ్ పోరి పెద్దోల్ల ముచ్చటనీకెందుకే, ఆడ టీవీ ముంగల బాబాయ్ కాడ కూసోపో.' కసురుకుంది. ఈ తతంగా న్నంతా అమితాశ్చర్యంగా బిత్తరపోయి చూస్తున్నది రేణుక.

చివర కటుగుంజి, ఇటుగుంజి 25కు కుదిరింది. అందులో 15 ఇద్దరి పేర బ్యాంకులో వేసేటట్లు, పది తులాల బంగారం వీళ్ళు పెట్టేటట్లు కుదిరింది.

లలిత తల్లిముఖంలోనికి నర్మగర్భంగా చూసింది. ఆ ముఖం పాలిపోయున్నది.

మూడున్నర లక్షలు వధువు బంగారానికి, ఇంటాడి బిడ్డకు లక్ష నగదు ఆడిబిడ్డ కట్నానికీ, ఇంటిల్లిపాది బట్టలకు, పట్నంలో వధువు ఇంటి వాళ్ళు చేపిచ్చే వివాహానికి, బంధు వులను, ఊరి దగ్గెరోల్లను తీసికెళ్ళి తీసుక రావడానికి వంటి ఇతర ఖర్చులకు మూడు లక్షల వరకు పోగా, మధు బండి అప్పు బకాయి పోగా, మధు తలి దండ్రుల చేతిలో సుమారు లక్షన్నర మిగిలినయ్. అందులో అరవై వేలు మధు తీసికొని, ఆయనకు అత్తగారు పెట్టింది గాక మరో ఉంగరం చేయించుకుని, పట్నంలోని కాలేజీలోని దోస్తులకు ప్రత్యేక దావత్ ఇచ్చిండు.



భార్యతో మధు సుమారు రెండు నెలలు ఇంట్లో ఉన్నాడు. తర్వాత ఉద్యోగ పోటీ పరీక్షల కోచింగ్ కోసం భార్య పట్నంలోని తల్లిగారింటికి చేరింది, ఉన్నత విద్యావంతురాలూ నిరుద్యోగీ ఐన కొత్త కోడలు. మధు కూడా క్రమంగా అత్తారి ఇంటి పక్షే అయిండు. నెలలో వరసగా రెండుమూడు రోజుల సెలవులున్నపుడు మాత్రం ఇంటికొచ్చి ఉంటున్నడు. అన్న, తలిదండ్రులు చేయిస్తున్న వ్యవసాయంను చూస్తున్నడు. వ్యవసాయ ఫలాలను తన లెక్కలతో అంచనా వేస్తున్నడు.

ఒకరోజు పొలం నుండి ఇంటికొచ్చినంక స్నానం చేసి విశ్రమించిన సమయంలో, తండ్రీ అన్నతల్లుల సమక్షంలో

'అన్నా ఎండల ఎండుతూ, వానల తడుస్తూ, చలిల వణుకుతూ ఈ మట్టిల పొర్లుతూ స్థిరం లేని రాబడి కోసం కష్టపడుడెందుకు, మేం నల్గురు దోస్తులం కలిసి, పట్నంల ఉద్యోగాల పోటీ పరీక్షలకు కోచింగ్ ఇయ్యనీకని, ఒక సెంటర్ మొదలు పెట్టాలనుకుంటుండం. తలా ఐదైదు లక్షలు మూలధనం పెట్టుబడి పెట్టి ఒక బిల్డింగ్‌ను లీజుకు తీసుకొని, కొంత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చు కోవాలె. పంటకు సమానంగనే ఒక్కోసారి ఎక్కువనే ఆదాయం వస్తది. ఓ ఎకరం భూమి అమ్ముదమా?'

భీమయ్యకు మండింది.కాని వాదనకు దిగదల్చు కోలేదు. కొడుకుల భిన్న అంతరంగాలు పరిశీలిస్తూ, మార్పులను అర్థం చేసుకుంటున్న ఇగురం గల్లోడు ఆయన.

'మంచిది రా,నీ వాటా ఏమన్న వస్తదని నీకనిపిస్తే, అది ఎంతో, ఎట్లో, లెక్కసరిజెప్పి, ఎంత దీస్కుంటవో,ఏంజేస్తవో జేస్కో. నీ కట్నం పైసలింకా లక్షదాన్క మిగిలే. మాకాడే ఉన్నయ్. ఇంకో మాట! ఉన్నదంతా మీతాత నాకిచ్చిందేమీ కాదు. రెండెకరా లిచ్చి, ఒగ పెండ్లికున్న సెల్లెనిచ్చి పోయిండు. నిన్ను సదువులకు ఇడ్సి, పెద్దోడు నేను గల్సి, ఏడెకురాలు జేసినం. ఒక్కెకురం మీ యక్క మంగతాయి కిచ్చినం, మీన్నెల్లి ఐదు లక్షలు నగదుగ ఇచ్చి, పెండ్లి జేసినం. మీ వదిన, నా బామ్మర్ది పిల్లంటని, ఒత్తిగనే జేస్కుంటనంటని పెద్దోడంటే, వాళ్ళే మర్యాద కంటని, లచ్చ రూపాలిచ్చిండ్లు. ఆయమ్మ కపుడు రొండు తౌలాల బంగారం బెట్టినం గని, ఆయమ్మ పైసలూ ఇంట్లనే వద్దయ్.

బాగ పే..ద్ద సదువు సద్వినోడివి.ఉజ్జోగం జేసెటోన్వి. ఉజ్జోగాలకు పోటీ పరీచ్చలు, ఆ పరిచ్చలకు కోచింగులిస్త నంటానవ్. ఇచ్కో. నీయంత తెల్వి పెద్దోన్కి లేదు. దెల్వదు. నా కస్సలే దెల్వదు. అక్కకిచ్చింది ఒక్కెకురం బోంగ, బూమంతా నాపేర్మీదనే ఉన్నది.

'ఇగ తిన్నీకె లేస్త. ఏమే రేణుకా వొంటైందానె?' అంటూ లేచిండు భీమయ్య.

పడుసాల్లో కూర్చొని ఏదో పని జేస్కుంట వాకిట్ల కుర్సీ, మంచంమీన కూర్చున్న తండ్రీ కొడుకుల మధ్య జరిగిన సంభాషణ విన్న రాములమ్మ, మంచిగ వాత వెట్టిండు సిన్నోనికి తన మొగుడనుకున్నది. 'ఉజ్జోగాలిప్పిస్తడంట మనగాడు ఉజ్జోగాలు! ఈయ్న ఉజ్జోగం జేసి, ఎల్గవెట్టిండాంటని!'

తనలోనే గొణుక్కుంటూ నడిమిల్లు దాటి ఇంటెన్కకు నడిచింది, కాళ్ళు చేతులు కడుక్కోనికె నడుస్తున్న మొగడి వెంటనే అడుగులేస్తూ.

* * *

లలిత స్కూల్ ఫైనల్. ఉదయం ఎనిమిది గంటలకే స్పెషల్ క్లాస్. సాయం బడి విడిచినంక ఐదున్నర దాన్కా క్లాసులే.

ఒకరోజు బడికి ఉదయం వెళుతుంటే బర్లనాగమ్మ ఇంటి ముందు పదిపదిహేను మంది జనం! 'ఏం మాయదరి రోగం దేవుడో ! వారంగుడ గాలేదొక బత్తె జచ్చి, మల్ల ఈయాలొగటి...' నాగమ్మ ఆక్రందన వినిపిస్తున్నది, 'గొడ్ల డాక్టరా వాని పెండ్లాం ముండవొయ్య..', ఎవరి పరామర్శ ప్రశ్నకో జవాబిస్తూ, '..ఆయ్నెప్పుడొస్తడో ఎప్పుడుం టడో ఎప్పుడు వోతడో, ఎవన్కి

దెల్సు నాయ్నో, ఓ నాయ్న! ఇగ మేమెట్ల బత్కాలె దేవుడో...' నిలబడి వివరాలు తెల్సుకునే సమయం లేక, రెండు నిమిషాలాగి ఆవరణ దాటి లోపలికెళ్ళే ప్రయత్నం చేసి, మళ్ళీ వెను దిరిగి వడివడిగా బడికి బైల్దేరింది. సాయంకాలం తిరిగి వస్తూ నాగమ్మ ఇంటి వద్ద ఆగి వివరాలు తెలుసుకున్నది. వారం దినాలుగా తనకున్న నాల్గు బఱ్ఱెలు సొల్లు గారస్తూ కడుపుబ్బి ఆయాస పడుతున్నవట. గొడ్లదవఖాన తెర్సినంక, ప్రత్యేక డాక్టర్‌ను నియమించ లేదని. ఒగ కాంపౌండర్ను మాత్రమే ఇచ్చింద్రంట. ఆయనంతంత మాత్రమే నంట. పొరుగూరి డాక్టరే ఈ ఊరి దవఖానకూ ఇంఛార్జ్ అంట. ఏ ఊళ్ళ ఎప్పుడుంటడో తెల్వదంట.

'బంగారు తెలంగాణల ఈ ఉద్యోగా లేందో! మనుషుల దవఖానల పరిస్థితీ అంతే ఉంది. ఉద్యోగుల పరిస్థితీ అంతే ఉంది...', ఉదయం నాగమ్మవ్వ యాతన గురించి, సార్ నడిగితే చెప్పిన మాటలు.'

'ఏం ఉద్యోగాలమ్మా, కేసీఆర్ రాకముందో మాట, ఒచ్చినంకో మాట. రాకముందు తను సాధించబోయే రాష్ట్రంల కాంట్రాక్టు ఉద్యోగాలే ఉండవనె. ఆనాడున్న కాంట్రాక్టుద్యోగు లాందర్నీ పర్మినెంట్ జేస్తమనే. రాష్ట్రమొచ్చినంక, పాతోళ్ళను రెగ్యులరైజ్ చేసుడటుంచి, ఆయననే కొత్తగా కాంట్రక్టు ఉ ద్యోగులను నియమించవట్టె. కొన్ని రంగాలల్ల ఇంఛార్జ్ లే గతి. ఒక్కొక్కర్కి రెండు చోట్ల పని. ఇదే సందని వాళ్ళు కొందరు ఇక్కడా, అక్కడనీ తప్పించుకుంటరు. పోలీసులను మాత్రం యాడాదికి రెండు, మూడుసార్లు రెగ్యులర్‌గనే అప్పాయింట్ జేస్కోవట్టె.'

'నా సంగతే చూడమ్మ. ఎమ్మే బీయెడ్ జేసిన. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఎదురు జూస్తుండ. ఫలానా నెలలో డీయస్సీ, ఇగో అగో అని మనరాష్ట్ర తొట్ట తొలుత విద్యా శాఖ మంత్రి చెప్పినప్పుడల్ల మూడు సార్లు కోచింగ్‌కు వోయిన. పైసలు పోయ్నయ్ గాని, డీఎస్సీ ఇంతదాన్క లేదు. ఇపుడు టీఎస్‌పిఎస్సీ అంటాంద్రు. దాని ద్వారా గుడ రెగ్యులర్ నౌకర్లు లేవ్. అటు గాని ఇటుగాని గురుకుల ఉద్యోగాలిచ్చె. ఇచ్చే ఆ అరకొర జీతాలు నెలనెలా రావు. వాళ్ళ ఎమ్మెల్యేలకూ, మంత్రులకు మాత్రం, చాయ కర్చుల కని, లక్ష లోపున్న జీతాలను, రెండున్నర లక్షలకు వెంచె దొర. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కాదు గదా, ఏ ప్రతిపక్ష పార్టీవాళ్ళూ గూడ ఇదేమిటని, మాయసొంటి, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల సంగతేమి టంటని అడ్గక పోయిరి.ఎందుకో తెలుసామ్మా?'

'పెద్దగ తెల్వక పోనీకేముంది సార్! డబ్బెవరికి చేదు? వాళ్ళసేతుల పని.'

'అసలు ఐదేండ్ల తర్వాత ఉంటరో ఉండరో తెల్వని వాళ్ళ కంత జీతాలెందుకో తెలుసా నానా?'

'తెల్వదు, ఎందుకు సార్!'

'తర్వాత టర్మ్ గెల్వకున్నా జీవితాంతం పెన్షనే!' చెబుతూ నవ్వెండా కాంట్రాక్ట్ వేతన జీవుడు.

'మీకు పెన్షన్లుండవా సార్? సరే ఏదో ఓ లెక్క ఉద్యోగులే గద!'

'ఎపుడు దీసేస్తరో తెల్వని కాంట్రాక్ట్ కూలీలమమ్మా, మేం. మాకు పెన్షనేంది నానా!లి

ఒగాయనంటడు, యాడాదికి కోటి ఉద్యోగాలంటడు ఊరిస్తడు. గెలుస్తడు. గెల్సినంక, మీరన్న యాడాదికో కోటి ఉద్యోగాలేవని అడిగితే, 'రోడ్ మీద పకోడీలూ చేసుకునేది గుడ ఉద్యోగమే' అని ఒగాయనంటే, మన బంగారు తెలంగాణ రాష్ట్ర మంత్రి 'ప్రైవేట్ రంగమే బెటర్ మన సత్తా నిరూపించుకోనీకె' అంటడు.'

'నమస్తె సార్. ఇక వెళ్త. టై మైతుంది.' అని చెప్పి ముగించి, 'అసలీ రాజకీయాలకు, ఉద్యోగాలకూ, వాటిపై ఆశలకూ ఏందో లింక్ బలంగనే ఉంది.'అనుకున్నది.

* * *

కాలచక్రం తన సహజ సగటు వేగంతో నడుస్తుంది, తిరుగుతున్నది. కాని, ఎన్నికైన ప్రభుత్వాలు, అభివృద్ధి చక్రాలను త్వరణీకృత వేగంతో తిప్పుతున్నరు. రుతువులు మాత్రం తమ సహజ గతులను తప్పి, సామాన్యులనే కాదు, సంపన్నుల జీవితాలనూ స్వల్పకాలికంగా నైనా ఛిన్నాభిన్నం చేస్తున్నవి.

చదువు కొన్న యువకులు, స్వల్పమైనా, సమాన కాల వ్యవధులలో చేతికందే ప్రైవేటైనా, మట్టి అంటని ఉద్యోగాలకు అలవడుతున్నరు. అందుకుగాను, విద్య అనే అక్షరాస్య తపై, కాగితాలకే ఐనా పరిమితమయ్యే డిగ్రీల పట్టాలపై మోజు పెరుగుతున్నది.

ఇంటర్మీడియట్ ఎమ్పీసీతో 'ఏ' గ్రూపులోనే పాసైన లలితతో, మధుసూదన్ తన కోచింగ్ సెంటర్‌లో ఎంసెట్ శిక్షణకు ఉచితంగానే సీటిప్పిస్తానన్నడు. లలిత వినలేదు. తల్లి దండ్రులతో చెప్పించినా వినిపించుకోలేదు. మామూలు బీఎస్సీ చేస్తానన్నది.



ఒకరోజు, 'తాతకు పాణం బాగలేదు. నాకు పట్నంలో రెవెన్యూ ఆఫీసులో పనుంది. పోయి పొద్దుమూకేవరకు ఒస్త బిడ్డా. జెర ఈరోజు పగటి పూట మొక్కజొన్న సేనుకు కావలి పో నానా' తండ్రి చెబితే పట్నంలోని కాలేజీకి పోకుండా, చేనుకు కావలికి పోయింది లలిత.

సూర్యుడు అస్తమించి, దశమి చంద్రుడు, పగటి వెలుతురు తీక్షణ వెలిసిన తెరనుండి చూస్తున్నాడు. ఎప్పుడెపుడు ఈ సూరి మామ తెర పూర్తిగా చిరిగిపోతుందని ఆత్ర పడుతున్నడు. వీరస్వామి రాలేదు.

లలిత, ఆ ప్రకృతిని, ఆ సమయంలో చూడక చాలా ఏండ్లైంది. అసలు గుర్తు లేదు. తండ్రింకా రాలేదనే ఆలోచన వచ్చినట్లేవచ్చి, జాడలేకుండా పోయింది.

పొలాన్నానుకొని ఉన్న చెరువు కట్టకు ఒకంచుమీదున్న చింత చెట్టుకాండాని కానుకొని కూర్చొని, నీడలోనుండి,ఒకవైపు పొలం, పొలాలనావలున్న ఊరిలోనున్న మిణుకు మిణుకు మంటున్న విద్యుత్ దీపాలు, అస్పష్టంగా కనబడుతున్న ఊరిచివరి ఇండ్లు, మరోవైపు చెరువెండి పోగా, గుంటల్లో ఉన్న నీళ్ళు-నీళ్ళపై వాలిన వెన్నెల ప్రతిబింబాలు, చెరువు పాతదైన వన్నె వెలిసిన చీరెపై, నేతకాడు అల్లిన పెద్ద పెద్ద పట్టు పూలలా మెరుస్తూన్న దృశ్యాన్ని చూస్తూ, తనున్నది ఈ భూలోకంలోనేనా అని ఆశ్చర్యానుభూతులతో ఆనంద పరవశు రాలై ఉన్నవేళ,వెనక నుండి ఏవో అడుగుల చప్పుడు!

ఒకరివి కానట్లు, కొంతమంది గుంపువన్నట్లు, క్రమ క్రమంగా దగ్గరౌతున్నట్లు వినిపించి,వెనుకకు తిరిగి చూద్దామని అనిపించినా, ఆ ఎవరైతే తనకెందుకని కళ్ళను మనసును,మళ్ళీ ప్రకృతి మాత అందాలను చూస్తుంటూ కూచుంది.

'చెల్లే, ఎవరు నీవు? ఎందుకిట్ల ఈ సమయంల ఒంటరిగా కూసున్నవ్?' ఒక మానవాకారం ప్యాంటు, నిండు చేతుల చొక్కాతో ఎదురుగా నిలబడి అడిగింది.

వెంటనే స్పందించకుండా, ముఖంవైపు చూసే ప్రయత్నం చేసింది.

అసలే మసక వెలుతురు. దానికి తోడు తలపై మంకీ క్యాప్. కుడి భుజానికేదో వేలాడుతున్నది. వీపుపై బరువైన బ్యాగ్ ఉన్నట్లు కొద్దిగా వంగి నిలబడినట్లుందా ఆకారం. కించిత్ అహేతుక ఝుడుపు కలిగినట్లై, అంతలోనే మనసును గట్టి పరుచుకొని, కూచున్నచోటనే నడుము తిప్పి వెనుకు చూసింది. ఔ! మరో ఏడెనిమిది మందిదాన్క ఉన్నట్టున్నరు.

మంచి ఆనందం చెడిపోయిందనే చిరాకు, తనూహకు వస్తున్న వాళ్ళమోనన్న భయం! వినడమే గాని ఎన్నడూ చూడని వాళ్లను చూస్తున్నాననే సంభ్రమం-భావాలు ఆలోచనలు గజిబిజిగా. ఐనా అవేమీ కన్పించకుండా, తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో, 'నేను మాపొలంకాడ కూచునుంటే, నన్నెవరని అడ్గుతున్నవ్! ఇంతకు మీరెవరు?..' ఆగి, పరిశీలనగా ఆసక్తిగా చూస్తున్నది, '..అన్నలా?!'

'ఔ! అక్కలం కూడా. నీముందున్నది మా అందరికీ అక్క. కమాండర్.' వెనుకనుంచి ముందు కొచ్చిన ఒక దళ సభ్యుడు.

'సెల్యా,గట్టిదానివే.మేం పదకొండు మందిమి. శతృ సైన్యం తరుముతుంటే తప్పించుకొని దారితప్పి ఇటొచ్చినం. ఆడ కనిపిస్తున్నది ఏ వూరు? నీ పేరు?'

'ల్..లా..లా..' తడబడుతుంటే,

'ఆ. తప్పేం కాదు, లాల్ సలామ్ సెల్యా. నాపేరు శాంత!'

'నా పేరు లలిత.సెప్పుండి'

'ఏం లేదమ్మా ఒగరోజుకు పైగా ఏం తినలే. ఆకలైతాంది. తలా ఒక కంకిస్తవా'

'నన్ను మానాయిన కావలి కూసోవెట్టిండు. నేను చెప్పలేను. మానాయిన ఇదివరకెప్పుడో రావాలె, ఆల్సెమైంది. జెరసేపుంటరా, మావైపు మీ భయం లేదు.

గన్క మీకూ వాళ్ళ భయం ఉండదు. మా నాయిన కాదనదు గావచ్చు. ఒచ్చినంక అడ్డడం మంచిదన్నా'

అలిసున్న అందరూ వీపుమీద బ్యాగులు భుజాలకున్న తుపాకులు దించు తుండగానే, కట్టకింద ఊరివైపు చెట్ల నడుమ నుండి, 'లల్లీ లల్లీ...'అంటూ ఆడ మగ స్వరాలతో పిలుపులు, సమీపి స్తున్న అడుగుల సవ్వళ్ళు.

అందరూ నిశ్శబ్దమై చూస్తుండగా, 'అమ్మా నాయినా, ఈన్నే ఉన్న. చెర్వు కట్టమీద. మంచె మీన్నుంచి దిగి ఈడి కొచ్చి కూకున్న.'

'తల్లీ ఆఫీస్లనే లే..ట..య్...' బిడ్డతోనున్న ఆకారాలను చూసి, మాట ఆగిపోయింది. విస్తు పోయారు. వెంటనే మాటలు రాలేదు. మెల్లగా కూడదీసు కుంటూ 'వీల్లెవరే. నీ సుట్టూత!' వీరస్వామి, కూచున్నవాళ్ళవైపు చూస్తూ.

'వీరస్వామన్నా నేను. నేను బాల్ రెడ్డిని. మాసిరెడ్డి కొడ్కుని.' పరిచయం గుర్తుచేసిండు దళంలోని మరో దళసభ్యుడు, 'ఇది మనూరా! గుర్తు వట్లే.'

'ఓయ్ పిలగా! నీవు ఇక్కడ!!. నీవూ.. పోలీసులను మానించినట్లే. అన్నల్ల!! ఆర్నెల్లుగూడ కాలేదు, పోలీసులు మీ అయ్యను, అవ్వను పట్కపోయి కొట్టి నీ గురించి అడుగు తుండరని తెల్సి, సర్పంచు ఎమ్పీటీసీలతో కొంత మందిమి ఎమ్మల్యే కాడ్కి వోయ్ సెప్పిచ్చి ఇడిపిచ్చు కోనొచ్చినం. మీనాయిన సెల్ ల, వేరే రాష్ట్రాలల్ల నీవు పాల్గొన్న, లెఫ్ట్ పార్టీ క్యాండిడేట్ల తరపున, ఎన్నికల ప్రచారంల దుమ్ములేపుతున్న యూ ట్యూబ్ వీడియోల ఆధారాలు సూపిచ్చి, ఇడ్సి పిచ్చొచ్చినం. ఇదేంది?'

'అయ్యన్ని ముచ్చట్లు తర్వాత గని...'

వాళ్ళ ఆకలినీ, అభ్యర్థననూ చెప్పింది లలిత.

'దానికేం భాగ్యం. కావల్సినన్ని బేఫికర్గ దినుండి. కూకోండి. నేను కంకులిర్సి కాల్చుకొని దెస్త.' అని పొలంలోనికి కట్ట దిగుతుండగా, 'కామ్రేడ్ నీవూ పో,తోడుగా. ఒక్కూరోల్లు మాట్లడుకుంట పని జేస్కరాండ్రి.' కమాండర్ ఆదేశించింది. వాళ్ళటు వెళుతుంటే, 'నేను కాల్చనీకె ఏర్పాటు జేస్త' అంటూ రేణుకా వాళ్ళననుసరించింది.

ఇక్కడ: 'అక్కా నాకు మీ గురించి, ఇంకొన్ని మా విషయాల గురించి, కొన్ని అనుమానాలు, ప్రశ్నలున్నయ్. జవాబు జెప్తరా?'

'అడ్గు చెల్యా. ఏం దాస్కోకుండ అన్నీ అడుగు. మా వోళ్ళు ఒకరిద్దరు దప్ప బాగ,పెద్ద పెద్ద సదువులు సదివినోల్లే.' 'మేం పుస్తకాలు, అందుట్ల కాయితాలు సదివినం. అక్క ప్రపంచాన్ని సద్వింది.' మరో లేడీ కామ్రేడ్ సరిచేసింది నవ్వుతూ.

రేణుక, ఉద్యోగం బతుకుదెరువూ రాజకీయాల గురించి ప్రశ్నమీద ప్రశ్న వేస్తూ వాళ్ళ జవాబులు వింటూ చాలా ప్రశ్నలువేసి, సమాధానాలు వినడమే కాదు, సమాధాన పడ్డది.

దండకారణ్య ప్రాంతంలో వాళ్ళ చిన్న రాజ్యంలో, వేతన ఉద్యోగాలంటూ ఏమీ లేవనీ, ప్రాథమిక స్థాయి విద్య, ఉత్పత్తికి సంబంధించిన అన్ని పనులూ అందరూ చేస్తరనీ, స్పెషలైజేషన్ లున్నా, వంతులవారీగా అందరూ అన్ని పనులూ చేయడంలో ప్రాథమిక జ్ఞానం, సామర్థ్యం కలిగి ఉంటరనీ, నాయకులకూ, రక్షణ రంగ ఆర్మీకి ప్రత్యేక బడ్జెట్ కెటాయింపులూ, సౌకర్యాలేమీ ఉండవనీ, అందరితో పాటే వాళ్ళకనీ, కొన్నిసార్లు నాయకత్వం, ఆర్మీలకే కూడూ, గూడూ, నిద్రా సరిగా, స్థిరంగా ఉండవనీ, ఉత్పత్తి చేసిన, సేకరించిన సంపదను అందరికీ సమంగా పంచ బడుతుందనీ, విద్య వైద్య సదుపాయాలకు కావలసిన మౌలిక సదుపాయాలు, వనరుల కల్పన మాత్రం లభించినంతలో అన్నీ సమకూర్చు తారనీ... ....ఇట్లా వాళ్ళ రాజ్యంలోని ప్రతీరంగపు సారాంశాన్ని తెలుసుకున్నది.

కంకుల కోస్రం పోయిన కాడ వీరస్వామి, తన అనుమానాలు తీర్చుకున్నడు. 'ఇగో పిలగా ద్విపాత్రాభినయం నడ్వదు. జాగ్రత్త!' చెప్పిండు.

అంతలో కాల్చిన కంకుల మూటలతో ముగ్గురూ వచ్చిండ్రు. తలా రెండూ మూడూ తిన్నకాడికి తిని, తలా రెండు చొప్పున కిట్ బ్యాగులల్లో సదురుకొని లేచిండ్రు ఆయుధాలను భుజానికేసుకున్ననరు. వీడ్కోలు చెప్పడానికి.

ప్రతి ఒక్కరూ చేతులు కలిపి పిడికిలెత్తి లాల్ సలాం చెప్పబోతుంటే, 'అక్కామీరు చెప్పింది వింటే బాగనే ఉంది గానీ, కేవలం విని నమ్మేదెట్లా? ఒగసారి వచ్చి చూస్తే తెలుస్తది గద, నిజం!!'

'చాలా మంచి డౌట్ చెల్లే. ధైర్యం గల దానివి. కానిపుడే మాతో వస్తానంటే కుదరదు. నీకున్న ధైర్యం చైతన్యాన్నే జనంలో కల్గించాలె. చదువు పూర్తయ్యే దాన్క ఇక్కడే పనిజేయ్. లాల్ సలాం!' పిడికిలెత్తింది కమాండర్ శాంత. ఆమెతో పాటే మిగిలినవాళ్ళూ.

వాళ్ళు బాట పట్టి దూరమౌతుంటే,

వీరస్వామి, తన సెల్‌ను ఆన్ చేసిండు.

'ఎవ్వరో ఈ బిడ్డలూ-నింగిలో నెలవంకలూ..' పాటకు గొంతు కలిపిండ్రు, తల్లీదండ్రి, బిడ్డ. T




వామపక్ష, విప్లవ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో

అక్టోబర్ 23న హైదరాబాద్ – సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన

నిర్బంధ వ్యతిరేకసభలో ప్రసంగిస్తున్న వక్తలు,


సభకు హాజరైన ప్రజా సంఘాల కార్యకర్తలు

RNI Number : APTEL /2011/37247

ISSN 2349 - 2376
Publishing Date : 24 - 12 -2019

మత ప్రాతిపదికన
మనుషుల మధ్య విభజన
రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

#BoycottNRC
#RejectCAA




To

Printed Matter **BOOK-POST**

Stamp

చందాదారులుగా చేరండి - చేర్పించండి
సంవత్సర చందా200/-రూ.

నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్:
62254225854, ఎస్‌బీహెచ్,
రాంకోఠి బ్రాంచ్ (20350), హైదరాబాద్

*From :*

ఎడిటర్, నడుస్తున్న తెలంగాణ
క్వార్టర్ నెం. ఆర్-9, ఉస్మానియా క్వార్టర్స్, ఓయూ,
హైదరాబాద్- 500 007, ఫోన్ నెం. 9290745490

**Printed, Published and Owned by** M.SNEHA LATHA Printed at: TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No. 6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Published at : TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No.6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Editor :Dr.C.KASEEM. RNI No. APTEL/2011/37247